www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


మొయిరాంగ్‌లో రాహుల్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళ

మీ సోదరుడినవుతా

శాంతి నెలకొనేందుకు మీతో కలిసి పనిచేస్తా
పరిస్థితి మారుతుందనుకున్నా.. నిరాశే మిగిలింది
ప్రధాని మోదీ ఇక్కడకు వస్తే బాధితులకు కొంత ఊరట
'మణిపూర్' మహిళలతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
పునరావాస శిబిరాల్లోని బాధితులకు పరామర్శ

2

మంగళవారం | 9-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 101 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: తదియ ఉ. 6.09 తదుపరి చవితి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 7.53 తదుపరి మఖ; వర్జ్యం: రా.9.04-10.49, దుర్ముహూర్తం: ఉ.8.26-9.18, రా.10.25-11.08; అమృతఘడియలు: ఉ.6.09-7.53, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో..

స్కిల్ యూనివర్సిటీ

గచ్చిబౌలి ప్రాంగణంలో ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలన్న సీఎం రేవంత్

వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయండి
అసెంబ్లీ సమావేశాలకు ముందే నివేదికివ్వండి
24 గంటల్లోనే తగిన నిర్ణయం తీసుకుంటాం
కోర్సులు, పాఠ్యాంశాలపై అధ్యయనం చేయండి
వర్సిటీ ఏర్పాటు వ్యవహారాల పర్యవేక్షణకు..
నోడల్ డిపార్ట్‌మెంట్‌గా పరిశ్రమల శాఖ: రేవంత్
పారిశ్రామికవేత్తలు, అధికారులతో సీఎం సమీక్ష


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ఒకటి రెండు రోజుల ముందుగానే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో

మిగతా 13వ పేజీలో...

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ చల్లా?

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మండలి సభ్యుడు
జిల్లా సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం
అలంపూర్ ఎమ్మెల్యే విజయుడూ హస్తం గూటికే?
ఇద్దరూ కలిసి పార్టీలో చేరతారని ప్రచారం
అదే జరిగితే పాలమూరులో బీఆర్ఎస్ ఖాళీ

14

నేతలూ తిరిగి రండి

12

రాహుల్‌ను ప్రధానిని చేయాలన్నదే వైఎస్ లక్ష్యం
దాన్ని నెరవేర్చేందుకు అభిమానులు సంకల్పించాలి
పార్టీ కోసం పని చేసిన వారికే నామినేటెడ్ పదవులు ఇచ్చాం
వైఎస్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
అందరి హృదయాల్లో వైఎస్‌కు స్థానం: కేవీపీ
ఏపీలో 2029లో షర్మిలే సీఎం.. విజయవాడ సభలో రేవంత్



గాంధీభవన్‌లో వైఎస్ జయంతిలో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో కేవీపీ



మోదీ.. మీరో శక్తి

మీ జీవితం ప్రజలకు అంకితం!.. చరిత్రాత్మక గెలుపునకు అభినందనలు
ప్రధానితో రష్యా అధ్యక్షుడు పుతిన్.. కలిసి భోజనం.. నేడు చర్చలు

మాస్కో, జూలై 8: రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ సోమవారం రష్యా చేరుకున్నారు. మాస్కో విమానాశ్రయంలో ఆయనకు రష్యా తొలి ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఘన స్వాగతం పలికారు. అలాగే ఒకే కారులో మోదీతో కలిసి వెళ్లి, ఆయనకు బస ఏర్పాటు చేసిన హోటల్‌లో దింపారు. అనంతరం మోదీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసానికి చేరుకున్నారు. ఆయన మోదీకి సాదర స్వాగతం పలికారు. వరుసగా మూడోసారి ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన మోదీకి అభినందనలు తెలిపారు. ఆయన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారని కొనియాడారు. "ముందుగా ప్రధానమంత్రిగా మళ్లీ

మిగతా 2వ పేజీలో...

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వర్షం

పిల్లల ఆస్పత్రి సహా
పలు భవనాలపై దాడి
31 మంది మృతి

2

గాజాపై ఇజ్రాయెల్ ముప్పేటదాడి

40 మంది పాలస్తీనీయుల మృతి



బీజేపీ ఎంపీ సభలో
మద్యం పంపిణీ

650 కేసుల బీర్లు, 450 కేసుల మద్యం
బహిరంగ సభా ప్రాంగణంలోనే కౌంటర్
మందుబాబుల బారులు.. బందోబస్తు
కర్ణాటకలోని చిక్కబళ్లాపురలో ఘటన

2



కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం

గ్రనేడ్ విసిరి.. సైనిక వాహనంపై కాల్పులు
ఐదుగురు జవాన్ల మృతి.. ఆరుగురికి గాయాలు
సైన్యం ప్రతిఘటనతో అడవిలోకి పరార్
కథువా జిల్లాలో ఘటన.. రెండ్రోజుల్లో రెండోది



షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్షలు!

14

ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహణ
11 నుంచి అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ
గ్రూప్-2 వాయిదా పడే అవకాశం
జేఎల్ నియామక ఫలితాలు విడుదల 3

35 మందికి నామినేటెడ్ పదవులు

కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు చైర్‌పర్సన్ల నియామకం
శాతవాహన, కాకతీయ అథారిటీలకు చైర్మన్లు
తెలంగాణ సంగీత నాటక అకాడమీకి చైర్‌పర్సన్
అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థకు వైస్ చైర్మన్
మార్చిలో ప్రకటించిన జాబితాలో స్వల్ప మార్పులు
ఓసీ-18, బీసీ-11, ఎస్టీ-3, ఎస్సీలకు ఒకటి
ఉత్తర్వులు జారీ.. బాధ్యతలు చేపట్టిన పలువురు

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నామినేటెడ్ పదవులకు సంబంధించి అధికార పార్టీ నేతల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు చైర్‌పర్సన్లను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 34 ప్రభుత్వరంగ కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లను, ఒక కార్పొరేషన్‌కు వైస్ చైర్మన్‌ను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి 442 నుంచి 448 వరకు మొత్తం ఏడు జీవోలను జారీ

మిగతా 13వ పేజీలో...


టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



అనుమతివ్వలేం!

రాష్ట్రంలో 8 కొత్త వైద్య కళాశాలలకు ఎల్‌వోపీ లేదు
అధ్యాపకులు లేరు.. 'ఇన్, ఔట్ పేషంట్' లేదు
లోపాలు వివరిస్తూ జాతీయ వైద్య కమిషన్ మెయిల్

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎనిమిది వైద్య కళాశాలల అనుమతులకు సంబంధించి జాతీయ వైద్య కమిషన్ లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) ఇవ్వలేదు. అనుమతులపై జాతీయ వైద్య కమిషన్ తాజాగా కొత్త కాలేజీల ప్రిన్సిపల్స్‌కు మెయిల్ పంపింది. ఆ కాలేజీల్లో ఉన్న లోపాలను అందులో పేర్కొంది. పరిస్థితులు ఇలాగే ఉంటే కొత్త కాలేజీలకు అనుమతులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. రాష్ట్రంలో కొత్తగా జోగులాంబ జిల్లా గద్వాల్, నారాయణ్ పేట్, ములుగు, మెదక్, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లా నర్సంపేట్‌లో, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున వైద్యవిద్య కళాశాలల ఏర్పాటు కోసం సర్కారు నిరుడు దరఖాస్తు చేసింది. జాతీయ వైద్య కమిషన్

మిగతా 3వ పేజీలో...

నీట్ లీకేజీ.. సుస్పష్టం

ఏ స్థాయిలో జరిగిందో ముందు గుర్తించాలి
దాన్ని బట్టే మళ్లీ పరీక్షపై నిర్ణయానికి చాన్స్
సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున
అందరికీ చేరితే రీ టెస్ట్ నిర్వహించాల్సిందే
ఈ పరీక్ష పవిత్రత నిస్సందేహంగా దెబ్బతింది
అందరికీ మళ్లీ పరీక్ష అంటే.. తీవ్ర నిర్ణయమే!
నీట్‌పై.. సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు
కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏపై ప్రశ్నల వర్షం
దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని సీబీఐకి ఆదేశం



న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నీట్ పేపర్ లీక్ అయ్యిందనేది స్పష్టమైందని, అయితే.. ఏ స్థాయిలో జరిగిందో, ఆ ప్రశ్నపత్రం ఎంతమందికి చేరిందో గుర్తించాల్సిన అవసరం ఉన్నదని దేశ సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయ పడింది. ఆ అంశాలను బట్టే పరీక్షను మళ్లీ నిర్వహించాలా? వద్దా? అనేది నిర్ణయించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నీట్-యూజీ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించడం ఆఖరు ప్రత్యామ్నాయం మాత్రమేనని తేల్చిచెప్పింది. ప్రశ్నపత్రం సోషల్

మిగతా 2వ పేజీలో...



ఉపాధి సొమ్ము ఉద్యోగుల ఖాతాల్లోకి..

రెండేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల అక్రమాలు
అక్రమంగా జాబ్ కార్డులు సృష్టించి.. నిధుల స్వాహా
ఖమ్మం డీఆర్‌డీఏ ఏపీవో విచారణలో వెలుగులోకి
ఇల్లెందు ఎమ్మెల్యే ఫిర్యాదుతో అక్రమాలు బహిర్గతం
మరో 3 రోజులు విచారణ

కామేపల్లి, జూలై 8: వారంతా ప్రభుత్వ ఉద్యోగులే.. కానీ పేదలకు జీవనోపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం నిధుల కోసం కక్కుర్తి పడ్డారు. కూలీలుగా పని చేస్తున్నట్లు జాబ్ కార్డులు సృష్టించి.. డబ్బును స్వాహా చేశారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో గత రెండేళ్లుగా ఈ అక్రమాలు జరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఉపాధి పథకంలో అవకతవకలపై ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఫిర్యాదు అందగా.. విచారణ చేపట్టాలని ఖమ్మం జిల్లా అధికారులను ఆయన కోరారు. ఈ మేరకు ఖమ్మం డీఆర్‌డీఏ అడిషనల్ పీవో శిరీష సోమవారం విచారణ చేపట్టగా.. గత రెండేళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఉపాధి నిధులు మళ్లిస్తున్న తీరు బయటపడింది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బర్లగూడెంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతున్నాయి. అయితే, అక్కడ పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు కలిసి

మిగతా 13వ పేజీలో...

సీబీఐ పేరుతో మాజీ ఎమ్మెల్యేకు టోకరా

వివిధ ఖాతాల నుంచి రూ.50 లక్షలు లూటీ
మనీలాండరింగ్ కేసు విచారణ అంటూ బెదిరింపు
తనిఖీ చేశాక తిరిగిస్తాం.. లేదంటే అరెస్టని హెచ్చరిక
బాధితుడు ఏపీలోని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే
జయదేవ నాయుడు.. మోసంపై పోలీసులకు ఫిర్యాదు

పాకాల, జూలై 8: సీబీఐ అధికారుల పేరుతో మాజీ ఎమ్మెల్యేకే టోకరా వేసి రూ.50 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. ఏపీలోని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్ జయదేవ నాయుడు (85) తిరుపతి జిల్లా పాకాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘరానా మోసం వెలుగుచూసింది. జయదేవ నాయుడికి గత శనివారం ఓ మహిళ వీడియో కాల్ చేసి... మీ అకౌంటు నుంచి కొన్ని కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరిగిందని చెప్పింది. తాము అరెస్టు చేసిన నాయక్ అనే వ్యక్తి బ్యాంకు ఖాతాలను తనిఖీ

మిగతా 14వ పేజీలో...

ధన్వంతరి ఫౌండేషన్ మోసం.. 14
25 దేశాల్లో బాధితులు!

514 కోట్ల మేర మోసపోయిన 4 వేల మంది
సంస్థ ఆస్తుల్ని అటాచ్ చేశాం: సీసీఎస్ డీసీపీ శ్వేత



తండ్రీ కూతుళ్ల బంధంపై విషం

లైంగిక కోణంలో చూస్తూ దారుణ వ్యాఖ్యలు
యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు, మరో నలుగురి నిర్వాకం.. వారిపై కేసు నమోదు
తొలుత స్పందించిన హీరో సాయిధరమ్
'ఎక్స్'లో పోస్ట్‌తో 2 రాష్ట్రాల సీఎంల దృష్టికి
స్పందించిన సీఎం రేవంత్.. చర్యలకు ఆదేశం
కఠిన చర్యలు తప్పవు: మంత్రి సీతక్క
యూట్యూబర్ తీరు సమాజానికి హానికరం
మండిపడ్డ సినీరంగ ప్రముఖులు 14
ఇది నీచం.. చర్యలు తీసుకోవాలి: ఖుష్బూ
తప్పు చేశానంటూ ప్రణీత్‌హన్మంతు క్షమాపణ



ఉగ్రవాద దాడిలో గాయపడిన సైనికుడు

సైనిక వాహనంపై ఉగ్ర దాడి

» ఐదుగురు సైనికుల మృతి.. కశ్మీర్‌లోని కథువాలో ఘటన

» ముందు గ్రనేడ్ విసిరి.. వాహనం ఆగడంతో కాల్పులు

కథువా, జమ్మూ, జూలై 8: వరుస దాడులతో కశ్మీర్‌లో ఉగ్రవాదులు కలకలం రేపుతున్నారు. సోమవారం కథువా జిల్లా మాచేడి ప్రాంతంలో సైన్యం వాహనంపై పక్కా పథకం ప్రకారం కాల్పులకు పాల్పడ్డారు. మాచేడి-కిండ్లీ-మల్హార్ మార్గంలో పహారా కాస్తున్న సైనిక వాహనంపై తొలుత బద్నోటా గ్రామం వద్ద గ్రనేడ్ విసిరారు. వాహనం ఆగిపోవడంతో కాల్పులు జరిపారు. దీంతో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం సైనికులు ప్రతిఘటించడంతో ఉగ్రవాదులు సమీపంలోని అడవిలోకి పారిపోయారు. వారికోసం అదనపు బలగాలను రప్పించి గాలింపు చేపట్టారు. కాగా, ఆదివారం తెల్లవారుజామున రాజౌరీ వద్ద సైనిక శిబిరంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. సైనికులు ఎదురుకాల్పులు జరపడంతో పరారయ్యారు. కాగా, నెల రోజుల్లో కథువా జిల్లాలో నాలుగు ఉగ్ర దాడులు జరగడం గమనార్హం. కుల్గామ్ జిల్లాలోని రెండు గ్రామాల్లో శనివారం నుంచి ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. ఆరుగురు ఉగ్రవాదులు, ఇద్దరు సైనికులు మృతి చెందారు. కశ్మీర్‌లో వరుస ఉగ్రవాద దాడుల ఘటనల నేపథ్యంలో భారత సైన్యం తనిఖీలను విస్తృతం చేసింది. కుల్గామ్ జిల్లా చిన్నిగామ్ ఫ్రీసల్ గ్రామంలో ఓ ఇంట్లోనే ఉగ్రవాదులు బంకర్ ఏర్పాటు చేసుకున్న సంగతి ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఇక్కడ ఎన్‌కౌంటర్ జరగ్గా నలుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు హతమయ్యారు. మరోవైపు గత నెలలో పర్యాటకుల బస్సుపై జరిగిన ఉగ్ర దాడి వెనుక లష్కరే తొయిబా ఉగ్రవాది సైపుల్లా సాజిద్ ఉన్నట్లు తేలింది.

క్రిమినల్ చట్టాలపై తమిళనాట ఏకసభ్య కమిషన్

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల ఒకటి నుంచి అమల్లోకి తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలకు రాష్ట్రస్థాయిలో సాధ్యమైన సవరణలు పరిశీలించేందుకు తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎం. సత్యనారాయణన్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ కొత్తచట్టాలను పరిశీలిస్తుంది. రాష్ట్రస్థాయి న్యాయవాదుల సంఘంతో సహా పలువురితో సంప్రతిస్తుంది. సాధ్యమయ్యే సవరణలపై నెలలోపు ప్రభుత్వానికి నివేదికను అందజేస్తుంది. రాష్ట్రాల అభిప్రాయాలు వినకుండా అమలులోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

బెంగాల్‌లో వీసీల ఎంపికకు సుప్రీం కమిటీ

న్యూఢిల్లీ, జూలై 8: పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల ఎంపికకు సుప్రీంకోర్టు సోమవారం కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ యు.యు.లలిత్ ఆధ్వర్యంలో అయిదుగురు సభ్యులతో సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీని నియమించింది. వీసీల నియామకంపై గవర్నర్ సి.వి.ఆనంద్ బోస్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం నెలకొంది. చాన్స్‌లర్ హోదాలో గవర్నర్.. వైస్‌చాన్సలర్లను స్వయంగా నియమించడం చట్టబద్ధమేనని గత ఏడాది హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మధ్యేమార్గంగా న్యాయస్థానం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటుకు గవర్నర్‌తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకరించడంతో ఈ మేరకు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. ఈ కమిటీ ప్రతి విశ్వవిద్యాలయంలో వీసీ పదవికి ముగ్గురి పేర్లను సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఎంపిక ప్రక్రియను మొత్తం మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది.

నెలసరి సెలవులివ్వడం మంచిదే కానీ..

అది మహిళలకే నష్టం కలిగించవచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 8: మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులు తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నెలసరి సెలవులు ఇవ్వాలన్న నిర్ణయాన్ని సమర్థిస్తూనే.. దానివల్ల మహిళలకు ఉద్యోగావకాశాలు దూరం కావొచ్చని, ఇది వారికి నష్టం కలిగించొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. వాస్తవానికి ఇది ప్రభుత్వ విధానపరమైన అంశమని.. దీనిలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది. ప్రస్తుతం దేశంలో రెండు రాష్ట్రాలు మహిళలకు నెలసరి సెలవులు మంజూరు చేస్తున్నాయని, మిగతా రాష్ట్రాలు కూడా దీన్ని అమలుచేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై కోర్టు సోమవారం విచారణ జరిపింది. 'నెలసరి సెలవులు తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని యాజమాన్యాలను బలవంతం చేస్తే అది మహిళలకు నష్టం కలిగించవచ్చు. మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు తగ్గిపోవచ్చు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రస్తుతం కేరళ, బిహార్‌లో మాత్రమే మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నారు.

బెయిల్ ఇచ్చిన తర్వాత నిఘా రాజ్యాంగ వ్యతిరేకం

న్యూఢిల్లీ, జులై 8 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం ఒక నిందితుడికి బెయిల్ ఇచ్చిన తర్వాత అతడిపై పోలీసులు నిరంతర నిఘా ఉంచాలన్న షరతును విధించడం రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇది నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛలో చొరబడడమేనని ఓ తీర్పులో పేర్కొంది. మాదకద్రవ్యాల కేసులో అరెస్టయిన ఒక నైజీరియన్ జాతీయుడికి బెయిల్ మంజూరు చేసిన ఢిల్లీ హైకోర్టు.. అతడు తన గూగుల్ మ్యాప్ వివరాలను స్థానిక పోలీసులకు అందజేయాలని షరతు విధించింది. దీనిపై అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. తానెక్కడో తెలిపే విధంగా గూగుల్ మ్యాప్ వివరాలను నిందితుడు తెలియజేస్తే ఇక బెయిల్ ఇచ్చి ప్రయోజనమేమిటని ప్రశ్నించింది. ఏ కోర్టూ ఇలాంటి షరతులను విధించలేదని స్పష్టం చేసింది.

ఇళ్ల నిర్మాణంపై ఏకరూప ఒప్పందాలు అవసరం

న్యూఢిల్లీ, జూలై 8: ఇళ్ల కొనుగోలుదార్లు మోసపోకుండా ఉండేందుకు ఒకే తరహా ఒప్పందాలను రూపొందించాల్సిన అవసరం ఉందని సోమవారం సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. బిల్డర్-బయ్యర్‌ల మధ్య కుదిరే అగ్రిమెంట్లు దేశమంతటా ఏకరూపంలో ఉండాల్సిన అవసరం ఉందని తెలిపింది. దేశమంతటా కొనుగోలుదార్లు బిల్డర్ల చేతిలో మోసపోతున్నారని, దానిని అరికట్టడానికి సమగ్ర విధానం రూపొందించాలని పేర్కొంది. 2021లో న్యాయవాది అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం పై సూచన చేసింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది దేవాశీష్ భరూకా మాట్లాడుతూ ఏకరూప ఒప్పందానికి సంబంధించిన ప్రతిపాదనలను కోర్టుకు సమర్పించినట్టు చెప్పారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 40 మంది మృతి

టెల్‌అవీవ్, జూలై 8: సోమవారం ఇజ్రాయెల్ దళాలు జరిపిన భారీ దాడిలో గాజాలో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉదయమే మూడు దిక్కుల నుంచి వచ్చిన ఇజ్రాయెల్ ట్యాంకులు గాజా నగరం నడిబొడ్డులోని కీలక ప్రాంతాలకు వెళ్లి బీభత్సం సృష్టించాయి. గత ఏడాది అక్టోబరు ఏడో తేదీన యుద్ధం ప్రారంభమైన తరువాత జరిగిన అతి పెద్ద దాడుల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం. ఇవేకాకుండా నగరం తూర్పు దిక్కున కూడా కొన్ని, పశ్చిమాన మరి కొన్ని ట్యాంకులు మోహరించి కాల్పులు జరిపాయి. దాంతో నగరం మధ్యలోకి వెళ్లి క్షతగాత్రులకు సేవలు అందించడం గాజా సివిల్ ఎమర్జెన్సీ సర్వీసుకు సాధ్యపడలేదు. ఆదివారం అర్ధరాత్రి నుంచే కాల్పులు ప్రారంభించినట్టు స్థానికులు తెలిపారు. ఈ దాడులకు కొన్ని బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టమయినట్టు చెప్పారు. తూర్పు వైపున యుద్ధ ట్యాంకులు నగరవాసులను భయపెట్టి వారు మధ్యధరా సముద్రం వరకు వెళ్లేలా చేశాయి. "మా ఎదుట సముద్రం ఉంది. వెనుకవైపేమో శత్రువు ఉన్నాడు. ఎక్కడికి వెళ్లాం?" అని అబ్దెల్ ఘనీ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. "ట్యాంకుల నుంచి షెల్లు, విమానాల నుంచి క్షిపణులు పడుతున్నాయి. అగ్ని పర్వతం పేలినట్టు పరిస్థితి ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

నీట్ లీకేజీ.. సుస్పష్టం

(మొదటి పేజీ తరువాయి)

మీడియా ద్వారా పెద్ద ఎత్తున లీక్ అయినా రీటెస్టుకు ఆదేశించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నీట్ నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీకి, పరీక్ష రద్దుకు సంబంధించి దాఖలైన పలు వ్యాజ్యాలపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర సర్కారుపైన, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పైన ప్రశ్నల వర్షం కురిపించింది. "పేపర్ లీక్ ఎలా జరిగింది? మొదట ఎక్కడ జరిగింది? ప్రశ్నపత్రాలను నిందితులకు చేరవేసిన విధానం ఏమిటి? పేపర్ లీకేజీకి, పరీక్షకు మధ్య ఎంత సమయం ఉంది? పరీక్ష మొత్తాన్ని ప్రభావితం చేసే స్థాయిలో జరిగిందా? పేపర్ లీకేజీ ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులను పూర్తిస్థాయిలో గుర్తించడం సాధ్యమేనా? పేపర్ లీకేజీ వ్యవహారంలో నిందితులను గుర్తించేందుకు తీసుకున్న చర్యలేంటి?" అంటూ కేంద్ర ప్రభుత్వంపైన, ఎన్‌టీఏపైన సీజేఐ ప్రశ్నల వర్షం కురిపించారు. "పేపర్ లీక్ అయినప్పటి నుంచి పరీక్ష జరిగేటప్పటికి తక్కువ సమయమే ఉందని తేలితే.. నీట్‌ను రద్దు చేసి మళ్లీ పరీక్ష పెట్టాలనే నిర్ణయానికి రాలేని పరిస్థితి ఏర్పడుతుంది" అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. "లీకేజీ ఒకవేళ సామాజిక మాధ్యమాల ద్వారా జరిగి ఉంటే పేపర్ విస్తృతంగా వ్యాపించే అవకాశం ఉంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా.. కేంద్రానికి, ఎన్‌టీఏకి కొన్ని ప్రశ్నలు సంధించి, వాటికి సమాధానాలు ఇవ్వాలని కోరుతూ తదుపరి విచారణను గురువారానికి (జూలై 11) వాయిదా వేశారు. అలాగే, నీట్ అక్రమాలపై దర్యాప్తు ఏ దశలో ఉందో తెలుపుతూ బుధవారానికల్లా నివేదిక ఇవ్వాలని సీబీఐని ఆదేశించారు.

సందేహమే లేదు..

"ఒక్కటి మాత్రం సుస్పష్టం. లీకేజీ జరిగింది. ఈ పరీక్ష పవిత్రత దెబ్బతిందన్న విషయంలో ఎలాంటి సందేహానికీ తావు లేదు. అయితే.. లీక్ ఏ స్థాయిలో జరిగిందన్నదే ప్రశ్న" అని విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. తప్పు చేసినవారిని పట్టుకోవాలంటే.. ముందు ఎక్కడెక్కడ లోపాలున్నాయో, తప్పులు జరిగాయో గుర్తించాలని పేర్కొంది. అలాంటివారిని గుర్తించగలిగితే.. వారికి మళ్లీ పరీక్ష పెట్టడం తప్పనిసరి కావొచ్చని అభిప్రాయపడింది. అంతే తప్ప అందరు అభ్యర్థులకూ మళ్లీ పరీక్ష పెట్టడం చాలా కష్టంతో కూడుకున్న పని, తీవ్రమైన నిర్ణయం అవుతుందని స్పష్టం చేసింది. "మళ్లీ పరీక్ష పెట్టాలనే నిర్ణయం తీసుకోవడానికి ముందు.. లీక్ ఎలా జరిగిందో మనం తెలుసుకోవాలి. ఇంకోసారి పరీక్షకు హాజరు కావాలని 23 లక్షల మందిని అడగడం చాలా కష్టం" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా.. నీట్ పరీక్షకు సంబంధించి నిగ్గు తేల్చాల్సిన అంశాలు కొన్నింటిని ధర్మాసనం గుర్తించింది. అవేంటంటే..

- ఈ ఏడాది 720కి 720 మార్కులు వచ్చిన విద్యార్థులు మునుపెన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారిలో గ్రేస్ మార్కుల వల్ల ప్రయోజనం పొందినవారు ఎంతమంది?
- ఒక సెంటర్‌లో పరీక్ష రాయడానికి రిజిస్టర్ చేసుకుని.. ఆ తర్వాత పరీక్షా కేంద్రాన్ని దూరంగా ఉన్న మరోచోటుకు మార్చుకుని, ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులు ఎందరు?
- నీట్‌లో అసాధారణంగా ఎక్కువ మార్కులు పొంది.. పన్నెండో తరగతిలో మాత్రం ఆ స్థాయిలో సామర్థ్యాన్ని చూపని విద్యార్థులు ఎవరు? (అయితే.. నీట్‌కు సిద్ధమైనంత కఠినంగా బోర్డు పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కారని ఈ సందర్భంగా కోర్టు అభిప్రాయపడింది).
- ఒక సబ్జెక్టులో అసాధారణంగా ఎక్కువ మార్కులు పొంది.. మరో సబ్జెక్టులో అతి తక్కువ మార్కులు పొందిన విద్యార్థులెవరు?

..అనే అంశాలపై దృష్టి సారించాలని పేర్కొంది. అయితే, ఒక్కచోట (పట్నాలో) మినహా పేపర్ మరెక్కడా లీక్ కాలేదని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు. ఆ ఒక్కచోట కూడా కేసు దర్యాప్తులో ఉందని కోర్టుకు విన్నవించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం కోర్టు.. పేపర్ లీక్ విస్తృతంగా జరిగిందా? ఆ లీకేజీ.. పరీక్ష నిర్వహణ ప్రక్రియ విశ్వసనీయతనే దెబ్బతీసిందా? ఏ తప్పూ చేయని విద్యార్థులను, తప్పు చేసి లబ్ధి పొందిన విద్యార్థులను వేరు చేయడం సాధ్యమేనా? ..అనే అంశాలను తాము పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. పరీక్ష పవిత్రతనే దెబ్బతీసే స్థాయిలో లీక్ జరిగి.. తప్పు చేసిన విద్యార్థులను గుర్తించలేని పరిస్థితి ఉంటే మాత్రం మళ్లీ పరీక్ష నిర్వహించక తప్పదని అభిప్రాయపడింది. అదే సమయంలో.. పేపర్ లీకేజీ కొన్ని ప్రాంతాలకే పరిమితమై, తప్పు చేసినవారిని గుర్తించగలిగితే 23 లక్షల మందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించడం అనుచితమే అవుతుందని పేర్కొంది.



నీట్ లీక్‌పై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇండియా కూటమి యువజన విభాగాల నిరసన ప్రదర్శన

ఆ వివరం చెప్పొద్దు..

విచారణ సందర్భంగా కేంద్రానికి, ఎన్‌టీఏకి ధర్మాసనం పలు ప్రశ్నలను సంధించింది. "ప్రశ్నపత్రాన్ని ఒకరే తయారు చేస్తారా? లేక ఎక్కువ మందా? ప్రింటింగ్ ప్రెస్ ఏది? ఆ ప్రశ్నపత్రాలను ప్రింటింగ్ ప్రెస్‌కి ఎన్‌టీఏ ఎప్పుడు పంపింది? ప్రింటింగ్ ప్రెస్‌కి పంపడానికి చేసిన రవాణా ఏర్పాట్లు ఏంటి' అని పలు ప్రశ్నలు సంధించారు. దీనికి ఎన్‌టీఏ తరఫు న్యాయవాది.. ప్రశ్నపత్రాన్ని నిపుణుల బృందం సిద్ధం చేస్తుందని తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్ ఇక్కడే ఉందని న్యాయవాది చెబుతుండగా.. సీజేఐ జోక్యం చేసుకుని.. "ప్రింటింగ్ ప్రెస్ ఎక్కడ ఉందో చెప్పనవసరం లేదు. ఎందుకంటే అదెక్కడ ఉందో తెలిస్తే వచ్చే ఏడాది మళ్లీ లీక్ అయ్యే ప్రమాదం ఉంది. అయితే.. ప్రింటింగ్ ప్రెస్‌కు ఎలా పంపించారు, ఏ కస్టడీలో ఉంచారు? ప్రింట్ అయిన తర్వాత మళ్లీ ఎన్‌టీఏకి ఎలా పంపిస్తారో మాత్రం చెప్పండి ?" అన్నారు.


23 లక్షల జీవితాలతో..

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ 23 లక్షల కుటుంబాలతో ముడిపడిన అంశమని విచారణ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు. అందుకే ఈ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాకే తీర్పు ఇస్తామని స్పష్టం చేశారు. "పేపర్ ఎంతమందికి లీక్ అయింది? అందులో ఎంతమంది ఫలితాలను నిలిపివేశారు? వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో మేము తెలుసుకోవాలని అనుకుంటున్నాం. ఒకవేళ ప్రభుత్వం పరీక్షను రద్దు చేయలేకపోతే, లీకేజీ ద్వారా ప్రయోజనం పొందినవారిని గుర్తించడానికి ప్రభుత్వం ఏం చేస్తోంది?" అని ప్రశ్నించారు. పరీక్షకు మూడు గంటల ముందే ప్రశ్నపత్రం లీకేజీ జరిగిందని ఎన్‌టీఏ న్యాయవాది తెలపగా.. సమగ్ర నివేదికను సమర్పించాలంటూ కేంద్రంతోపాటు ఎన్‌టీఏని ఆదేశించారు. నీట్ లీకేజీపై దర్యాప్తు ఎంతదాకా వచ్చిందో నివేదిక అందించాలని సీబీఐని ఆదేశించి.. విచారణను గురువారానికి వాయిదా వేశారు.



నీట్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆవరణలో విద్యార్థులు

లోకం తీరు



ఈ వివరాలు ఇవ్వండి..

ఈ కింది అంశాలపై పూర్తివివరాలు సమర్పించాలంటూ కోర్టు ఎన్‌టీఏని ఆదేశించింది.

- పేపర్ ఎలా లీక్ అయ్యింది? అసలు మొట్టమొదటిగా పేపర్ ఎక్కడ లీక్ అయ్యింది?
- ఏయే ప్రాంతాల్లో లీకేజీ జరిగింది? ఎలా వ్యాప్తి చెందింది?
- పేపర్ లీక్ అయిన సమయానికి పరీక్ష జరిగిన సమయానికి మధ్య ఎంత తేడా ఉంది?
- లీక్ జరిగిన పరీక్షా కేంద్రాలు/నగరాలను గుర్తించడానికి ఎన్‌టీఏ తీసుకున్న చర్యలేమిటి?
- లీకేజీ వల్ల లబ్ధి పొందినవారిని ఎలా గుర్తిస్తున్నారు?
- ఇప్పటివరకూ అలాంటి అభ్యర్థులు ఎంతమందిని గుర్తించారు?

..అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. అనుమానిత కేసులను గుర్తించేందుకు డేటా ఎనలిటిక్స్‌ను వాడే అవకాశం ఉందేమో పరిశీలించాలని కేంద్రానికి, ఎన్‌టీఏకి సూచించింది. అది సాధ్యమైతే తప్పుచేసినవారిని గుర్తించవచ్చని అభిప్రాయపడింది. అలాగే, నీట్ కౌన్సెలింగ్ పరిస్థితి ఏమిటో తెలపాలని ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకు.. సబ్జెక్ట్ నిపుణులతో కమిటీ ఏర్పాటు సహా పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.

నేను మీ సోదరుడినవుతా

'మణిపూర్' బాధితులతో రాహుల్ గాంధీ

ఇంఫాల్, జూలై 8: 'నేను మీ సోదరుడిగా ఇక్కడకు వచ్చాను. మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు మీతో కలిసి పనిచేస్తా' అని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మణిపూర్‌లో అల్లర్లు చెలరేగిన తర్వాత తానిక్కడకు రావడం మూడోసారని, పరిస్థితి కొంత మెరుగుపడి ఉంటుందని భావించానని, కానీ నిరాశే ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 'మణిపూర్ అల్లర్ల' బాధితులను రాహుల్ సోమవారం పరామర్శించారు. జిరిబమ్, చురాచంద్‌పూర్ జిల్లాలోని శిబిరాలకు వెళ్లిన రాహుల్ అక్కడి వారితో మాట్లాడారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యటించి, బాధితులకు ఓదార్పు దక్కేలా చూడాలని ప్రధాని మోదీని కోరుతున్నానని, ఇక్కడ శాంతి నెలకొనేందుకు తాము చేయగలిగిందంతా చేస్తామని రాహుల్ స్పష్టం చేశారు. 'ప్రధాని రాష్ట్రంలో పర్యటించాలి. ప్రజల ఆవేదనను స్వయంగా వినాలి. అప్పుడే వారికి కొంత ఊరట లభించవచ్చు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక్కడి ప్రజల బాగోగులపై రాహుల్‌కున్న చిత్తశుద్ధికి ఈ పర్యటనే నిదర్శనమని కాంగ్రెస్ తన 'ఎక్స్' సందేశంలో పేర్కొంది. ఈ సందర్భంగా రాహుల్‌తో ఒక బాలిక మాట్లాడుతూ ప్రధాని, రాష్ట్ర సీఎం తమ ప్రాంతాలకు ఒక్కసారి కూడా రాలేదని, తమ దుస్థితిని పార్లమెంట్‌లో చర్చకు తేవాలని కోరిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మేఘచంద్ర తెలిపారు. కాగా, గత ఏడాది మే నుంచి మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో దాదాపు 200 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. నిరాశ్రయులైన వేలాది మందిని పునరావాస శిబిరాలకు తరలించారు.

అసోం వరద బాధితులను తక్షణం ఆదుకోవాలి: రాహుల్

సిల్చార్: 'అసోం ప్రజలకు అండగా ఉంటాను. పార్లమెంట్‌లో వారి తరఫున పోరాడే సైనికుడిలా నిలబడతాను. కేంద్ర ప్రభుత్వం తక్షణం వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలి' అని రాహుల్ తన 'ఎక్స్' సందేశంలో పేర్కొన్నారు. వరదల్లో మునిగిపోయిన ప్రజలకు ఊరట కలిగించేలా కేంద్రం వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 24 లక్షల మందిపై వరదలు ప్రభావం చూపాయని, 53 వేల మంది నిరాశ్రయులయ్యారని, 60మంది ప్రాణాలను కోల్పోయారని రాహుల్ ఆవేదన వ్యక్తంచేశారు. వరదరహిత అసోంను తీసుకొస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, అయితే బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని ధ్వజమెత్తారు. ఐదేళ్లలో రాష్ట్రంలోని బీజేపీ సర్కారు వరద సహాయక చర్యల కోసం రూ.10,785 కోట్లు కావాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరితే వచ్చింది రూ.250 కోట్లు మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు వరద సహాయక చర్యల్లో పాల్గొనాలని రాహుల్ పిలుపునిచ్చారు.



మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్ పునరావాస కేంద్రంలో రాహుల్

రాహుల్ సరిగానే మాట్లాడారు!

న్యూఢిల్లీ, జూలై 8: ఇటీవల లోక్‌సభలో రాహుల్ గాంధీ 'హిందువులు హింసాత్మకులు' అని వ్యాఖ్యానించినట్టు అధికార పక్షం తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ నేపథ్యంలో తాజాగా జ్యోతిర్మఠ 46వ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద రాహుల్‌ను సమర్థించారు. "రాహుల్ గాంధీ పూర్తి ప్రసంగాన్ని మేం చాలా శ్రద్ధగా విన్నాం. హిందూమతం హింసను తిరస్కరిస్తుందన్న విషయాన్ని ఆయన చాలా గట్టిగా నొక్కి చెప్పారు" అని శంకరాచార్య పేర్కొన్నారు.

విశ్వాస పరీక్ష నెగ్గిన హేమంత్ సోరెన్ సర్కారు

రాంచీ, జూలై 8: జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గింది. విపక్ష ఎమ్మెల్యేలు వాకౌట్ చేసి వెళ్లిపోయిన తర్వాత జరిగిన ఓటింగ్‌లో సోరెన్ సర్కారుకు అనుకూలంగా, విశ్వాస పరీక్షకు మద్దతుగా 45 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. బీజేపీకి చెందిన 24 మంది సభ్యులు, ఏజేఎస్‌యూకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు ముందు వాకౌట్ చేశారు. విశ్వాస పరీక్ష నెగ్గిన తర్వాత సీఎం హేమంత్ సోరెన్ మాట్లాడుతూ తమ కూటమిలోని సభ్యుల మధ్య ఐక్యత మరోసారి ప్రస్ఫుటంగా కనిపించిందని అన్నారు. స్పీకర్, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తోందని, ఇదే విషయం మరోసారి నిరూపితమైందని సోరెన్ అన్నారు. కాగా, మాజీ సీఎం చంపయి సోరెన్, మరో పది మంది హేమంత్ సోరెన్ కేబినెట్‌లో మంత్రులుగా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎం సహా 12 మంది మంత్రులున్న కేబినెట్‌లో కొత్తగా కాంగ్రెస్ నుంచి ఇర్ఫాన్ అన్సారీ, దీపికా పాండే సింగ్, జేఎంఎం నుంచి బైద్యనాథ్ రామ్‌లు చోటు సంపాదించారు.

బీజేపీ ఎంపీ అభినందన సభలో మద్యం



బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో బీజేపీ ఎంపీ అభినందన సభలో పోలీసు బందోబస్తు నడుమ మద్యం పంపిణీ చేసిన వైనం పెనుదుమారం రేపింది. చిక్కబళ్లాపుర ఎంపీ .సుధాకర్‌కు నెలమంగల తాలూకా బావికెరె గ్రామ పరిధిలో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. బీజేపీ-జేడీఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యకర్తలు, ప్రజల కోసం 650 కేసుల బీర్లు, 450 కేసుల మద్యం బాటిళ్లు సిద్ధం చేశారు. సభా ప్రాంగణంలోనే మద్యం పంపిణీ కౌంటర్ ఉండడంతో పెద్ద ఎత్తున తోపులాట జరుగుతుందని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. కార్యకర్తలకు మద్యం పంపిణీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వర్షం

31 మంది మృతి

కీవ్, జూలై 8: ఉక్రెయిన్‌పై రష్యా సోమవారం క్షిపణులతో విరుచుకుపడింది. దేశ రాజధాని కీవ్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాలపై భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 31 మందికిపైగా పౌరులు మృతి చెందారని, 154 మందికిపైగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఉన్న దేశంలోనే అతిపెద్ద పిల్లల ఆస్పత్రి ఓఖ్‌మాత్‌డిత్‌తో పాటు దేశంలోని పలు భవనాలపై దాడులు జరిగాయని చెప్పారు. 40కిపైగా క్షిపణులతో తమ దేశంలోని అయిదు నగరాలను లక్ష్యంగా చేసుకుని రష్యా విరుచుకుపడిందని వారు పేర్కొన్నారు. అత్యాధునిక కింజాల్ సూపర్‌సోనిక్ క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ తెలిపింది. 30 క్షిపణులను తాము ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అమెరికాలో నాటో శిఖరాగ్ర సమావేశాలు జరుగుతున్న వేళ రష్యా ఈ దాడులు చేయడం గమనార్హం.

మోదీ.. మీరో శక్తి

పుతిన్ అధికారిక నివాసంలో ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికైనందుకు మీకు అభినందనలు. ఈ విజయం యాదృచ్ఛికంగా వచ్చింది కాదు. ప్రభుత్వాధినేతగా పదేళ్లుగా మీరు చేసిన పనులకు దక్కిన ఫలితం. మీరు చాలా శక్తిమంతమైన వ్యక్తి. భారత్, ప్రజల ప్రయోజనాలకు అవసరమైన ఫలితాలను ఎలా సాధించాలో మీకు బాగా తెలుసు. ఫలితాలు కూడా అలాగే వస్తాయి. భారత్ ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది" అని పుతిన్ మోదీతో చెప్పారు. ఆయనకు ధన్యవాదాలు తెలిపిన మోదీ.. సంస్కరణలు తేవడమే తన సిద్ధాంతమని చెప్పారు. తన ప్రభుత్వ విధానాలకు భారత ప్రజలు ఆమోదముద్ర వేశారన్నారు. మూడోసారి గెలిచిన తాను మూడు రెట్లు ఎక్కువగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్పందించిన పుతిన్.. 'మీ జీవితాన్ని భారత ప్రజలకు అంకితం చేశారు. ఆ విషయం వారికీ తెలుసు' అని చెప్పారు. అనంతరం ఇరువురు నేతలు కలిసి భోజనం చేశారు.



మోదీకి ఘన స్వాగతం..

రష్యాలో ప్రొటోకాల్ ప్రకారం పుతిన్ తర్వాత స్థాయిలో మంటురోవ్ ఉంటారు. అలాంటి వ్యక్తి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి మోదీకి స్వాగతం పలకడం ద్వారా చైనాకు గట్టి సంకేతాలు ఇచ్చినట్లయింది. గతంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఉపప్రధాని స్వాగతం పలకగా.. మోదీ కోసం తొలి ఉపప్రధాని మంటురోవ్ వెళ్లడం విశేషం. ఈ చర్య ద్వారా రష్యా.. భారత్‌కు ఇస్తున్న ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పినట్లయింది. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో మాస్కోలోని 1771 అడుగుల ఎత్తయిన ఒస్టాంకినో టీవీ టవర్‌ను భారత్, రష్యా జెండాల్లోని రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇది ప్రపంచంలోనే ఎత్తయిన టీవీ టవర్లలో నాలుగో స్థానంలో ఉంది. ఇక మాస్కో చేరుకున్న అనంతరం మోదీ తన ఎక్స్ ఖాతాలో.. "భారత్, రష్యాల మధ్య మరింత వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని పోస్ట్ చేశారు. ఇరుదేశాల మధ్య బలమైన బంధాలు ప్రజలకు ఎంతగానో లబ్ధిచేకూర్చుతాయన్నారు. మంగళవారం ఇరువురు నేతలు 22వ 'భారత్-రష్యా' వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, ఇంధన, రక్షణ రంగాల్లో సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చలు జరపనున్నారు. మోదీ చివరిసారిగా 2019లో రష్యా పర్యటనకు వెళ్లారు. కాగా, జాతీయ, అంతర్జాతీయ సమస్యలు సహా పలు అంశాలపై తన మిత్రుడు పుతిన్‌తో సమగ్రంగా చర్చలు జరుపుతానని మోదీ పేర్కొన్నారు. శాంతి స్థాపన కోసం అవసరమైతే మద్దతు అందిస్తామన్నారు. మంగళవారం పుతిన్, మోదీ ముఖాముఖి చర్చలు జరుపుతారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. చర్చల తర్వాత పుతిన్, మోదీ సంయుక్త మీడియా ప్రకటనలేమీ ఉండవన్నారు. కాగా, రష్యా యుద్ధంలో పనిచేస్తున్న భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు ప్రధాని చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సూచించింది.

జైల్లో నెలరోజులు బాతుగుడ్లు, వట్టి చేపలు తిని బతికా!

- చేసిన పనికి కంపెనీ డబ్బివ్వలే.. ఉల్టా బాకీ పడ్డానంటూ కేసు పెట్టారు
- కాంబోడియాలో అంతా సైబర్ మోసం
- ఏఐ టెక్నాలజీతో ఫోటోల మార్ఫింగ్
- చాలా మంది చెరలో ఉన్నారు : ప్రకాశ్


ఇంటికి చేరిన ప్రకాశ్‌తో అన్న ప్రశాంత్

బయ్యారం, జూలై 8: కాంబోడియా జైల్లో నెల రోజులు తాను బాతు గుడ్లు.. వట్టి చేపలు తిని బతికానని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మున్సిఫ్ ప్రకాశ్ చెప్పాడు. చేసిన పనికి డబ్బులివ్వకపోగా తానే బాకీ పడ్డానంటూ కంపెనీ తనపై కేసుపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంబోడియా నుంచి ప్రకాశ్ ఆదివారం రాత్రి స్వదేశానికి చేరుకున్న సంగతి తెలిసిందే. అదేరోజు రాత్రి మహబూబాబాద్‌లోని తన బంధువుల ఇంట్లో ఉన్న ప్రకాశ్ సోమవారం ఉద యం ఇంటికి చేరుకున్నాడు. అతడిని చూసి అన్న ప్రశాంత్, ఇతర కుటుంబసభ్యులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కాగా, కాంబోడియా పయనం, అక్కడ తలెత్తిన పరిస్థితులను బయ్యారం సీఐ రవికుమార్‌కు ప్రకాశ్ వివరించాడు. తాను హైదరాబాద్‌లో ఓ కంపెనీలో కొంత కాలం ఉద్యోగం చేసి మానేశానని, మరో జాబ్ కోసం తన ప్రొఫైల్‌ను ఓ వెబ్‌సైట్‌లో పెట్టగా ఉద్యోగావకాశాలపై పలువురి నుంచి తనకు ఫోన్‌కాల్స్ వచ్చాయని, ఈ క్రమంలోనే తమిళనాడుకు చెందిన విజయ్ అనే వ్యక్తి ఫోన్ చేసి చెప్పడంతో తాను కాంబోడియా వెళ్లానని వివరించాడు. తీరా అక్కడికి వెళ్లాక కంపెనీ వాళ్లు అప్పగించిన పని చూసి తాను షాక్ అయ్యాయని, శిక్షణ తర్వాత కొద్దిరోజుల పాటు తనతో బలవంతంగా పని చేయించుకున్నారని, తాను తిరస్కరించడంతో పలు రకాల చిత్రహింసలకు గురి చేశారని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కంపెనీవాళ్లు తనను ఓ గదిలో బంధించారని.. అన్నం పెట్టకపోగా.. తీవ్రంగా కొట్టారని, కరెంట్ షాక్, మత్తు ఇంజెక్షన్లు ఇచ్చారని వెల్లడించాడు. తనకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటానికి దిగడంతో కంపెనీ నిర్వాహకులు, సుమారు రూ. 5 లక్షలు బాకీ పడ్డానంటూ తనపై కేసు పెట్టారని చెప్పాడు. కంబోడియా జైల్లో నెల రోజులు తాను బాతు గుడ్లు, వట్టి చేపలు తిని బతికానని విలపించాడు. కాంబోడియాలో అంతా సైబర్ మోసమని.. పలురకాల ట్రేడ్ అప్లికేషన్లు, ఏఐలాంటి అధునాతన టెక్నాలజీ సాయంతో ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతూ డబ్బులు దండుకోవడమే వారి పని వివరించాడు. ఇదే తరహా సైబర్ మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిని ఇటీవలే కేరళ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ప్రకాశ్ గుర్తు చేశాడు. తన మాదిరిగా అక్కడ ఎంతో మంది ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పాడు. అమ్మాయిల పరిస్థితి మరీ దయనీయం అని, పలువురు మహిళలు వివిధ రకాల శారీరక బాధలు అనుభవిస్తున్నారని తెలిపాడు. తనతో పాటు మొత్తం 9 మంది స్వదేశానికి వచ్చారని, అందులో అక్రమ్ అనే కరీంనగర్‌కు చెందిన యువకుడు కూడా ఉన్నట్లు ప్రకాశ్ చెప్పాడు.

పెండింగ్ బిల్లుల కోసం కలెక్టర్ ఎదుట ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

సుభాష్‌నగర్(కరీంనగర్), జూలై 8 : 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.11 లక్షల బిల్లులు ఇప్పించాలని కోరుతూ కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన రామడుగుకు చెందిన మాజీ సర్పంచ్ భర్త జగన్మోహన్‌గౌడ్ కలెక్టర్ ముందే మెడకు చేతిరుమాలు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అడ్డుకొని బయటకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ వారం క్రితం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తన గోడు వెళ్లబోసుకున్నానని అయినా డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పురుగుల మందు డబ్బాతో వచ్చిన బాధితుడు

అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు పురుగు మందు డబ్బాతో ప్రజావాణికి వచ్చాడు. పోలీసులు దాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు ఒగ్గు రాజమల్లు మాట్లాడుతూ తాను గంగాధర మండలం సర్వారెడ్డిపల్లికి చెందిన వాడినని, తన భూమి ఇతరుల పేరున ధరణి పోర్టల్‌లో నమోదైందన్నాడు. సరిచేయాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని తెలిపారు. సీఐ సరిలాల్ రాజమల్లు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాజమల్లు కలెక్టర్‌కు దరఖాస్తు అందజేసి వెళ్లిపోయారు.

టీచర్లకు డిప్యూటేషన్!

- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాత్కాలిక సర్దుబాటు

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక సర్దుబాటు పేరిట ఉపాధ్యాయులకు డిప్యూటేషన్‌ను కల్పిస్తున్నారు. ఇందుకోసం మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. దాంతో పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండక పోగా, మరికొన్ని చోట్ల టీచర్లు ఎక్కువ, విద్యార్థులు తక్కువ ఉన్నారు. దాంతో బోధనలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండడం కోసం డిప్యూటేషన్‌ను అమలు చేస్తున్నారు. ఈ సర్దుబాటులో భాగంగా మండల పరిధిలో, మండలం దాటి డిప్యూటేషన్లను ఇస్తున్నారు. దీని ద్వారా రాష్ట్రంలో 4 వేల మంది టీచర్లను సర్దుబాటు చేసే అవకాశం ఉంది.

బదిలీ అయిన టీచర్లను పాత పోస్ట్ నుంచి రిలీవ్ చేయాలి!

బదిలీ అయిన టీచర్లను వెంటనే పాత పోస్టింగ్ నుంచి రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు చావా రవి, సదానందం, జంగయ్య తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం విద్యా శాఖ కార్యదర్శి వెంకటేశంను కలిసి వినతి పత్రం సమర్పించారు.

జేఎల్ నియామక పరీక్ష ఫలితాల వెల్లడి!

ఇంటర్మీడియట్ విద్యలో జూనియర్ లెక్చరర్ల(జేఎల్) పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీపీఎస్సీ)అధికారులు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో సీబీఆర్‌టీ మోడ్‌లో ఈ పరీక్షలను నిర్వహించారు. జేఎల్ పోస్టులకు ఎంపికైన వారి మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఒక పోస్టుకు ఇద్దరు(1:2 నిష్పత్తి) చొప్పున అభ్యర్థులను ఎంపిక చేశారు.

ఎస్‌డీఎఫ్ నిధులేవీ? : ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక అభివృద్ధి నిధి ఏమైందని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతీ నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద రూ. 10 కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నట్లు గత మార్చి 10న ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హరీష్ సోమవారం మాట్లాడుతూ గడచిన ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 36 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు కూడా ఇవ్వలేకపోతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు నిధుల కొరత ఏర్పడిందని, కార్మికులకు గడచిన ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేకపోతున్నారని హరీష్ విమర్శించారు.

మధ్యాహ్న భోజనం వికటించి.. 10 మంది విద్యార్థులకు అస్వస్థత

- నిర్మల్ జిల్లాలో ఘటన... ఆలస్యంగా వెలుగులోకి

భైంసా రూరల్, జూలై 8: మధ్యాహ్న భోజనం వికటించి 10మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన నిర్మల్ జిల్లాలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. భైంసా మండలం దేగాం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత శనివారం మధ్యాహ్న భోజనం చేశాక విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు వారిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడే ఎవరికీ తెలియకుండా గుట్టుగా చికిత్స చేయించారు. అయితే సోమవారం విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల తీరుపై మండిపడ్డారు. పిల్లలు అనారోగ్యం బారిన పడితే తమకు ఎందుకు చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఉపాధ్యాయులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు తప్ప సరిగా స్పందించలేదు. కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులు ప్రస్తుతం కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు.

అనుమతివ్వలేం!

(మొదటి పేజీ తరువాయి)



నిబంధనల మేరకు 50 సీట్లతో ఏర్పాటుకాబోయే మెడికల్ కాలేజీల్లో 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తంగా 59 మంది ఫ్యాకల్టీ ఉండాలి. కానీ మనదగ్గర 8 కొత్త కాలేజీల్లో ప్రిన్సిపల్స్, ఆస్పత్రి సూపరింటిండెంట్లు తప్ప మిగతా స్టాఫ్ అంటూ ఎవరూ లేరు. సీనియర్ రెసిడెంట్ వైద్యులు కూడా లేకుండానే కాలేజీల ఏర్పాటు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. కొద్ది రోజుల క్రితం తనిఖీలకు వచ్చిన ఎన్ఎంసీ బృందం జీరో ఫ్యాకల్టీ ఉండటంపై నోరెళ్లబెట్టినట్లు సమాచారం. అసలు ఫ్యాకల్టీ లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నిజానికి ఫైనల్ తనిఖీలకు చేసిన తర్వాత అన్ని నిబంధనల మేరకు ఉంటే ఎల్‌వోపీను ఎన్ఎంసీ ఇస్తుంది. ఎల్‌వోపీ వస్తే అడ్మిషన్ల ప్రక్రియకు ఎటువంటి ఆటంకం ఉండదు. కానీ ఇంతవరకు ఎల్‌వోపీనే కొత్త కాలేజీలకు రాలేదు. అలాగే కొత్త మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో అవుట్ పేషంట్స్, ఇన్‌పేషంట్స్‌పై కూడా ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని బోధనాస్పత్రుల్లో ఓపీ బాగానే ఉన్నప్పటికీ... ఐపీ మాత్రం ఎన్ఎంసీ నిబంధనల మేరకు లేవు. బోధనాస్పత్రుల్లోని ఓపీ, ఐపీ డేటాను ఎన్ఎంసీ హెల్త్‌మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్ఎమ్ఐఎస్) ద్వారా తీసుకుంది. దాంతో ఓపీ, ఐపీల బాగోతం బయటపడింది. మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లోని రోజువారీ ఓపీ, ఐపీ వివరాలను హెచ్ఎమ్ఐఎస్ పోర్టల్‌లో ఏరోజుకారోజు విధిగా నమోదు చేయాలి. ఈ పోర్టల్‌ను కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నిర్వహిస్తుంటుంది. కాగా ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను రాష్ట్ర ప్రభుత్వం 60 రోజుల్లోగా సవరించుకోవాలి. ఆలోగా కూడా లోటుపాట్లను సరిచేసుకోకుంటే అనుమతులివ్వదు. ఒకవేళ ఇచ్చినా... వాటిని రద్దు చేస్తుంది. కాగా ఎన్ఎంసీ లేఖల నేపథ్యంలో రాష్ట్ర వైద్య శాఖ అగమాగం అవుతోంది. ఎలాగైనా సరే కొత్త కాలేజీలన్నింటినీ ఫ్యాకల్టీతో నింపేందుకు విశ్వ ప్రయత్నం చేస్తోంది. యుద్ధప్రాతిపదికన ఆదివారం 245 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించి...వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కొత్త కాలేజీలకు పోస్టు చేసింది. అలాగే ఆ కాలేజీలకు ఒక్కొ చోట 14 మంది ఆచార్యులు అవసరం. అన్నింటా కలిపి 112 మంది కావాలి. కానీ ప్రస్తుతం 57 మందికే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందే అర్హత ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 377 ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నూతన వైద్య కళాశాలల కోసం డీపీసీ వేశారు. వారంలోపే ఈ కాలేజీలకు ఆచార్యులను నియమించే అవకాశం కనిపిస్తోంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీల్లో 630 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ 8 కాలేజీలకే 200 మంది కావాలి. అందుకే వచ్చే నెల్లో ఈ పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నోటిఫికేషన్ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

అనుమతులపై తుది నిర్ణయం త్వరలో వెల్లడి- ఎన్ఎంసీ

దేశవ్యాప్తంగా కొత్త మెడికల్ కాలేజీల 113 దరఖాస్తులు రాగా... అందులో ఒక్క తెలంగాణ నుంచే 11 వచ్చాయి. అందులో 8 సర్కారీవి కాగా మరో 3 ప్రైవేటుకు చెందినవి. అయితే ఈ కొత్త కాలేజీలన్నింటికి అనుమతులు వచ్చినట్లు సోషల్ మీడియా, కొన్ని ఎలక్ట్రానిక్ మీడియాలో వార్తలు రావడంపై ఎన్ఎంసీ సోమవారం స్పందించింది. కాలేజీల అనుమతుల విషయాన్ని వాటికి మెయిల్ రూపంలో పంపామని, అన్నింటికి అనుమతులు ఇచ్చినట్లు వచ్చిన వార్తల్లో వాస్తం లేదని వెల్లడించింది. త్వరలోనే ఎన్ని కాలేజీలకు అనుమతులు ఇచ్చామో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని ఎన్ఎంసీ ఆ ప్రకటనలో స్పష్టం చేసింది.

పంప్‌హౌస్‌ల కోసం నీటి నిల్వలతో
బ్యారేజీలు దెబ్బతిన్నాయా?

గోదావరి వరద అంచనాలో యంత్రాంగం విఫలం!

- కాళేశ్వరం కార్పొరేషన్ నిధులు ఏ విధంగా విడుదల చేశారు?
- 14 మందిని విచారించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్
- నేడు కూడా విచారించనున్న కమిషన్
- బ్యారేజీలపై కమిషన్‌కు నివేదిక ఇచ్చిన నిపుణుల కమిటీ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంప్‌హౌస్‌ల హెడ్‌లకు నీరు తాకేలా ఉండాలన్న కారణంతోనే బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో బ్యారేజీలు దెబ్బతిన్నాయా? అని జస్టిస్ పినాకి చంద్రఘోష్ అధికారులను నిలదీసినట్లు తెలిసింది. సోమవారం ఆయన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని పంప్‌హౌస్‌ల నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్న రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, గజ్వేల్ ఈఎన్‌సీ హరిరామ్, మహబూబ్‌నగర్ ఇన్ చార్జీ సీఈగా ఉన్న రమణారెడ్డి, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పద్మావతితోపాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) స్థాయి వరకున్న అధికారులను విచారించారు. మేడిగడ్డలో 6 మీటర్లు, అన్నారంలో 11 మీటర్లు, సుందిళ్లలో 9 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తేనే... కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం(అన్నారం), గోలివాడ(సుందిళ్ల) పంప్‌హౌస్‌లకు నీరు చేరుతుందని అధికారులు వివరించగా... ఆ కారణంగానే బ్యారేజీలు దెబ్బతిన్నాయా? అని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. బ్యారేజీలు నీటి మళ్లింపు కోసం కడితే... కాళేశ్వరంలో నీటి నిల్వ కోసం కట్టినట్లు కనిపిస్తోందన్నారు. గోదావరి వరదను కచ్చితంగా అంచనా వేయడంలో యంత్రాంగం వైఫల్యం చెందిందని ఆక్షేపించారు. కాగా, పంప్‌హౌస్ నిర్మాణ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులు కూడా హాజరై, విచారణకు సహకారం అందిస్తామని జస్టిస్ ఘోష్‌కు వివరించారు. ఇక మంగళవారం డీఈఈ, బుధవా రం ఏఈఈ తత్సమాన కేడర్ ఉద్యోగులను కమిషన్ విచారించనుంది. సోమవారం మొత్తం 14 మందిని విచారించిన కమిషన్, ఈ నెల 16లోపు కమిషన్‌కు నివేదించిన సమాచారాన్ని అఫిడవిట్ల రూపంలో అందించాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధికారులను ఆదేశించారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కార్పొరేషన్‌కు నిధులు ఏ విధంగా అందాయి? ఆ నిధులను ఏ విధంగా నిర్మాణ సంస్థలకు విడుదల చేశారు? వంటి అంశాలపై అధికారుల నుంచి జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమాచారం సేకరించారు. మరోవైపు కమిషన్‌కు సహాయంగా ఉండటానికి వీలుగా వేసిన నిపుణుల కమిటీ సోమవారం బ్యారేజీలపై నివేదికను కమిషన్‌కు అందించింది. ఇక కాళేశ్వరంపై విచారణ నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) కూడా కమిషన్‌కు అందించింది. ఈ నివేదిక పరిశీలించిన తర్వాత కాగ్ హైదరాబాద్ విభాగం అధికారులనూ విచారణకు హాజరుకావాలని కమిషన్ నిర్ణయించింది. ఇక ఇప్పటిదాకా అందిన అఫిడవిట్లను నిశితంగా పరిశీలిస్తున్న కమిషన్ అనంతరం తదుపరి నోటీసులు/క్రాస్ ఎగ్జామినేషన్‌పై నిర్ణయం తీసుకోనుంది.

విజిలెన్స్‌కు మళ్లీ లేఖ

కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ పూర్తి నివేదికను సమర్పించాలంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీకి మళ్లీ లేఖ రాయాలని నీటిపారుదల అధికారులను జస్టిస్ చంద్రఘోష్ ఆదేశించారు. ఇక జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)తోనూ పూర్తి నివేదికను తెప్పించుకోవాలని నిర్దేశించారు.

ఏసీబీకి చిక్కిన హవేళీ ఘనపూర్ ఎస్ఐ

మెదక్ అర్బన్/హవేళీ ఘనపూర్: అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన టిప్పర్‌ను విడుదల చేసేందుకు లంచం తీసుకొని హవేళీ ఘనపూర్ ఎస్ఐతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన ఓ జర్నలిస్టు సోమవారం ఏసీబీకి చిక్కారు. మెదక్‌కు చెందిన పూల గంగాధర్ టిప్పర్ గత నెల 29న ఇసుక తరలిస్తూ పట్టుబడింది. దాన్ని విడిపించేందుకు ఎస్ఐ కర్రె ఆనంద్‌గౌడ్ రూ.30 వేలు డిమాండ్ చేయగా.. రూ.20 వేలకు ఒప్పందం కుదిరింది. దీనిపై గంగాధర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మహమ్మద్ మస్తాన్ అనే వ్యక్తి ఘనపూర్ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి డబ్బులు తీసుకెళ్లి ఎస్ఐకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మస్తాన్.. మెట్రో ఈవెనింగ్స్‌లో జర్నలిస్ట్‌గా పని చేస్తున్నారు.

ఐరాస సదస్సుకు తెలంగాణ విద్యార్థులు!

- 1ఎం1బీ గ్రీన్‌స్కిల్స్ అకాడమీ ద్వారా ఐదుగురి ఎంపిక

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): న్యూయార్క్‌లోని ఐక్య రాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో చేపట్టనున్న యాక్టివేట్ ఇంపాక్ట్ సదస్సుకు తెలంగాణ విద్యార్థులు ఎంపికయ్యారు. ఐక్య రాజ్యసమితి గుర్తింపు పొందిన 1ఎం1బీ (వన్ మిలియన్ వన్ బిలియన్) గ్రీన్‌స్కిల్స్ అకాడమీ ద్వారా ఈ ఐదుగురు యువ ఆవిష్కర్తలు ఎంపికయ్యారు. వీరు డిసెంబరులో జరిగే ప్రపంచస్థాయి ప్రతిష్టాత్మక, 8వ వార్షిక, యాక్టివేట్ ఇంపాక్ట్ సదస్సుకు హాజరవుతారు. తెలంగాణ వ్యాప్తంగా 200 మంది పోటీలో ఉండగా.. ఎంపికైన ఐదుగురిలో అప్నాఇంటర్వ్యూ క్రాకర్ ప్రాజెక్టును ఆవిష్కరించిన మీత్‌కుమార్‌షా (విజ్ఞాన భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), మనల్ నుంచి మ్యానిఫెస్టింగ్ మ్యాన్‌హోల్స్ ప్రాజెక్ట్ సిద్ధం చేసిన నారాయణం భవ్య (మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్), ఇంటెల్‌నెక్సా పేర ప్రాజెక్టును ఆవిష్కరించిన మునీర్ (దీక్షా డిగ్రీ కళాశాల, నిర్మల్) ఉన్నారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన మహిళా ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థినులు పెమ్మసాని లిఖిత చౌదరి, సత్యవతి కోలపల్లి మొక్కల పెంపకంపై రూపొందించిన ప్రాజెక్టు ద్వారా ఈ సదస్సుకు ఎంపికైనట్లు సంబంధిత విభాగాలు తెలిపాయి.

హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని

- తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

రాయికోడ్, జూలై 8: గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని హాస్టల్ రెండో అంతస్తు నుంచి దూకి తీవ్ర గాయాల పాలైంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల హాస్టల్‌లో సోమవారం జరిగింది. ఈ పాఠశాలలో మల్లేశ్వరి (15) పదో తరగతి చదువుతోంది. సోమవారం ఆమె హాస్టల్ రెండో అంతస్తు పై నుంచి ఒక్కసారిగా దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను వెంటనే జహీరాబాద్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలిక మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతోనే ఆమె భవనంపై నుంచి దూకిందని హాస్టల్ సిబ్బంది చెబుతుండగా, బాలిక కుటుంబీకులు మాత్రం ఎవరో పైనుంచి తోసేశారని చెబుతున్నారు. జిల్లా అధికారి భీమయ్య హాస్టల్‌ను సందర్శించి, విచారణ చేపట్టారు.

అటవీ శాఖ అధికారుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం

- యువకుడిని కాపాడిన స్థానికులు
- కామారెడ్డి జిల్లాలో ఘటన


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న బాధితుడు శోభన్

ఎల్లారెడ్డి, జూలై 8 : అటవీ శాఖ అధికారుల వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆ శాఖ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. గాంధారి మండలంలోని గండిపేట్ గ్రామానికి చెందిన నరాల శోభన్ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన గుడిసెకు ఉన్న మూడు దుంగలను నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి కలప డిజైన్ కోసం సోమవారం ఎల్లారెడ్డిలో ఉన్న కార్పెంటర్ దుకాణానికి తీసుకెళ్లాడు. గమనించిన అటవీ శాఖ అధికారులు శోభన్‌ను పట్టుకుని తమ కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా కలపను తరలిస్తున్నావంటూ కార్యాలయంలో గంటల తరబడి ఉంచి వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన శోభన్ తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా పెట్రోల్ తెప్పించుకొని.. ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొనేందుకు ప్రయత్నించాడు. స్థానికులు గమనించి అతడి ఒంటిపై నీళ్లు చల్లి కాపాడారు. అనంతరం బాధితుడు శోభన్ మాట్లాడుతూ.. తనను రూ. 20 వేలు ఇవ్వాలని ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి ఎస్.ధాని డిమాండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన వద్ద 20 వేలు లేవని, జరిమానా విధిస్తే కడతానని చెప్పినా వినకుండా వేధింపులకు గురిచేశారని వాపోయాడు.

త్వరలో బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగు

- దుస్థితికి స్వయంకృతాపరాధమే కారణం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్, జూలై 8 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో త్వరలో పూర్తిగా కనుమరుగు కావడం ఖాయమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేటి దుస్థితికి ఆ పార్టీ నేతలు వ్యవహరించిన తీరు, వారి స్వయంకృత అపరాధమే కారణమని అన్నారు. అధికారంలోకి వచ్చాక... పార్టీని నమ్ముకుని ఉద్యమంలో కీలకంగా పనిచేసిన వారిని, పార్టీ కోసం కష్టపడిన వారిని కాకుండా డబ్బున్న వారిని, వ్యాపారులను, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని అందలమెక్కించి పార్టీ కోసం పనిచేసిన వారిని పట్టించుకోకపోవడం వల్లనే బీఆర్ఎస్‌కు నేడు దుస్థితి ఏర్పడిందన్నారు. ఉన్న కాస్తోకూస్తో కూడా త్వరలో పూర్తిగా లేకుండా పోవడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని రఘునందన్‌రావు అన్నారు. క్రమశిక్షణ గల కార్యకర్తలే పార్టీకి బలమని వారికి ఏ సమస్య వచ్చినా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకుని ఏడు నెలలు దాటినా ఇంతవరకు సీఎం రిలీఫ్ ఫండ్‌పై స్పష్టత లేకపోవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, త్వరలో నిర్ణయం తీసుకుని మంజూరు చేయాలని డిమాండు చేశారు.

బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి భారీ వితరణ

- కోటి ఆస్తి రాసిచ్చిన ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్
- సీఎం చంద్రబాబుకు పత్రాల అందజేత

వెదురుకుప్పం, జూలై 8: బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఓ ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కోటి రూపాయల విలువైన ఆస్తిని వితరణ చేశారు. ఆ పత్రాలను ఆమె సంరక్షకుడు సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అందజేశారు. తెనాలికి చెందిన పి.రమాదేవి (82) శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆమె ముగ్గురు కుమారులు ఆంధ్ర మెడికల్ కళాశాలలో చదువుకుని అమెరికాలో స్థిరపడ్డారు. రమాదేవి ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏదో ఒకటి చేయాలనే ఉద్దేశంతో ఆమె బెంగళూరులో తనకు ఉన్న కోటి రూపాయల విలువైన ఆస్తిని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రికి విరాళంగా ఇచ్చేశారు. ఆ పత్రాలను సోమవారం చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం సీఆర్‌కండ్రిగకు చెందిన ఆమె సంరక్షకుడు పేట చూడామణి రెడ్డి, అదే గ్రామానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సీతా దయాకర్‌రెడ్డి, అమరావతి సచివాలయ క్యాంటీన్ ఇన్‌చార్జి పేట ప్రతాప్ రెడ్డిలతో కలిసి అమరావతిలో సీఎం చంద్రబాబుకు అందజేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

లీపెన్‌కు బ్రేక్

కెరటం లేచిన తీరు చూస్తే ఉప్పెనై ముంచెత్తుతుందనిపించింది కానీ, తీరం తాకకముందే విరిగిపోయింది. దీన్నే ఫ్రెంచి జీవనసరళిలోకి అనువదించి చెబితే, షాంపేన్ బిరడా ఉవ్వెత్తున ఎగిరింది కానీ, నురగ మాత్రం పొంగ లేదు. ఫ్రెంచి తీవ్రమితవాద పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) పరిస్థితి అట్లాగే ఉంది. మరైన్ లీపెన్ నాయకత్వంలోని ఆ పార్టీ ఫ్రాన్స్ సాధారణ ఎన్నికలలో ప్రభంజనం సృష్టిస్తుందని అంతా అంచనా వేశారు. కానీ, ఫలితాలలో మూడో స్థానం దగ్గరే ఆగిపోయింది. ఫ్రెంచి చరిత్రకు, సంస్కృతికి భిన్నమైన ఫాసిస్టు పోకడలు కలిగిన పార్టీ అధికారంలోకి రాకుండా నిలువరించామని, తీవ్రవాద వామపక్ష కూటమి, ఇంతదాకా అధికారంలో ఉన్న మధ్యేవాద కూటమి సంతోషిస్తున్నాయి. తమది వాయిదాపడిన విజయమే తప్ప, ఇది ఓటమి కాదు అంటూ లీపెన్ నిబ్బరంగా ఉన్నారు.

నెలరోజుల కిందట యూరోపియన్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికలలో ఫ్రాన్స్ నుంచి లీపెన్ పార్టీ 31 శాతం ఓట్లతో ఘనవిజయం సాధించింది. ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ నాయకత్వం వహిస్తున్న కూటమికి 15 శాతం కంటె తక్కువ ఓట్లు వచ్చాయి. మరింత ప్రమాదం రాకముందే జాగ్రత్తపడదామనుకున్నారో, మరే కారణమో కానీ, గత జూన్ 9 నాడు మేక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలు ప్రకటించారు. జూన్ 30 నాడు మొదటి రౌండు 76 స్థానాలకు పోలింగ్ జరగగా, జూలై 7 ఆదివారం నాడు రెండో రౌండులో 501 స్థానాలకు పోలింగ్ జరిగింది. మొదటి దశ పోలింగ్ తీరు నేషనల్ ర్యాలీ పార్టీకి అనుకూలంగా జరిగినట్టు, 33 శాతం కంటె అధికంగా ఓట్లు ఆ పార్టీ పొందినట్టు తెలియగానే, దేశంలోని మధ్యేవాదులు, వామపక్షీయులు కలవరం చెందారు. రెండో దశ ఓటింగ్ కూడా అదే తీరుగా ఉంటే, దేశం తీవ్ర మితవాదుల చేతిలోకి పోవడం ఖాయమని భయపడ్డారు. అందుకని, మధ్యేవాద, వామపక్షీయుల మధ్య అవగాహన కుదిరిందని, ముక్కోణ పోటీని ద్విముఖ పోటీగా మార్చడానికి దాదాపు 200 మంది అభ్యర్థులు విరమించుకోవడం దాన్ని సూచిస్తుందని పరిశీలకులు చెబుతున్నారు. రెండో దశలో గాలిమార్పు కారణంగా, అంతిమ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. వామపక్ష కూటమికి 182 స్థానాలు, మేక్రాన్ నాయకత్వంలోని మధ్యేవాద కూటమికి 163 సీట్లు, లీపెన్ పార్టీకి 143 స్థానాలు లభించాయి.

ఏ ఒక్క పార్టీకి, కూటమికి మెజారిటీ రాలేదు. మేక్రాన్ కూటమి, వామపక్ష కూటమితో మొత్తంగానో, అందులోని కొన్ని పక్షాలతోనో అవగాహన కుదుర్చుకుంటే తప్ప కొత్త ప్రభుత్వం ఏర్పడదు. కొత్తప్రభుత్వం ఏర్పడడానికి చాలా కాలం పట్టవచ్చునని, అంతదాకా ప్రస్తుత ప్రధానమంత్రి గేబ్రియల్ అట్టల్‌ను కొనసాగవలసిందిగా అధ్యక్షుడు మేక్రాన్ కోరుతున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షపదవికి 2027లో తిరిగి ఎన్నికలు జరుగుతాయి. గత మూడు పర్యాయాలుగా పోటీ పడి ఓడిపోయిన లీపెన్, ఈసారి తప్పనిసరిగా విజయం సాధించగలనని, అందుకు తగ్గ సూచనలు ప్రస్తుత ఎన్నికలు ఇచ్చాయని చెబుతున్నారు.

ఫ్రాన్స్ ఎన్నికల ఫలితాలు అనేక దేశాలలో ఇటీవల వ్యక్తమైన ధోరణులను స్ఫురింపజేస్తున్నాయి. లీపెన్ ఓడిపోయింది, తక్కిన రెండు కూటములు కుమ్మక్కు కావడం వల్లనా, లేక, ఆమె పార్టీ ఇచ్చిన నినాదాలలో అహంకారం ధ్వనించినందునా? అన్న చర్చ కూడా జరుగుతోంది. అబ్ కీ బార్ చార్ సౌ పార్ అంటూ భారత్‌లో ఒకపార్టీ ప్రచార నినాదం ఇచ్చినట్టుగానే, యుకె ఎన్నికల్లో లేబర్ పార్టీ సూపర్ మెజారిటీ నినాదాన్ని ఇచ్చింది. భారత్‌లో పని చేయలేదు కానీ, యుకెలో లేబర్ పార్టీ లక్ష్యాన్ని సాధించింది. ఫ్రాన్స్‌లో లీపెన్ తిరుగులేని మెజారిటీ అన్న నినాదాన్ని ప్రచారంలో పెట్టింది. తమ విజయం ఖాయమన్న ధోరణి ఆ పార్టీ ప్రచారంలోను, నాయకుల సరళిలోనూ అమితంగా వ్యక్తం కావడం ఓటర్లను విముఖం చేసిందని, మొదటి దశ ప్రచారాన్ని చూశాక, రెండో దశ నిర్ణయం మారిందని అంటున్నారు. నిజానికి, మేక్రాన్ నాయకత్వంలోని అధికార కూటమి మీద ప్రజల్లో వ్యతిరేకత బాగా పెరిగింది. అది ఈయూ ఎన్నికలలోనే వ్యక్తమైంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి నినాదాల వారసత్వం ఉన్న ఫ్రాన్స్, రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఫాసిజం దాడులకు తీవ్రంగా నష్టపోయిన ఫ్రాన్స్, తన దేశంలో ఒక ఫాసిస్టు పార్టీని అధికారంలోకి తేవడం అవమానకరమని అధికసంఖ్యాకులు భావించడం వల్ల కూడా లీపెన్ పార్టీకి మొదట ఉధృతంగా కనిపించిన ఆదరణ, తరువాత వెనుకపట్టుపట్టి ఉండవచ్చునని విశ్లేషకులు చెబుతున్నారు. ఇంగ్లండులో కూడా తీవ్ర మితవాద పార్టీ రిఫామ్ యుకె నాలుగు స్థానాలకే పరిమితం కావడం అక్కడి ప్రజాస్వామ్యవాదులకు ఊరట కలిగించింది. అయితే, రెండు దేశాలలోనూ, తీవ్ర మితవాద పార్టీలకు గణనీయంగా ఓట్లు వచ్చాయి. ఈ ధోరణి పెరుగుదల దిశగానే ప్రయాణిస్తోంది. యుక్తియుతంగా ఓటు చేయడం వల్ల ఫ్రాన్స్ రెండో దశలో ఫలితాలు తారుమారయ్యాయి. అటువంటి సందర్భం భారత్‌లో కూడా 1991 ఎన్నికల్లో కూడా జరిగింది. కాకపోతే, ఆనాటి సందర్భం వ్యూహంతో కాక, ఒక విషాదంతో, సానుభూతి ఓటింగ్‌తో ముడిపడింది. అనేక దశల పోలింగ్ నడుమ రాజీవ్ గాంధీ హత్య జరగకపోతే, ఆ ఎన్నికల్లోనే బీజేపీ విజయం సాధించి ఉండేది.

యుకెలో అయినా, ఫ్రాన్స్‌లో అయినా, దేశంలోని సామాజికార్థిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తే తప్ప, అక్కడ త్వరలోనే తీవ్రవాద రైటిస్టులు అధికారంలోకి వచ్చే అవకాశం ఎంతైనా ఉంది. ఇప్పుడు వామపక్షాలకు ఫ్రాన్స్ ప్రజలు పెద్దపీట వేశారని సంతోషించేవారు, లీపెన్ ఆత్మవిశ్వాసాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తపడాలి.

సంపద పన్నుతో కులాల జాతకం మారుతుందా?

సంపద చుట్టూ మానవ చరిత్ర తిరిగింది. దాని పంపకంలో అసమానతలు వర్గాలను సృష్టించాయి. వాటి మధ్య తలెత్తిన సంఘర్షణలు సమాజాన్ని కుదిపేశాయి. సమాజ గమనాన్ని కొత్తదారులు పట్టించాయి. వెతికితే వేల ఏళ్ల చరిత్రలో అలాంటి దారులెన్నో కన్పిస్తాయి. అసమానతలను సమర్థిస్తూనో, విమర్శిస్తూనో ఎన్నో సిద్ధాంతాలు వచ్చాయి. నిశితంగా చూస్తే మత, తాత్విక భావాలన్నీ కూడా అసమానతలను వివరించటానికో, విమర్శించటానికో పుట్టినట్లు కనిపిస్తాయి. అందుకే సంపద సృష్టి, పంపిణీలు చుట్టూ వివాదాలు చెలరేగుతూనే ఉంటాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా సంపద పంపిణీ చుట్టూనే ప్రచారం హోరెత్తింది. హిందువుల సంపదను ముస్లింలకు పంచటానికే కాంగ్రెస్ కంకణం కట్టుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. వారసత్వంగా వచ్చే ఆస్తులపై పన్నులు వేసే దురాలోచనను ఆ పార్టీ చేస్తోందనీ విమర్శించారు. తనకు అలాంటి ఆలోచనే లేదంటూ కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టినా ఇటీవల కాలంలో సంపద పంపిణీ గురించి ఎక్కువగా మాట్లాడింది ఆ పార్టీనే. రాజకీయంగా ఇతర అస్త్రాలు పనిచేయనప్పుడు సంపద పునఃపంపిణీ గురించి స్మరించటం అన్ని పార్టీలకు అలవాటే. దీనికి కాంగ్రెస్ మినహాయింపు కాదు. అయితే ఒకటి మాత్రం ప్రస్తుతం మన రాజకీయాల్లో స్పష్టంగా కనపడుతోంది. సంపద పునఃపంపిణీ అనేది జనాకర్షణ నినాదంగా మారింది. అన్ని పార్టీలకూ ఇది విస్మరించలేని విధానంగా పరిణమించింది. దీనికి ప్రత్యేకమైన కారణమూ ఉంది. ఏ ప్రజాస్వామ్య దేశంలో లేనంత స్థాయిలో సంపద, ఆదాయ పంపిణీల్లో అసమానతలు భారత్‌లో ఏర్పడ్డాయనీ నిరూపించే గణాంకాలు ఇటీవల బాగా వెలుగులోకి వస్తున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా అసమానతలను విశ్లేషించటంలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త టామస్ పికెటీ, ఆయన సహచర బృందం ఎంతో కృషి చేస్తోంది. ఆదాయం, సంపదల్లో అసమానతలు.. భారత్‌లో గతంలో ఎన్నడూ లేని రీతిలో విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొంటూ ఈ ఏడాది మార్చి 18న ఒక నివేదికను విడుదల చేసింది. దీనికి కొనసాగింపుగా మే నెలలో మరో చిన్న నివేదికను ప్రచురించింది. ఇందులో కులానికీ సంపద, ఆదాయ అసమానతలకూ మధ్యనున్న సంబంధాన్ని విశ్లేషించారు. భారత్‌కు సంబంధించి ఫోర్బ్ మ్యాగజీన్ ఏటా ప్రచురించే బిలియనీర్ల జాబితాతో పాటు జాతీయ గణాంకాల కార్యాలయం నిర్వహించే 'డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వేను' (ఏఐడీఐఎస్) ఆధారం చేసుకుని ఎగువ, వెనుకబడిన, దళిత, గిరిజన కులాల దగ్గరున్న సంపద లెక్కలను వివరించారు. ఫోర్బ్ ప్రచురించిన 100 మంది బిలియనీర్ల (100 కోట్ల డాలర్ల సంపద కలిగినవారు) జాబితాలోని వ్యక్తుల ఇంటి పేర్లను విశ్లేషించి ఎవరు ఏ కులానికి చెందుతారో నిర్ధారించారు. అట్లా 2022–2023 నాటి ఫోర్బ్ జాబితాను పరిశీలిస్తే అందులో 90 శాతం మంది అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారు. వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) చెందిన వారు 10 శాతం లోపే ఉన్నారు. షెడ్యూల్డు కులాలకు (ఎస్సీ) చెందినవారు 2.6 శాతం ఉండగా గిరిజనులకు (ఎస్టీలు) అసలు చోటే దక్కలేదు. ఇక 2018–2019 నాటి ఏఐడీఐఎస్ ప్రకారం చూస్తే కాస్త భిన్నమైన సామాజిక చిత్రం కనపడింది. అగ్రకులాల జనాభా 25 శాతం ఉందనుకుంటే వారి దగ్గరున్న సంపద మాత్రం 55 శాతం వరకూ ఉంది. ఓబీసీల దగ్గర 35 శాతం సంపద ఉంటే ఎస్సీ, ఎస్టీల దగ్గర వారి జనాభాతో పోల్చితే సగం శాతం మాత్రమే ఉంది. అంటే 10 శాతానికి కాస్త అటూ



> సంపదలు, ఆస్తులపై పట్టును వదులుకోవటం ఏ వర్గమూ అంత తేలికగా అంగీకరించదు. ఎన్నో సంఘర్షణలు, ఎన్నో ఒత్తిడులు తలెత్తితే కానీ సంపద పునఃపంపిణీకి అడుగులు పడవు. గత రెండు వందల ఏళ్ల ప్రపంచ చరిత్ర చెప్పే నిజం అదే. అయితే బలంగా వేళ్లూనుకున్న రాజకీయ ప్రజాస్వామ్యం కొన్ని సందర్భాల్లో అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలదు! భారత్ కూడా అందుకు మినహాయింపు కాదేమో!

ఇటూగా ఉంటుందని అనుకోవచ్చు.

సామాజికంగా కులాల హెచ్చుతగ్గుల స్థితికీ సంపదలో వాటికి ఉన్న వాటాలకు మధ్య సంబంధం స్పష్టంగా ఉందనీ పై గణాంకాల వల్ల తెలుస్తోంది. మొత్తంగా సమాజాన్ని నాలుగు కుల సమూహాలుగా చూస్తే ఇందులో ఎటువంటి సందేహం కలగదు. అయితే విడివిడిగా ఒక్కో కులాన్ని నిర్దిష్టంగా పరిశీలిస్తే మరో కఠిన వాస్తవం కనపడుతుంది. చాలా కులాల్లో సంపదతో ముడిపడిన వర్గాలు తలెత్తటం, వాటి మధ్య తేడాలు పెరగటమూ బాగా జరుగుతోంది. అందుకే ఒక తరహా ఆర్థిక అంశాల చుట్టూ ఒక కులం వారందరినీ సమీకరించే ప్రయత్నాలు అనుకున్న రీతిలో ముందుకు పోలేని దృశ్యాలే ఎక్కువ. అలాగే కులంలోని వారందరినీ ఒక గాటన కట్టి తారతమ్యాలు పట్టించుకోకుండా పదవులు, ఉద్యోగాల్లో ఎక్కువ వాటా కావాలని కోరే ఉద్యమాలను ఆర్థిక హెచ్చుతగ్గులు చాలా చోట్ల నిలువరిస్తున్నాయి. కులాల అంతర్గత పరిస్థితులపై సరైన గణాంకాలుంటే చాలా విషయాలపై స్పష్టత వస్తుంది. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలను నిర్దిష్టంగా ఎవరికి వర్తింపచేయాలో తేల్చవచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రతి కుటుంబానికి చెందిన ఆస్తులు, ఆదాయ గణనకు సామాజిక–ఆర్థిక సర్వే చేపట్టాలన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పికెటీ బృందం కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేసింది. సంపద, ఆదాయాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న గణాంకాలు చాలా లోపభూయిష్టమైనవి. వెల్లడైన ఆస్తుల కంటే దాచేసినవే ఎక్కువ.

భారత్‌లో బిలియనీర్ రాజ్ నడుస్తోందంటూ పికెటీ బృందం మార్చి నివేదికలో వ్యాఖ్యానించటం పెద్ద వివాదాన్నే సృష్టించింది. ముఖ్యంగా 2014 నుంచి అసమానతలు ఇంకా ఎక్కువయ్యాయని గణాంకాల ప్రాతిపదికన వివరించటంతో ప్రభుత్వ ఆర్థిక విధానాలను సమర్థించే వారి నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. పికెటీ బృందం వీటన్నిటినీ పరిశీలించి వాటిలో పసలేదనీ తేల్చింది. దీనికే పరిమితం కాకుండా అసమానతలను తగ్గించటానికి కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది. ఒక శాతం జనాభా చేతుల్లో 40 శాతం సంపద పోగుపడిందన్న విషయం పికెటీ బృందం ఇప్పటికే చాలాసార్లు ప్రస్తావించింది. 1980ల నాటికి ఈ పరిస్థితి లేదు. అప్పటికి వీరి చేతుల్లో ఉన్న సంపద 12.5 శాతం మాత్రమే. ఆదాయంలోనూ ఇదే పరిస్థితి కనపడుతుంది. 1980ల నాటికి 1 శాతం జనాభాకు ఆదాయంలో 7.3 శాతం ఉంటే అది 2022–2023 నాటికి 22.6 శాతానికి పెరిగింది. 46 కోట్ల వయోజనుల చేతుల్లో ఉన్న మొత్తం సంపదతో పోల్చితే పదివేల మంది ధనికుల చేతుల్లో సంపద మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

అసమానతల్లో మనం అగ్రగాములం అయ్యాం. విశ్వ గురువుగా మారాం. మరి దీనికి విరుగుడు ఏమిటి? పికెటీ బృందం న్యాయబద్ధంగా పన్నును(టాక్స్ జస్టిస్) విధించటాన్ని ఒక పరిష్కారంగా చూపించింది. ముందుగా కేవలం ధనిక వర్గానికి చెందిన 0.4 శాతం మందిపై సంపద, వారసత్వ పన్నులను విధిస్తే రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయని చెప్పింది. ఒకటి: దీంతో అసమానతలు కొంతవరకూ కట్టడి చేయొచ్చు. రెండు: విద్య, వైద్యం, సామాజిక భద్రత, సంక్షేమ రంగాలకు కావాల్సిన నిధులను గణనీయంగా పెంచుకోవచ్చు. సంపద కలిగిన వ్యక్తి మరణించినప్పుడే వారసత్వ పన్నును విధించగలుగుతాం. కాబట్టి దీని పరిధి పరిమితం. అందుకే సంపదపై పన్నును విధించటమే కీలకం. 99.96 శాతం జనాభాపై ఎటువంటి భారం లేకుండా కేవలం 0.4 శాతం మందిపై సంపద పన్నును విధిస్తే వచ్చే ఆదాయం పికెటీ బృందం అంచనా ప్రకారం చాలా ఎక్కువే ఉంటుంది. మొదటగా కనీస స్థాయిలో 10 కోట్ల సంపద దాటిన వారిపై రెండు శాతం సంపద పన్నునీ, 33 శాతం వారసత్వ పన్నునీ విధిస్తే జీడీపీ విలువలో 2.7 శాతం విలువకు సమానమైన అదనపు ఆదాయం వస్తుంది. 2023–24లో మన జీడీపీ విలువ (ప్రస్తుత ధరల ప్రకారం) 295.36 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇందులో 2.7 శాతమంటే ఎనిమిది లక్షల కోట్లకు కాస్త తక్కువగా ఆదాయం లభిస్తుంది. ఇది చాలదనుకుంటే మరో రెండు స్థాయిల్లో సంపద, వారసత్వ పన్నులను ప్రతిపాదించారు. నికర సంపద 100 కోట్లు దాటిన వారిపై 2–4 శాతం పన్నులను విధిస్తే జీడీపీ విలువలో 4.6 శాతం ఆదాయం వస్తుందనీ అదే 3–5 శాతం విధిస్తే 6.1 శాతం ఆదాయం లభిస్తుందనీ తేల్చారు.



■ రాహుల్ కుమార్

పికెటీ బృందం ప్రతిపాదించిన విధంగా 0.4 శాతం జనాభాపై పన్నులు విధించగలిగితే విద్య, వైద్యం, సామాజిక సంక్షేమం, పౌరసదుపాయాలపై ఖర్చు బాగా పెరిగి కొన్నేళ్లలోనే మన మానవాభివృద్ధి చిత్రమే మారిపోతుంది. ఇదే జరిగితే ప్రధానంగా కింది, మధ్య కులాలు బాగా లబ్ధిని పొందుతాయి. కులతత్వ ఆలోచనలూ తగ్గే అవకాశం ఉంటుంది. సామాజికపరమైన అంతరాలను తగ్గించటంలో విద్యావ్యాప్తి ప్రభావం అన్నిటికంటే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచీకరణ వల్ల తలెత్తున్న పోటీ వాతావరణంలో అవకాశాలు దక్కించుకోటానికి నాణ్యమైన విద్య నైపుణ్యాలు ఎంతో కీలకమైనవి. ఈ రెండూ కింది కులాల్లోని అర్హులకు తగిన స్థాయిలో దక్కకపోవటమే అభివృద్ధికి ఆటంకంగా ఉంది.

ఈ దిశగా చర్యలు లేకుండా ఆదాయ, సందద అసమానతలు మరింతగా పెరగనిస్తే తలెత్తే నాలుగు విపరిణామాలు ప్రధానంగా చెప్పుకోవచ్చు. 1) విపరీత ఆదాయ అంతరం పేద, మధ్య తరగతి కొనుగోలు శక్తిని విపరీతంగా తగ్గిస్తుంది. ఉత్పత్తులకు తగినంత గిరాకీ ఉండదు. దీంతో ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక ప్రగతి మందగిస్తుంది. 2) విపరీత అసమానతలకు లోనవుతున్న ప్రజలు అసంతృప్తి, ఆగ్రహాలతో రగలిపోతూ రాజకీయ–సామాజిక అస్థిరతలకు కారణమవుతారు. 3) ఫలితంగా డాంబిక జనాకర్షణ నినాదాలతో నియంతృత్వ పోకడలు గల రాజకీయ నేతలు అధికారాన్ని చేజిక్కించుకునే ప్రమాదం పెరుగుతుంది. 4) విపరీత సంపద కేంద్రీకరణ ప్రభుత్వంపై కొద్ది మంది ధనికుల అనుచిత ప్రభావాన్ని నెరపటానికి కారణమవుతుంది.

మరి.. 0.4 శాతం ప్రజలపై సంపద పన్నుని విధించటానికి రాజకీయ పార్టీలు సంసిద్ధంగా ఉన్నాయా? అని ప్రశ్నించుకుంటే అవునని చెప్పుకొనే పరిస్థితి లేదు. చాలా రాజకీయ పార్టీల్లో కీలక స్థానాలను 0.4 శాతం నుంచి వచ్చినవారే క్రమేపీ ఆక్రమిస్తున్నారు. సంపదలు, ఆస్తులపై పట్టును వదులుకోవటం ఏ వర్గమూ అంత తేలికగా అంగీకరించదు. ఎన్నో సంఘర్షణలు, ఎన్నో ఒత్తిడులు తలెత్తితే కానీ సంపద పునఃపంపిణీకి అడుగులు పడవు. గత రెండు వందల ఏళ్ల ప్రపంచ చరిత్ర చెప్పే నిజం అదే. అయితే బలంగా వేళ్లూనుకున్న రాజకీయ ప్రజాస్వామ్యం కొన్ని సందర్భాల్లో అసాధ్యాలను సుసాధ్యాలు చేయగలదు! భారత్ కూడా అందుకు మినహాయింపు కాదేమో!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

బంజారాల తొలి పండుగ

గిరిజనులు ప్రకృతిని నమ్ముకొని బతుకుతున్న అమాయకులు. ప్రతికూల పరిస్థితుల మధ్య తమ సంస్కృతీ సంప్రదాయాలను, కళలను, మౌఖిక సాహిత్యాన్ని కాపాడుకుంటున్నారు. ప్రకృతిని పూజించడం, ప్రేమించడం గిరిజనుల ప్రత్యేకత. పండుగ సందర్భాల్లో పశువులను అలంకరించి, వాటికి పేర్లు పెట్టి, మనుషులతో సమానంగా ప్రేమగా చూసుకుంటారు. చరిత్ర ఉనికిని మొదలుకొని నేటి వరకు లంబాడీలకు పశుసంపదే జీవనాధారం. వారి ఆర్థిక వ్యవస్థ వారి పశుసంపదపై ఆధారపడి ఉంటుంది. అందువలనే బంజారా సమాజం పశుసంపద వృద్ధి కోసం కొండ ప్రాంతాలలో, అడవి ప్రాంతాలలో, పశుగ్రాసం, నీరు ఎక్కువగా లభించే ప్రాంతాలలో తండాలు ఏర్పాటు చేసుకుంటారు. పశువుల ఆరోగ్యం, రక్షణ, అభివృద్ధి కోసం ప్రతి ఏటా పునర్వసు కార్తెలో గిరిజన తండాల్లో సీత్ల పండుగను బంజారాలు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. బంజారాల తొలి పండుగ సీత్లా పండుగ. వర్షాకాలంలో పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా, తండ ప్రజలు ఎలాంటి అంటువ్యాధుల బారిన పడకుండా తమను సీత్లా భవాని రక్షిస్తుందని గిరిజన లంబాడీల విశ్వాసం.

పంటలు సమృద్ధిగా పండాలని, పాడి పశువులు క్షేమంగా ఉండాలని సీత్ల తల్లికి మొక్కులు తీర్చుకొని, సప్త మాతృకలైన మేరామా, తొల్జా, మంత్రాల్, కంకాళీ, హింగ్లా, ద్వాల్గార్, సీత్ల భవానీలను పూజిస్తారు. గిరిజన లంబాడీల సంస్కృతీ సంప్రదాయాలకు సీత్లా పండుగ ప్రతీకగా నిలుస్తుంది. తెలుగు వారి పండుగలు ఉగాదితో ఏ విధంగా ప్రారంభమవుతుందో, బంజారా పండుగలు సీత్ల పండుగతో ప్రారంభమవుతాయి. లంబాడీలు తీజ్, దసరా, దీపావళి, హోలీ, ఉగాది, తుల్జా భవాని పండుగలను కూడా జరుపుకుంటారు. నిరంతరం శ్రమించే లంబాడీలకు వారి పండుగలు, ప్రదర్శన కళలు సేదతీర్చడానికి ఉపయోగపడతాయి. సీత్లా పండుగ నిర్వహణ తండా బయట తూర్పు దిక్కున జరుగుతుంది. సీత్లా మాత ప్రతిమ మధ్య భాగంలో ఉండేలా మిగతా భవానీలను ఇరువైపులా ఒక వరుసలో ప్రతిష్ఠిస్తారు.



పండుగకు ఒకరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలతో వండిన ఘుగ్రీ (గుగ్గిళ్ళు), లాప్సి (పాయసం)ని పెళ్లికాని యువతుల చేత సప్త దేవతలకు నైవేద్యంగా చెల్లిస్తారు. తండవాసులు మేళతాళాలతో కోళ్లు, గొర్రెపోతులు, మేకపోతులతో బోనాలు ఎత్తుకొని తండా నుంచి బయలుదేరతారు. మగవారు డప్పు వాయిస్తుండగా వాయిద్యానికి అనుగుణంగా బంజారా స్త్రీలు కాళ్ళు, చేతులు ముందుకు వెనకకు కదుపుతూ వలయాకారంలో తిరుగుతూ నృత్యాలు చేస్తారు. వనదేవతలను కీర్తిస్తూ పాటలు పాడుతారు. గొర్రెపోతులను దేవతలకు బలి ఇచ్చి, గొర్రెపోతుల పొట్టలోని పేగులను బయటకు తీసి, ఏడుగురు భవానీల ప్రతిమల నుంచి లుంకడియా ప్రతిమ వరకు నేలపై పరిచి, యువతుల చేత నీటితో జలాభిషేకం చేయిస్తారు. ఆ పేగుల పైనుండి పశువులు, గొర్రెలు, మేకలను దాటిస్తారు. అందువల్ల సీత్లా పండుగను దాటుడు పండుగ అని కూడా అంటారు.

తండాల్లో దేవుళ్లకు గుడి గోపురాలు కట్టించి పూజించే సంప్రదాయం లంబాడీలకు లేదు. కానీ ఇటీవల కాలంలో తండాలలో వివిధ రకాల పేర్లతో దేవుళ్ళ గుళ్ళు నిర్మించడం మొదలైంది. ఇలా తండా ప్రజలు తమ సాంప్రదాయ పండుగలను నిర్వహించుకుంటూ మిగతా పండుగలను కూడా జరుపుకోవడం వలన ఆర్థిక భారం పెరుగుతున్నది. అంతేకాకుండా కొత్త ఆచారాలు, పండుగలు, సాంప్రదాయాలు వివిధ పేర్లతో గిరిజన తండాలోకి ప్రవేశించి తండా సంస్కృతిని ధ్వంసం చేస్తున్నాయి. పండుగ నిర్వహణకు అయ్యే ఖర్చు కంటే ఆ సందర్భంగా బంజారా ప్రజలు మద్యం పైన చేసే ఖర్చు ఎక్కువగా ఉంటున్నది. ఫలితంగా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నారు. ఇది గిరిజన బంజారా సమాజాన్ని పొదుపు వైపు ప్రోత్సహించటం లేదు. వాళ్లు వ్యవసాయం పైన చేసే పెట్టుబడి, విద్య, వైద్యం పైన చేసే ఖర్చు కన్నా ఒక కుటుంబం ఒక సంవత్సర కాలంలో మద్యం, ధూమపానంపై చేసే ఖర్చు ఎక్కువగా ఉంటున్నది. గతంలో తండా పెద్దలు కూర్చొని ఏ కార్యమైనా, పండుగైనా, పెళ్లయినా, పంచాయతీ అయినా సామూహికంగా పరిష్కరించుకునే సాంప్రదాయం ఉండేది. కానీ ఇప్పుడు తండాల్లో ఆ సంస్కృతి నశించిపోయింది. తండాలోని ప్రజలు ఉద్యోగ ఉపాధి కోసం, ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వలస వెళ్లడం ద్వారా తండా ప్రజల్లో చైతన్యం కొరవడింది. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలోనూ తండావాసులు సతమతమైపోతున్నారు. తండాలో మద్యపానాన్ని నిషేధించవలసిన అవసరం ఉంది.

బంజారా జాతిలో ఉన్న మేధావులు, విద్యావంతులు, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుకుంటున్న గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను కాపాడే బాధ్యతను తీసుకొని వాటి ప్రాధాన్యతను భవిష్యత్ బంజారా తరానికి అందించే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ సీత్లా పండుగను జూలై 9వ తారీఖున జరుపుకోవాలని గిరిజన మత పెద్దలు, సాహితీవేత్తలు, విద్యావంతులు కోరుకుంటున్నారు.

● డా. వల్యా లునావత్
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్

ఏడున్నర దశాబ్దాల విద్యార్థి ఉద్యమం

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేడు భారతదేశంలో క్రియాశీలమైన విద్యార్థి సంఘం. స్వర్గీయ యశ్వంతరావు కేల్కర్, స్వర్గీయ దత్తాజీ డిండోల్కర్, సమైక్య ఆంధ్రప్రదేశ్ నుండి స్వర్గీయ జనమంచి గౌరీశంకర్ గార్లు ఏబీవీపీ సంఘటనాత్మకమైన కార్యపద్ధతికి పునాది వేశారు. భరతమాత పునర్వైభవం కోసం విద్యార్థి, యువతను సంఘటితపరిచి వారిలో దేశభక్తి, దేశం పట్ల నిష్ఠను పాదుకొల్పడం కోసం జ్ఞానం, శీలం, ఏకతలే ధ్యేయంగా విద్యార్థి పరిషత్ ప్రభావశీలంగా దేశంలో పనిచేసింది. ఏబీవీపీ 1949 జూలై 9న అధికారికంగా కార్యక్రమాలు ప్రారంభించింది. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా పనిచేయడంలో ముందుంది.

1969 తెలంగాణ ఉద్యమంలో ఏబీవీపీ క్రియాశీలక పాత్ర పోషించింది. 1997 నెల్లూరులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిపాలన సౌలభ్యం కోసం రెండు రాష్ట్రాలుగా విభజించాలని తీర్మానం చేసింది. ఏ రాజకీయ పార్టీ సాహసం చేయని సందర్భంలో ఏబీవీపీ తీర్మానం చేయడం విశేషం. దానికి అనుగుణంగానే కృష్ణ, గోదావరి జలాలు బీడు భూములకు అందించి లక్షలాది ఎకరాలను సాగులోకి తీసుకురావాలని బాసర నుండి శ్రీశైలం వరకు సస్యశ్యామల రథయాత్రను ఏబీవీపీ నిర్వహించింది. ఈ యాత్ర తెలంగాణ పల్లెల్లో సైతం తెలంగాణ ఆవశ్యకతను గుర్తించేట్లు చేసింది. తద్వారా అన్ని రాజకీయ పార్టీల ఎజెండాలో చేర్చక తప్పలేదు. తెలంగాణ సాధనకై డిసెంబర్ 8, 2009లో ఏబీవీపీ చలో అసెంబ్లీ కార్యక్రమంతో తెలంగాణ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. 2010 జనవరి 23వ తేదీన నిజాం కళాశాల గ్రౌండ్‌లో వేలాది మంది విద్యార్థులచే భారీ రణభేరి నిర్వహించింది. తెలంగాణ కోసం వందలాది మంది విద్యార్థులతో కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నాలుగు స్థలాల నుండి పాదయాత్ర నిర్వహించింది. ఇలా అనేక రకాల ఉద్యమాల ద్వారా యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన రాష్ట్ర కలను సాకారం చేసింది.

తెలంగాణ ఆశయాలు నీరుగార్చి పది సంవత్సరాలుగా నియంత పోకడతో కాలం గడిపింది టీఆర్ఎస్ ప్రభుత్వం. నీళ్లు లేక, నియామకాలు చేపట్టక, నిధులు కేటాయించకుండా నిరుద్యోగ, విద్యార్థి, ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగించి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి రాష్ట్ర వ్యాప్తంగా లక్షమంది విద్యార్థులతో పరేడ్ గ్రౌండ్‌లో కదనభేరి మహాబహిరంగ సభను నిర్వహించి, కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించింది ఏబీవీపీ. దేశ సైనికులు బార్డర్లో ఉండి పనిచేస్తే దేశం లోపల జరుగుతున్న అనేక సమస్యలపైన నిరంతరం పోరాడుతూ భారతీయ సంస్కృతిని కాపాడటంలో కూడా ఏబీవీపీ ముఖ్యపాత్ర పోషిస్తుంది.

– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

ఆధిపత్య వర్గాల భాషలో 'ప్రజాపాలన' సాధ్యమా?

తెలంగాణలో 'ప్రజాపాలన' అమలుజరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ అంటూంటారు. ఇది హర్షించదగ్గ విషయం. ప్రజాస్వామ్యంలో రాచరిక లేదా ఫ్యూడల్ సంస్కృతికి తావుండకూడదు. అయినప్పటికీ పాలన ఆధిపత్య వర్గాల భాషలో కాకుండా ప్రజలభాషలో జరిగినప్పుడే ప్రజాపాలన సాధ్యమవుతుందని తెలంగాణ ప్రభుత్వం ఇంకా గుర్తించవలసి ఉంది. మనదేశంలో తొంభై శాతం జనాభాకు ఇంగ్లీషు రాదు. మరి పదిశాతం ప్రజలకు మాత్రమే తెలిసిన ఆంగ్లభాషలో జరిగే పాలన ప్రజాపాలన అవుతుందా? ఆధిపత్య వర్గ పాలన అవుతుందా?

తెలుగు రాష్ట్రాల అధికారిక వెబ్‌సైట్లు సైతం ఇంగ్లీషులో మాత్రమే నడుస్తున్నాయి. సామాన్య పేద ప్రజల కోసం నిర్దేశించిన ప్రభుత్వ పథకాల సమాచారాన్ని సైతం ఇంగ్లీషులో మాత్రమే ఉంచడం ఆధిపత్య వర్గాల అవివేకాన్ని సూచించడంతో పాటు, వారు సామాన్య ప్రజలను ఇప్పటికీ ఆధునిక పౌరులుగా, హక్కులు, అధికారాలు ఉన్న మనుషులుగా, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యులుగా పరిగణించరని అర్థమవుతుంది. బహుశా వీరి దృష్టిలో ఇంగ్లీషు రాని సామాన్య ప్రజలు ఓటర్లు మాత్రమే. మహా అంటే ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు! ఇలాంటి పరిస్థితుల్లో నడిచే పాలనను నిజమైన ప్రజాపాలన అనవచ్చా?

2017లో గత ప్రభుత్వం తెలుగుతో పాటు ఉర్దూని తెలంగాణ రాష్ట్ర రెండవ అధికార భాషగా ప్రకటించింది. 2018లో తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం, అదే ఏడాది మార్చిలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అన్ని ప్రభుత్వ శాఖలలో తెలుగు అధికార భాషగా అమలు జరగాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆ ఉత్తర్వులను పట్టించుకున్న వాళ్ళు లేరు. మేము గత ఒక సంవత్సరంగా నల్సార్ విశ్వవిద్యాలయంలో డా. మనోహర్ రెడ్డి బోధిస్తున్న "Language and Justice" అనే కోర్సులో భాగంగా న్యాయ స్థానాలను, పోలీస్ స్టేషన్లను, కార్మిక కార్యాలయాలను సందర్శించి కొంత పరిశోధన చేశాం. కొంతమంది న్యాయమూర్తులు, న్యాయవాదులు, అర్జీదారులు, కార్మికులు మొదలైన వాళ్ళనుండి ఆసక్తికరమైన విషయాలను తెలుసుకున్నాం. పోలీస్ స్టేషన్లలో; పేదలు, దిగువ మధ్యతరగతి వాళ్ళు ఎక్కువగా వెళ్ళే జిల్లా కోర్టుల్లో బోర్డులన్నీ ఇంగ్లీషులో ఉన్న దుస్థితిని గమనించాం. పోలీసులు వచ్చీరాని ఇంగ్లీషులో ఎఫ్ఐఆర్లు, చార్జిషీట్లు రాయడానికి పడే పాట్లు చూశాం. అర్జీదారుడి కేసును న్యాయవాది న్యాయమూర్తికి సగం ఇంగ్లీషులో సగం తెలుగులో వివరించడానికి పడుతున్న యాతన చూశాం. అదేమీ అర్థం కాక బిక్క మొహంతో చేతులు జోడించి నిల్చున్న ఆ అర్జీదారుడి నిస్సహాయతను పరికించాం. చదువురాని ఆదివాసీ తల్లిదండ్రులకు తమ కొడుకును అరెస్టు చేసిన విషయాన్ని ఇంగ్లీషులో నోటీస్ ద్వారా తెలియజేసిన దుర్మార్గాన్ని గమనించాం. వీటన్నిటితో పాటు ఒక కార్మిక సంఘం, దాని నాయకుడు భాష విషయంలో తమ యాజమాన్యంతో చేస్తూన్న సుదీర్ఘ న్యాయ పోరాటాన్ని ఇక్కడ వివరించదల్చుకున్నాం.

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని ఎంఆర్ఎఫ్ టైర్స్ కంపెనీలో కొంతమంది కార్మికులు 2022లో 'తెలంగాణ ఏం.ఆర్.ఎఫ్. కార్మిక సంఘం' (Telangana MRF Tyres Workers Union)గా ఏర్పడి రుద్ర శ్రీనివాస్‌ను తమ అధ్యక్షుడిగా ఎన్నుకొని పనిచేస్తూ తమ సమస్యలపై యాజమాన్యంతో పోరాటం సాగిస్తున్నారు. ఇది నచ్చని యాజమాన్యం రుద్ర శ్రీనివాస్‌ను అతనికి చేతకాని ఒక పనికి కేటాయించి, ఆపైన అతని పని సరిగా లేదంటూ 2022 జూలైలో ఐదు వార్నింగ్ లెటర్స్‌ను ఇంగ్లీషులో అందజేసిందని సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు. కేవలం పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకున్న రుద్ర శ్రీనివాస్ వాటిని తెలుగులో ఇవ్వాలని ఎప్పటికప్పుడు కోరుతూ వచ్చాడు. అతని న్యాయమైన విన్నపాన్ని పట్టించుకోకపోగా, వార్నింగ్ లెటర్స్‌ను తిరస్కరించాడనే నెపంతో యాజమాన్యం శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీస్, చార్జిషీట్లను ఆంగ్లంలో పంపించి, 2022 ఆగస్టులో సస్పెండ్ చేసింది. వేరేదారి లేక, రుద్ర శ్రీనివాస్ సదాశివపేటలోని డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. అక్కడి జాయింట్ కమిషనర్ విచారణ జరిపి, కార్మికులకు ఇచ్చే అన్ని అధికారిక పత్రాలు తప్పక తెలుగులోనే ఇవ్వాలంటూ ఎంఆర్ఎఫ్ యాజమాన్యానికి ఉత్తర్వులు జారీ చేసి, అలా ఇవ్వకపోవడం చట్టాల ఉల్లంఘన అవుతుందని స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఇలాంటి ఉత్తర్వులతో మాత్రమే సంతృప్తి చెందని యూనియన్ నాయకులు లేబర్ కమిషనర్ కార్యాలయం సరైన గట్టి చర్యలు తీసుకోవట్లేదని హైదరాబాద్ ఉపలోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఉపలోకాయుక్త రుద్ర శ్రీనివాస్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది.

> సామాన్య పేద ప్రజల కోసం నిర్దేశించిన ప్రభుత్వ పథకాల సమాచారాన్ని సైతం ఇంగ్లీషులో మాత్రమే ఉంచడం ఆధిపత్య వర్గాల అవివేకాన్ని సూచించడంతో పాటు, వారు సామాన్య ప్రజలను ఇప్పటికీ ఆధునిక పౌరులుగా, హక్కులు, అధికారాలు ఉన్న మనుషులుగా, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యులుగా పరిగణించరని అర్థమవుతుంది. బహుశా వీరి దృష్టిలో ఇంగ్లీషు రాని సామాన్య ప్రజలు ఓటర్లు మాత్రమే.



జాయింట్ కమీషనర్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను గుర్తు చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని ఉపలోకాయుక్త ఎంఆర్ఎఫ్ యాజమాన్యానికి 2023 మార్చిలో ఉత్తర్వులు జారీ చేశారు. ఇదేమీ పట్టించుకోకుండా యాజమాన్యం శ్రీనివాస్ మీద కక్ష సాధింపుగా ఎంక్వయిరీని కొనసాగించిందని కార్మిక నాయకుల వాదన. మరోసారి సమస్యను పరిష్కరించే దిశగా 2023 జూన్‌లో జాయింట్ కమీషనర్ ఎంఆర్ఎఫ్ యాజమాన్యాన్ని కార్మిక నాయకులతో జాయింట్ మీటింగుకు ఆహ్వానించినా యాజమాన్యం స్పందించకపోగా, 2023 జూలైలో 65 పేజీల ఎంక్వయిరీ రిపోర్ట్‌ను ఇంగ్లీషులో శ్రీనివాస్‌కు అందజేసింది. ఇంగ్లీషు రాని శ్రీనివాస్ దాన్ని ఎలా అర్థం చేసుకోగలడు? సమాధానం ఎలా ఇవ్వగలడు? ఆ రిపోర్ట్ అందుకున్న నాలుగు రోజుల్లోనే, పాత నోటీసులు, లెటర్లు, చార్జ్ షీట్లు తెలుగులో ఇచ్చేవరకు ఎంక్వయిరీ జరపరాదని, సరైన కారణం లేకుండా జాయింట్ మీటింగుకు రాకుండా ఎంక్వయిరీ కొనసాగించడం తప్పు అని శ్రీనివాస్ మళ్ళీ జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఈసారి జాయింట్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో శ్రీనివాస్ హైకోర్టుకు వెళ్ళక తప్పలేదు. జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ తగు చర్యలు తీసుకోకపోవడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని హైకోర్టులో వేసిన పిటిషన్లో శ్రీనివాస్ పేర్కొన్నాడు. ఇరువైపు వాదనలు విన్నాక, ఎంఆర్ఎఫ్ యాజమాన్యం లేబర్ కమిషనర్ ఉత్తర్వులను స్పష్టంగా ఉల్లంఘించిందని పేర్కొంటూ తదుపరి ఆదేశాలిచ్చే వరకు రుద్ర శ్రీనివాస్ మీద జరుపుతున్న అన్ని ఎంక్వయిరీలు ఏ షరతులు లేకుండా ఆపివేయాలని, శ్రీనివాస్ మీద వేసిన సస్పెన్షన్ ఎత్తివేయాలని హైకోర్టు ఆదేశించింది. ఎంఆర్ఎఫ్ యాజమాన్యం హైకోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదు! తీర్పు వచ్చిన రెండు వారాలకు శ్రీనివాస్ మరోసారి యాజమాన్యానికి, డిప్యూటీ కమీషనర్‌కి హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. అయినా స్పందన లేకపోవడంతో యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తోందని శ్రీనివాస్ మళ్ళీ అదే హైకోర్టులో కంటెంప్ట్ కేసు నమోదు చేశాడు. కేసు ఇప్పటికీ నడుస్తూంది.

ఎన్నో సంవత్సరాలుగా అర్థం కాని భాషలో జీవనోపాధిని ప్రమాదంలో పడేసే చార్జ్‌షీట్లు, వార్నింగ్ లెటర్లు అందుకుంటూన్న కార్మికులకు శ్రీనివాస్ పోరాటం స్ఫూర్తినిచ్చింది. 2024 మార్చిలో శ్రీనివాస్ సహకార్మికుడు తనకు ఆంగ్లంలో ఇచ్చిన సస్పెన్షన్ లెటర్‌ను తెలుగులో ఇవ్వాలని ఎంఆర్ఎఫ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసి సంపాదించుకోగలిగాడు. కాకపోతే ఏ తప్పూ చేయని శ్రీనివాస్ మాత్రం కేవలం న్యాయం కోసం పోరాడిన పాపానికి ఏ జీవనోపాధీ లేకుండా ఇప్పటికీ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఇంకా మా దృష్టికిరాని ఇలాంటి శ్రీనివాస్‌లు ఇంకెన్ని వందలమందో వేలమందో?! తెలంగాణ ప్రభుత్వం నిజమయిన ప్రజాపాలనను అమలు చెయ్యాలంటే ప్రజలను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చెయ్యడానికి గట్టి చర్యలను తీసుకోవాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్లో, కోర్టుల్లో అసలైన ప్రజాపాలన సాధ్యం కావాలంటే, న్యాయం అందరికీ అందుబాటులో వుండాలంటే ప్రగతిభవన్ లాగే, ఆంగ్ల భాష ఇనుప గేట్లను కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విరగ్గొట్టక తప్పదు.

■ అఖిల్ సూర్య
■ లక్ష్య అనంత్
బిఏఎల్ఎల్‌బి విద్యార్థులు, నల్సార్ విశ్వవిద్యాలయం

నామినేటెడ్ పండుగ

గతంలో ప్రకటించిన పదవులకు గ్రీన్‌సిగ్నల్



- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఆరుగురికి అవకాశం
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రోజే ప్రకటన.. ఇన్నాళ్లకు ఉత్తర్వులు జారీ
- లోక్‌సభ టికెట్ త్యాగం చేసిన, ఇతర కీలక నేతలకు దక్కని పోస్టులు
- రెండో విడతలో పదవుల ప్రకటనపై కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ
- రాష్ట్ర స్థాయి తరువాత 'జిల్లా పదవుల' ప్రకటన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాంగ్రెస్‌లో పదవుల కోలాహలం నెలకొంది. మార్చి 16వ తేదీన ప్రకటించిన నామినేటెడ్ పదవులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రత్యేకంగా జీవోల ను విడుదల చేయటంతో నామినేటెడ్ పదవులు పొందిన నేతలు, వారి అనుచరుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇక లాంఛనంగా పదవీబాధ్యతలు స్వీకరించేందుకు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులపై కీలక నేతలు ఆశలు పెట్టుకున్నారు. తొలివిడతలో ఆరుగురికి నామినేటెడ్ బెర్త్‌లు ఖరారవడంతో ఇక రెండో విడత నామినేటెడ్ పోస్టులపై ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన నేతలతో పాటు కీలక నేతలు తమకు కూడా నామినేటెడ్ పదవులు వస్తాయనే ఆశతో ఉన్నారు. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీ తరువాత జిల్లా స్థాయి పదవులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.

ఆ ఆరుగురి ఎంపికకు గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పదేళ్ల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి రావటంతో అనేక మంది సీనియర్ నేతలతో పాటు గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సామాజిక, ఇతర సమీకరణల నేపథ్యంలో టికెట్ రాని నేతలకు నామినేటెడ్ పదవులతో అధికారం అప్పగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేసింది. పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన రోజునే మార్చి 16న రాష్ట్ర వ్యాప్తంగా 37మందికి నామినేటెడ్ పోస్టులను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఆరుగురికి చోటు దక్కింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవులు దక్కించుకున్న నేతలకు కుర్చీలో కూర్చునే అవకాశం లేకుండా పోయింది. ఆ తరువాత జూన్ 6వ తేదీన ఎన్నికల కోడ్ పూర్తయినప్పటికీ నామినేటెడ్ పోస్టులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవటంతో తమ పోస్టులు ఉన్నట్టా.. లేనట్టా అనే డైలమాలో పడిపోయారు. ఎట్టకేలకు గతంలో ప్రకటించిన వారికే నామినేటెడ్ పదవులని కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో పాటు పాత తేదీల్లోనే నామినేట్ అయిన వారికి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదవులు పొందిన నేతలు, వారి అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఎవరెవరికి ఏ పదవులంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత కీలక పదవిగా భావించే కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ పదవి ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఇనుగాల వెంకట్రామిరెడ్డికి దక్కింది. అలాగే సీనియర్ నేత జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ పదవి, మరో సీనియర్ నేత, ఉద్యమకారుడు రియాజ్‌కు రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్య నాయక్‌కు గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే ములుగు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, భూపాలపల్లి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. ఈ ఆరుగురికి పదవులను ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువడటంతో పదవీబాధ్యతలు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కుడా చైర్మన్‌గా నియమించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి సోమవారం సాయంత్రమే పదవీబాధ్యతలను స్వీకరించారు. దీంతో నామినేటెడ్ పదవులు పొందినే నేతల అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రెండో విడతపైనే కీలక నేతల ఆశలు

నామినేటెడ్ పదవులపై పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆశలు పెంచుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రకటించిన జాబితాను యథావిధిగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో అనేక మంది అనేక విధాలుగా త్యాగాలు చేయాల్సి వచ్చింది. వారిలో ప్రధానంగా సీనియర్ నేతలు దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, శనిగరపు ఇందిర ఉన్నారు. ఈ ముగ్గురు నేతలకు కీలక పదవులు ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకవస్తున్నారు. వీరితో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల ఐతూ అలియాస్ అశోక్, నమిండ్ల శ్రీనివాస్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదితరులున్నారు. వీరికి కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యం కలిగించేందుకు నామినేటెడ్ పదవులను ఇవ్వాలనే డిమాండ్ ఉంది. అలాగే పార్టీలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ నేతలుగా ఉన్న పరకాలకు చెందిన మార్త విజయ్‌కుమార్, కె.రవళి, మీసాల ప్రకాష్, ములుగుకు చెందిన గొల్లపల్లి రాజేందర్‌తో పాటు సుమారు డజను మందికి పైగా కీలక నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే ఒత్తిడి అధిష్ఠానంపై ఉంది. వీరితో పాటు గత ఎన్నికల్లో జనగామ నుంచి పోటీ చేసిన ఓటమిపాలైన కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తికి చెందిన కీలక నేత ఝాన్సీరెడ్డిలకు ప్రొటోకాల్ కోసం నామినేటెడ్ పదవి ఇవ్వాలనే డిమాండ్ ఉంది. అయితే ఇప్పటికే 35మందికి రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవులను భర్తీ చేయగా, ఇంకా సుమారు 30కి పైగా రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రకటించినవి కూడా పార్లమెంట్ ఎన్నికలకు ముందు జాబితానే కావటంతో రెండోవిడత నామినేటెడ్ పదవులను కూడా ఒకటిరెండు వారాల్లో భర్తీ చేస్తారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆశావాహులు నామినేటెడ్ పదవుల కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో రెండో విడత పదవుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదవులు ఎవరిని వరిస్తాయోననేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల భర్తీపైనే దృష్టి పెట్టగా.. త్వరలోనే జిల్లా స్థాయి పదవులను భర్తీ చేసేందుకు కసరత్తు చేయనుంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు తమ పరిధిలోని మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీల చైర్మన్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నారు. వీటితో పాటు జిల్లా స్థాయిలో గ్రంథాలయ చైర్మన్, రైతు సమ న్వయ సమితి కమిటీ చైర్మన్ తదితర పోస్టు లను కూడా భర్తీ చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు చేస్తున్నారు. దీంతో ఈ నెలఖారులోపు జిల్లా స్థాయిలో కూడా నామినేటెడ్ పదవులను పూర్తిగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మొత్తానికి పదేళ్ల తరువాత కాంగ్రెస్ శ్రేణుల్లో పదవుల పండుగ వాతావరణం కనిపిస్తోంది.



కుడా చైర్మెన్ ఇనుగాలను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు రేవూరి, నాయిని, సుధారాణి, కమిషనర్

నగర అభివృద్ధే నా ధ్యేయం

- 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి
- బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన నేతలు, అధికారులు

వివరాలు 7లో..

పెండింగ్ ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు
- ప్రజావాణికి అందించిన 119 వినతులు



బాధితురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై 8 : ప్రజావాణికి వచ్చిన, పెండింగ్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి హనుమకొండ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు సమస్యలు విన్నవించుకునేందుకు తరలివచ్చారు. 119 వినతులు ప్రజావాణికి వచ్చాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 16 వినతులు, హసన్‌పర్తి తహసీల్దార్‌కు 12, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు సంబంధించినవి 12 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా బాధిత ప్రజల సమస్యలను కలెక్టర్ ప్రావీణ్య ఓపికగా వింటూ వినతులు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిచి ఎంక్వైరీ చేసి పరిష్కరించాలని సూచించారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు హాస్టల్‌లో ఉండే విద్యార్థినీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వై.వి గణేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

81జీవో అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల వినతి

81 జీవో అమలు చేసి న్యాయం చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏలు) కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జీవోలో రెండు రకాల అంశాలను పొందు పరచారని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్‌ఏలను రెండు అంశాలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, 61 సంవత్సరాలలోపు వీఆర్‌ఏలు, 61 సంవత్సరాలు నిండిన వీఆర్ ఏలుగా గుర్తించిందని, 61 సంవత్సరాలలోపు ఉన్న 16,758 మందిని రెగ్యులరైజ్ చేసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇంకా మిగిలిన 3797 మంది వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు వీఆర్‌ఏలు యుగేందర్, సతీష్‌లు తెలిపారు.

సమయం పాటించకపోతే చర్యలు

- అడిషినల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి

కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే అన్ని డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన ఉద్యోగులు సమయం పాటించాలని, పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా అడిషినల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఉదయం ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కావడానికి ముందు అన్ని డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన అధికారులు వచ్చారా అని ఆరా తీశారు. ఒక్కొక్క డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అధికారి శాఖ పేరు పెట్టి పిలుస్తూ ఈ శాఖ అధికారి వచ్చాడా అని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో, తెలంగాణ వెల్ఫేర్ స్కూల్, కాలేజీల ఆర్‌సీఓ, పంచాయతీరాజ్ శాఖ, మిషన్ భగీరథ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల అధికారులు వచ్చారా అని అడగగా ఎవరూ లేకపోవడంతో సీరియస్ అయ్యారు. ప్రతీ ఉద్యోగి ప్రజావాణికి రావాలని, కార్యాలయాలకు కూడా ప్రతీరోజు ఉదయం 10:30 గంటలకు రావాలని అన్నారు.

కుల్లా నిత్యక్లిన్నా అలంకారంలో భద్రకాళి



వరంగల్ కల్చరల్, జూలై 8: భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. సోమవారానికి వేడుకలు మూడో రోజుకు చేరాయి. సోమవారం అమ్మవారి దశ మహా విద్యలోని కాళీ క్రమాన్ని అనుసరించి కుల్లా, సాయంత్రం శోడశి క్రమాన్ని అనుసరించి నిత్యక్లిన్నా అలంకారంలో భద్రకాళి అమ్మవారిని అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ భూమిని ఉద్ధరించింది అమ్మవారు కాబట్టి కుల్లాగా పిలుస్తారన్నారు. రాక్షసుల భారినుంచి వరహమూర్తి రూపంలో నారాయణుడు భూమిని తన కోరలపై పెట్టుకొని రాక్షస సంహారం చేసి భూమండలాన్ని కాపాడినట్టు వెల్లడించారు. నారాయణమూర్తిలోని ఆ వరాహ శక్తియే కుల్లా మాతగా ఉద్ధరించినట్టు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనార్థ తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో శేషు భారతి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా, అమ్మవారిని వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి దంపతులు దర్శించుకోగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఈవో అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందించారు. అలాగే వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంజీఎంలో మౌలిక వసతులు కల్పిస్తాం

- టీజీ ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సహదేవ్



మాట్లాడుతున్న హేమంత్ సహదేవ్

వరంగల్ మెడికల్, జూలై 8 : ఎంజీఎం ఆస్పత్రిలో అవసరమైన మందులు, సర్జికల్స్ వైద్య పరికరాలను సమకూర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. సోమవారం ఎంజీఎం కాన్ఫరెన్స్ హాలులో ఎంజీఎంకు అవసరమైన మందులు, మెడికల్ ఎక్విప్‌మెంట్, మౌలిక సదుపాయాల కల్పనపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి టీజీ ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ హాజరయ్యారు. ఎంజీఎంలోని వివిధ విభాగాల ప్రొఫెసర్లు, సూపరింటెండెంట్, ఫార్మసీ డిపార్ట్‌మెంట్, టీజీఎంఎస్ఐడీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఈ సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రికి కావాల్సిన మెడికల్ ఎక్విప్‌మెంట్, మందులు, ల్యాబ్ కెమికల్స్, రియేజెంట్స్ కొరత లేకుండా సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. ప్రత్యేకంగా బయో మెడికల్ ఇంజనీరును ఎంజీఎంలో నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత రెండు వార్షిక సంవత్సరాల్లో ఎంజీఎం వినియోగించిన ఔషధాలు, సర్జికల్స్ ఆధారంగా భవిష్యత్‌లో ఇండెంట్లు సరఫరా చేస్తానని తెలిపారు. వివిధ విభాగాల శాఖాధిపతులు వారికి కావాల్సిన ఎక్విప్‌మెంట్స్ మందుల సరఫరా చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కౌటిల్య మాట్లాడుతూ.. అవసరమైన ఇండెంట్లను వైద్య, విద్య సంచాలకుల ద్వారా పంపించాలన్నారు. సకాలంలో వాటిని పంపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చీఫ్ ఇంజనీర్ దేవేంద్ర కుమార్, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఆర్ఎంవోలు డాక్టర్ మురళీ, డాక్టర్ ప్రసాద్, ఎగ్జిక్యూటీ ఇంజనీర్ ప్రసాద్, డిప్యూటీ ఈఈ రాజశేఖర్, సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ఇన్‌చార్జి ఫార్మసిస్టు ఉప్పల బాస్కర్‌రావు, ఫార్మసీ సూపర్ వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన వైద్యులకు మెమోలు

వరంగల్ మెడికల్, జూలై 8 : విధులకు గైర్హాజరైన 10 మంది వైద్యులతోపాటు వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 6న కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి ఎంజీఎం ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. వారందరి వివరాలు అదే రోజు సమీక్షా సమావేశంలో హాజరు రిజిస్టర్లు, బయోమెట్రిక్ హాజరును ఆర్డీవో కృష్ణవేణితో పరిశీలింపజేశారు. విధుల్లో ఉన్నవారికి హాజరు రిజిస్టర్లలో ఉన్న దానికి పొంతన లేకపోవడాన్ని గుర్తించారు.

ఒక పిల్లల వైద్యుడు జూలై నెల మొత్తం ముందుగానే హాజరు వేసుకోవడాన్ని గుర్తించి అతడిని సస్పెండ్ చేయాలని డీఎంఈకి సిఫారసు చేశారు. ఈ మేరకు గైర్హాజరైన పది మంది వైద్యులకు సోమవారం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మెమోలు జారీ చేశారు. అలాగే బయోమెట్రిక్ హాజరు వేసి విధుల్లో లేని 79 మంది వైద్య సిబ్బందితోపాటు, ఆలస్యంగా వచ్చిన 63 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేయర్ గుండు సుధారాణి



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై8 : వర్షాకాలంలో ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా వరంగల్ నగరం వర్షాకాలంలో ముంపుకు గురికాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన విషయం తెలిసిందేనని, ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో సైతం వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఆదేశించినట్టు గుర్తు చేశారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయాలని, మ్యాన్‌హోల్స్ మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని చెప్పారు. నాలాల పూడికతీత, డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ప్రధాన కార్యాలయంలోని టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4251 980, 97019 99640కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి జేసీబీలను అందుబాటులో ఉంచాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నగరంలోని చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి, పిల్లర్లు కట్టి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు బీఎల్ శ్రీనివాస్, రాజయ్య, శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, డీఈలు రవికిరణ్, సంతోష్‌బాబు, సారంగం, శివానంద్‌తో పాటు ఏఈలు పాల్గొన్నారు.



మూడు రోజుల ఉత్కంఠకు తెర

పోలీసుల చొరవ, పెద్ద మనుషుల హామీతో

ఆందోళన విరమించిన మృతుడి కుటుంబ సభ్యులు

వరంగల్ క్రైం, జులై 8 : న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడు బండ మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మూడు రోజులుగా నిందితుడు ప్రభాకర్‌రెడ్డి ఇంటి ఎదుట చేస్తున్న ఆందోళనను విరమించారు. పోలీసుల చొరవ, పెద్ద మనుషుల హామీతో సోమవారం ఆందోళన విరమించి మహేందర్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి చేశారు. మహేందర్‌రెడ్డికి అతడి తమ్ముడి నుంచి రావాల్సిన మూడెకరాల స్థలం తిరిగి ఇప్పించే బాధ్యత గ్రామ పెద్ద మనుషులు తీసుకున్నారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించడంతో మూడు రోజు లుగా అనంతసాగర్ గ్రామంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ సంఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండ ప్రభాకర్‌రెడ్డి అతడి భా ర్య జ్యోతి, పెద్ద మనుషులు బండ రత్నాకర్‌రెడ్డి, రామంచ సాయిలును అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపారు. మరో నిందితుడు సాయి నాథ్‌రెడ్డి అమెరికాలో ఉన్నాడు.

పోలీసుల చొరవ.. పెద్ద మనుషుల హామీతో..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హసన్‌పర్తి మండలం అనంత సాగర్ గ్రామానికి చెందిన బండ మహేందర్‌రెడ్డి, బండ ప్రభాకర్‌రెడ్డిలు ఇద్దరు అన్నదమ్ములు. బండ ప్రభాకర్‌రెడ్డి తన సోదరుడు మహేందర్‌రెడ్డికి చెందిన మూడెకరాల స్థలంలో రెండెకరాలు కుమారుడు సాయినాథ్‌రెడ్డి పేరిట, ఎకరం భార్య జ్యోతి పేరిట ఏడు సంవత్సరాల క్రితం పట్టా చేయించుకున్నాడు. తమ్ముడి చేసిన ద్రోహం గమనించిన మహేందర్‌రెడ్డి తన స్థలం తిరిగి ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. తమ్ముడు స్పందించకపోవడంతో పెద్ద మనుషులను ఆశ్రయించాడు. పెద్ద మనుషుల నుంచి న్యాయం జరుగలేదు. ఏడేళ్లుగా తిరిగి విసిగి పోయిన మహేందర్‌రెడ్డి ఈనెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ 5వ తేదీ రాత్రి మృతి చెందాడు. మహేందర్‌రెడ్డి మృతికి ప్రభాకర్‌రెడ్డి కారణమని ఆరోపిస్తూ శనివారం ఉదయం నుంచి శవంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభాకర్‌రెడ్డి ఇంటి ముందు శవం పెట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు. తమకు రావాల్సిన స్థలం తిరిగి ఇచ్చాకే ఆందోళన విరమిస్తామని మొండికేసి ఆందోళన సాగించారు. ఆదివారం రాత్రి అనంతసాగర్ వచ్చిన కాజీపేట ఏసీపీ తిరుమల్ నూతనంగా ఇద్దరు పెద్ద మనుషులను పెట్టి ఏడు సంవత్సరాలుగా పంచాయతీ చేస్తున్న 12 మందిని పిలిపించాడు. 14మంది సమక్షంలో ప్రభాకర్‌రెడ్డి నుంచి తిరిగి స్థలం ఇప్పించేలా ఒప్పంద పత్రాలు రాయించి మృతుడి కుటుంబ సభ్యులను ఒప్పించాడు. పోలీసుల చొరవ, పెద్ద మనుషుల హామీతో మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం ఆందోళన విరమించారు. మొత్తంగా మూడు రోజులుగా గ్రామంలో శవంతో ఆందోళన చేయడం సంచలనంగా మారింది.

ముగ్గురు మోటార్ల దొంగల అరెస్టు

రూ.3 లక్షల విలువైన 12 మోటార్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మోటార్లు, నిందితులతో పోలీసులు

వరంగల్ క్రైం, జులై 8 : నీటి మోటార్ల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను సీసీఎస్, కేయూ పోలీసులు కలిసి అరెస్టు చేశారు. రూ. 3 లక్షల విలువైన 12 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కాక తీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హనుమకొండ ఏసీ పీ కె.దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మడికొండ ప్రాంతానికి చెందిన పత్తిరాజు, శ్రీపతి ప్రేమ్‌కుమార్, తూరపాటి ఏసుకుమార్ జల్సాలకు అలవాటుపడి నగర పరిసర ప్రాంతాలకు చెం దిన పంటపొలాల్లోని నీటి మోటార్లను చోరీ చేస్తున్నారని తెలిపారు. మోటార్ల చోరీలపై పలు ఫిర్యాదులు అందడంతో విచారణ ప్రారంభించినట్లు ఆయన అన్నారు. సోమవారం ఉదయం కేయూ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నీటి మోటార్లతో ద్విచక్రవాహనంపై వస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఆయన తెలిపారు. విచారణలో ముగ్గురు వ్యక్తులు మోటార్ల చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారని ఆయన పేర్కొన్నారు. ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. విలేకర్ల సమావేశంలో కే యూ సీఐ బి.సంజీవ్, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్‌ఐలు రాజ్‌కుమార్, దేవేందర్, రవిందర్, బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

కేయూ క్యాంపస్, జూలై 8 : కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ గోపు సుధాకర్ తన లైబ్రరీకి చెందిన పుస్తకాలను కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి ఉచితంగా అందచేశారు. ఈ మేరకు సోమవారం కేయూ క్యాంపస్‌లోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావును కలిసి పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో విభాగం ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ ఒడ్డెపల్లి మోహన్ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తప్పుడు ఆరోపణలు తగదు'

కేయూ క్యాంపస్, జూలై 8: కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ పై తప్పుడు ఆరోపణలు తగవని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010లో కాకతీయ యూనివర్సిటీ న్యాయ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేయూ పాలక మండలి సభ్యులు గా ఎంపిక చేసిందన్నారు. అధ్యాపకుల నియమకంపై వివాదం రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని దీన్ని ఆసరాగా చేసుకుని మా నసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

దూరవిద్య ఎంఎస్‌డబ్ల్యూ ఫీజు గడువు 18

కేయూ క్యాంపస్, జూలై 8: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్ సోసల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) 2023-2024 రెండో ఏడాది టర్మ్ ఫీజు, పరీక్షల ఫీజులను ఈనెల 18 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రంలోని ఎస్‌బీఐ కౌంటర్‌లో చెల్లించుకోవాలని పేర్కొన్నారు. త్వరలోనే రెండోవ ఏడాది తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.







నిట్‌తో 'బయోవి' సంస్థ ఒప్పందం



ఎంవోయూలను మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్ సుబుధి, బయోవి ఎండీ లక్ష్మీప్రసాద్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 8 : వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ (నిట్)తో హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయ ఉత్పత్తులను అందించే బయో వి ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం నిట్ క్యాంపస్‌లో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, బయో వి ఎండీ. డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బయోటెక్నాలజీ విభానికి చెందిన ఫ్యాకల్టీతో పాటు విద్యార్థులు పరిశోధన శాలల సౌకర్యాల పరస్పర మార్పిడితో పనిచేయవచ్చునన్నారు. విద్యార్థులు బయోవి లో ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం ఉంటుందని, బయో వి పరిశోధనల్లో నిట్ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాలుపంచుకోనున్నారన్నారు. జపాన్‌కు చెందిన టోక్యో అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు అకినోరి, హిరోకి, మియా సాకి, సింగాపూర్ జీ అండ్ జీ కంపెనీ ఎండీ గౌరీశంకర్ నిట్‌ను సందర్శించారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచాలి

కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జులై 8 : సైబర్ నేరగాళ్ల చేతుల్లో ప్రజలు మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సైబర్ వారియర్లకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో కమిషనరేట్‌కు చెందిన సైబర్ వారియర్స్‌తో సోమవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా నమోదైన సైబర్ నేరాలపై ఆరా తీయడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ వారియర్లు తీసుకుంటున్న చర్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ఆయా స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలకు గురికాకుండా సైబర్ వారియర్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించా లన్నారు. సైబర్ నేరాల్లో నేరస్తులకు సంబంధించిన పీటీ వారెంట్లను పరిష్కరించడంతో పాటు నిలిపేసిన సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాల్లోని డబ్బు తిరిగి బాధితులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ రవి, సైబర్ క్రైం విభాగం ఏసీపీ విజయ్‌కుమార్, వర్టికల్స్ ఇన్‌చార్జ్ ఏసీపీ జనార్ధన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ సీఐ రవి, ఎస్‌ఐలు చరణ్, శివ పాల్గొన్నారు.

న్యాయవాదిపై అనుచితంగా

ప్రవర్తించిన సీఐపై 'బార్' సీరియస్

సీఐని సస్పెండ్ చేయాలని ర్యాలీ, రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జులై 8 : న్యాయవాదిపై అనుచితంగా ప్రవర్తించిన ఇంతేజార్‌గంజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాది మాదాసి వినయ్‌కుమార్‌ను దుర్భాషలాడిన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేశారు. సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 6న సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తున్న న్యాయవాదిని ఆపి కారు తాళం గుంజుకొని అసభ్య పద జాలంతో దూషించారని, న్యాయవాదినని చెప్పినా వినకుండా ఐతేంటీ అంటూ మరింత దుందుడుకుగా వ్యవహరించడంపై బార్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సంఘటనను నిరసిస్తూ ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ సీఐ తీరుపై నిరసన వ్యక్తం చేశాయి. కోర్టు ప్రాంగణం నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా వచ్చి అమర వీరుల స్తూపం మీదుగా కోర్టు గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యుడైన సీఐపై తగిన చర్యలు తీసుకోకుంటే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని న్యాయవాదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముదసర్ అహ్మద్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లాదె రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులు , సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి'



డ్యాకుమెంటరీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జూలై 8 : కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు కళాకారులు తమవంతు కృషి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం రాత్రి నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో బాగా పొద్దుపోయే దాక జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు సీతాల రఘువేందర్ ఆధ్వర్యంలో సీనియర్ కళాకారుల సేవా ట్రస్టును అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డిలు కలిసి ఆవిష్కరించారు. ఇదే వేదికపై రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో రోజా క్రియేషన్స్ 30 వసంతాల వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. క్రైం ఏసీపీ విజయ్‌కుమార్, ప్రముఖ సీఏ త్రిపురనేని గోపీచంద్, డాక్టర్ రావుల జగదీశ్వర్, యాదవరెడ్డి, ఆడెపు రవీందర్, జూనియర్ ఘంటశాల గుజ్జారి రమేశ్ అనేక మంది కళాకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ఈ సందర్భంగా ఓడపల్లి చక్రపాణి, మిమిక్రీ సదాశివ్, రయ్యాల శ్రీధరాచార్యులు, బుల్లి తెర ఫేం ఆర్‌ఎస్.నందా, ఎంఎస్.నవీన్ కుమార్, వంగరి వేణుగోపాల్‌లకు రోజా క్రియేషన్స్ ద్వారా ప్రత్యేక అవార్డులతో సత్కరించారు. కాళేశ్వరం సాయిమనస్వినికి జ్యోతిష్యరత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గుజ్జర్ అజయ్ నిర్మించిన చాక్లెట్స్ డాక్యుమెంటరీని ప్రముఖులు ఆవిష్కరించారు.

వేం నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీలను కలిసిన కేయూ పాలక మండలి సభ్యులు

కేయూ క్యాంపస్, జూలై 8 : ఇటీవల నూతనంగా నియమితులైన కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎలాంటి ఒత్తిళ్ళకు లోనూ కాకుండా సీరియస్‌గా పనిచేయాలని సూచించారు. కేయూ వీసీ నియమాకం కోసం ఏర్పాటు చేసే సెర్చ్ కమిటీకి ఒకరిని నామినేట్ చేయాలని పేర్కొన్నారు. దీని కోసం మళ్ళీ కలవాలని సూచించారు. లా ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ సురేశ్‌లాల్, బొద్దిరెడ్డి రమల బయోడేటాను పూర్తిగా పరిశీలించిన తర్వాతనే మెరిట్ ఆధారంగా నామినేట్‌గా చేశామని స్పష్టం చేశారు.

ప్లేస్‌మెంట్లలోనూ ఎస్సార్ విద్యార్థులు టాప్





యల్లా కృష్ణవేణి

ప్లేస్‌మెంట్ వివరాలను వెల్లడిస్తున్న వీసీ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 8 : ఉత్తమ ఫలితాల్లోనే కాదు విద్యార్థులకు ఉపాధి కల్పించడంలోనూ ఎస్సార్ యూనివర్సిటీ టాప్‌లో నిలుస్తుందని యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ దీపక్ గార్గ్ అన్నారు. సోమవారం అనంతసాగర్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ప్రాంగణ నియామకాలు వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ గార్గ్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ విద్యార్థిని యల్లా కృష్ణవేణికి రూ.34.4లక్షల వార్షిక ఆదాయంతో ఉద్యోగం సాధించిందన్నారు. ఈ ఏడాదిలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో సగటున ఒక్కొక్కరు రూ.5.8లక్షల వార్షిక ఆదాయంతో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సంవత్సరం మొత్తం 896 మంది విద్యార్థులు వేర్వేరు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. యాక్సెంచర్, ఎయిర్‌టెల్, బోస్చ్, క్యాటర్ పిల్లర్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, పేపాల్ తదితర కంపెనీల్లో ఎస్సార్ విద్యార్థులు వివిధ హోదాల్లో ఉద్యోగాలు పొందారన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు సాధించిన ప్రతీ విద్యార్థికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, డీన్ ఫ్యాకల్టీ డాక్టర్ వి. మహేష్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ గురుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదులుగా నలుగురు నియామకం



కె.నర్సింహరావు, ఎస్.మహాత్మా, ఆర్.వాణి, టి.రాజ్‌కుమార్

వరంగల్ లీగల్, జూలై 8 : ప్రభుత్వ న్యాయవాదులుగా నలుగురిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా కె.నర్సింహారావు, ఆర్బిట్రేషన్ కేసుల ప్రత్యేక న్యాయవాదిగా ఎస్. మహాత్మ, ఎల్ఆర్ఏటీ కం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు సహాయక ప్రభుత్వ న్యాయవాదిగా తోట రాజ్‌కుమార్, ఇండస్ట్రియల్ ట్రిబునల్ కం లేబర్ కోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా రావుల వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు తాత్కాలికంగా ఆరు నెలల పాటు విధులు నిర్వహించనున్నారు.

సీఎస్‌సీలపై విస్తృత ప్రచారం జరపాలి

- టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 8: కామన్ సర్వీసు సెంటర్ల(సీఎస్‌సీ)సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి తద్వారా ఆర్థికంగా ప్రయోజనం పొందాలని టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకులో సీఎస్ సెంటర్ల సేవలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, ఆధార్, పాన్‌కార్డు, విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర సేవల వినియోగాన్ని ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ప్రజలకు అందనుండడం హర్షణీయమన్నారు. సమావేశంలో డీసీసీ సీఈవో వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ ఉషశ్రీ, డీజీయం అశోక్, ఉమ్మడి జిల్లాలోని మేనేజర్లు పాల్గొన్నారు.

ఇంటినుంచే వినియోగదారుల గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయొచ్చు

- వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు



బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్ఈ

హనుమకొండ టౌన్, జూలై 8 : వినియోగదారులు ప్రతీ సోమవారం జరిగే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ద్వారానే కాకుండా ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ టీజీఎన్పీడీసీఎల్.కామ్‌లో కన్స్యూమర్ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా ఎప్పుడైనా విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని వరంగల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు తెలిపారు. విద్యుత్ ప్రజావాణిలో భాగంగా సోమవారం బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విద్యుత్ ప్రజావాణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 61 ఫిర్యాదులు రాగా ఇప్పటి వరకు 48 పరిష్కరించడం జరిగిందన్నారు. ఎక్కువగా గృహజ్యోతి, విద్యుత్ పోల్ షిఫ్టింగ్‌పై ఫిర్యాదులు వచ్చాయన్నారు. గృహజ్యోతి లబ్ధిదారులు ఎంపీడీవో, మునిసిపాలిటీ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హుల జాబితా ఎన్పీడీసీఎల్‌కు వస్తుందని, అప్పటి నుంచి జీరో బిల్లు అమలుచేయడం జరుగుతుందన్నారు. హనుమకొండ సర్కిల్‌లో ఇప్పటి వరకు 84 ఫిర్యాదులు రాగా 75 పరిష్కరించడం జరిగిందని ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. సోమవారం కొత్తగా 5 ఫిర్యాదులు రాగా అప్పటికప్పుడు ఒక ఫిర్యాదును పరిష్కరించడం జరిగిందన్నారు.

భవనం పైనుంచి పడి యువతి మృతి



యువతి మృతదేహం

బాలసముద్రం, జూలై 8 : హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో భవనం పై నుంచి పడి ఓ యువతి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. సుబేదారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలఘాట్ జిల్లా పారసొని గ్రామానికిచెందిన బీమలతవాసినిక్, సురేందర్ దంపతులు జీవనోపాధి కోసం వారం రోజుల క్రితం హనుమకొండకు వచ్చారు. వీరికి కూతురు సుహానవాసినిక్, కొడుకు అన్మోల్ వాసినిక్ ఉన్నారు. సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్ ద్వారా హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో భవన నిర్మాణం పనులు చేస్తున్నారు. ఐదో అంతస్థులో పనులు చేస్తుండగా సుహానవాసినిక్ ప్రమాదశావత్తు ఫైర్ సెఫ్టీహోల్‌లో పడడంతో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గాలిబ్ తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంజీఎంను తనిఖీ చేసిన ఆర్డీవో



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో కృష్ణవేణి

వరంగల్ మెడికల్, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణపై ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.సోమవారం కలెక్టర్ ఎంజీఎంను తనిఖీ చేస్తుందనే ఆందోళనలో ఎంజీఎం అధికారులు కార్యాలయాల్లోనే ఉన్నారు. ఓపీలకు పరుగులు తీశారు. ఉదయం 9గంటలకే ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎంఓలు మురళి, శ్రీనివాస్ ఆస్పత్రి కి చేరుకొని ఓపీ విభాగాలను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వైద్యులు కూడా సకాలంలో విధులకు హాజరయ్యారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ కృష్ణవేణి ఎంజీఎంను సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డులను పరిశీలించారు. రోగులు చికిత్స పొందే క్యాజువాలిటీని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్పత్రిని సందర్శించిన అనంతరం అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

అదిగో.. ఇదిగో..

- మినీ లెదర్ పార్కు కోసం 22ఏళ్లుగా ఎదురుచూపులే
- కడియమే తెచ్చారు.. కడియమే పూర్తి చేస్తారంటూ చర్మకారుల ఆశలు
- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరిపైనే ఆశలు పెట్టుకున్న వైనం
- పరిశ్రమ పూర్తయితే 5వేల మందికి ఉపాధి
- 25ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిన అప్పటి ప్రభుత్వం
- 2002లో అంకురార్పణ చేసిన కడియం.. 2003లో శిక్షణ



ధ్వంసమైన లెదర్‌పార్కు భవనంపై కప్పు



యంత్రాలు పాడవకుండా కప్పిన టార్పాలిన్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 8 : చర్మంతో వస్తువులను తయరు చేసి ఉపాధి పొందే దళిత కుటుంబాల అభ్యున్నతి కోసం ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేయతలపెట్టిన మినీ లెదర్ పార్కు కార్యరూపం దాల్చడం లేదు. అదిగో వస్తోంది.. ఇదిగో వస్తోంది అంటూ చర్మకార కుటుంబాలు 22ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం హైదరాబాద్‌లోని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (లిడ్‌క్యాప్)ను మూసి వేయడంపై అధ్యయనం చేసింది. ఆ అధ్యయనంలో భాగంగా అప్పటి డీఐజీ, ప్రస్తుత ఏపీలోని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ లెదర్ పరిశ్రమల అవసరతపై అధ్యయనం పూర్తి చేసి 2002లో నాటి టీడీపీ ప్రభుత్వానికి నివేదిక అందించారు. పరిశ్రమలను మూసివేస్తే చర్మ వృత్తులను ఆధారంగా చేసుకొని జీవిస్తున్న దళితులు ఇబ్బందులు పడతారని రాష్ట్రంలో వీలైనన్ని పరిశ్రమలను పెంచాలని ఆ నివేదికలో కోరారు. దాంతో ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా కాకుండా మిగతా జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలను బట్టి లెదర్ ఇండస్ట్రీస్‌ను, మినీ లెదర్ పార్కులను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 2002 చివరలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లో లెదర్‌పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలను గుర్తించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో మినీ లెదర్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

2003లో మినీ లెదర్ పార్కుకు శంకుస్థాపన

ఘన్‌పూర్ శివారులోని సర్వే నెంబర్ 502/2, 503/2 లలోని 25 ఎకరాల స్థలంలో మినీ లెదర్‌పార్కు ఏర్పాటుకు 2003లో అప్పటి రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ప్రస్తుత స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ముందుగా స్థలంలో రూ.10 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించి కుట్టుమిషన్లు, బఫ్పింగ్, స్కైవింగ్, హీట్ మిషన్లు ఏర్పాటు చేశారు. అనంతరం డీటీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటికే పరిశ్రమలో పనులు ప్రారంభమైనప్పటికి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కార్యచరణకు నోచుకోలేదు.

25ఎకరాల స్థలం ఎందుకంటే..

లెదర్‌పార్కు ఏర్పాటు కోసం ఘన్‌పూర్ శివారులో 25ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. లెదర్ పరిశ్రమలో 2000మంది కార్మికులు ప్రత్యక్షంగా, మరో 2000 మంది పరోక్షంగా ఉపాధి పొందే లక్ష్యంతో నిర్మాణ పనులు చేబట్టారు. ప్రత్యక్షంగా పనిచేసే కార్మికులకు సదరు స్థలంలో గృహల ఏర్పాటు చేయడం, పాఠశాలను, అనుపత్రిని, పోస్టాఫీసును, ఆట స్థలాన్ని ఏర్పాటు చేయడానికిగాను స్థలాన్ని కేటాయించారు.

శిక్షణకు వెళ్లారు..

లెదర్ పార్కులో చర్మవస్తువులు తయారీలో శిక్షణ పొందడానికిగాను నియోజకవర్గంలోని చిలుపూర్, ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాలకు చెందిన 33 మంది చర్మకారుల్లో 16మంది చెన్నైకి, 8మంది గోవాకు, 9మంది హైదరాబాద్‌లలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ సంస్థలో ఆరు వారాల పాటు లెదర్‌బూట్లు, చెప్పులు, కోట్లు, చేతి సంచులు, బెల్టులు, బ్యాగులు, పర్సులు తదితర వస్తువులు రూపొందించడంపై శిక్షణ పొందారు. శిక్షణ పొందిన వారు నియోజకవర్గంలోని మిగతా చర్మకారులకు శిక్షణనిచ్చారు. మొత్తంగా 2వేల మంది కార్మికులు శిక్షణ పొంది సిద్ధంగా ఉన్నారు. పరిశ్రమ పూర్తయితే ప్రత్యక్షంగా 2వేల మందికి పరోక్షంగా 3వేల మందికి మొత్తం సుమారు 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



లెదర్ పరిశ్రమ కోసం నిర్మించిన భవనం చుట్టూరా పెరిగిన చెట్లు

ప్రత్యేక రాష్ట్రంలోనైనా వస్తుందని ఆశపడ్డారు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత 2016 డిసెంబరులో అసెంబ్లీ సమావేశాల్లో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఘన్‌పూర్‌లో 270.10 కోట్లతో, సర్వే నెంబరు 502, 503ల లోని 170 ఎకరాల ప్రభుత్వ భూమిలో మెగా లెదర్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాధనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని తెలిపారు. అదిశగా గత ప్రభుత్వం కార్యచరణ చేబట్టకపోవడంతో అది సాధ్యం కాలేదు.

కడియంపైనే ఆశలు

22 ఏళ్ల క్రితం నియోజకవర్గంలోని చర్మకారులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో లెదర్‌పార్కు ఏర్పాటుకు అంకురార్పణ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొంది అధికార పార్టీలో ఉండడంతో పాటు కడియం కుమార్తె కావ్య ఎంపీగా గెలుపొందడంతో ఏలాగైన లెదర్‌పార్కును కడియం కుటుంబం తీసుకువస్తుందని 22ఏళ్ల నిరీక్షణకు తెరపడుతుందని చర్మకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాడు కడియం తీసుకువచ్చారు.. నేడు ఆయనే పూర్తి చేస్తారని చర్మకారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

22ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..

గాదె శ్రీధర్, చర్మకారుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు



లెదర్ పార్కు ఏర్పాటు జరిగితే శిక్షణ పొందినందున ఉపాధి లభిస్తుందని 22ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. పరిశ్రమ ఏర్పాటు జరిగితే నియోజకవర్గ దళితుల్లో పేదరికం కొంతమేర పోయ్యే అవకాశం ఉంటుంది. పాలకులు పరిశ్రమలపై దృష్టి పెటాల్సిన బాధ్యత వారికి ఉండాలి.

చెన్నైలో శిక్షణ తీసుకున్నాం..

ఈశ్వరయ్య, చర్మకారుడు, ఛాగల్ గ్రామం



లెదర్ పార్కు ప్రారంభిస్తారని అప్పటి ప్రభుత్వం 2003లో చెన్నైలో శిక్షణనిచ్చారు. చర్మ సంబంధ ఉత్పత్తుల తయారీపై మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ తీసుకుకొని అనంతరం ఇక్కడి యువకులకు మేం శిక్షణ అందించాం. అనేక ఏళ్లుగా పరిశ్రమ కోసం ఎదురు చూస్తున్నాం. ఈ ప్రభుతకవమైనా స్పందించి పరిశ్రమను నెలకొల్పాలి.

కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తారనుకుంటున్నాం..

గాదె కుమార్, చర్మకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి, ఎంపీగా కడియం కావ్య ఉన్నందున సమస్యలను పరిష్కరించి.. లెదర్ పరిశ్రమ ఏర్పాటు కలను సాకారం చేస్తారన్న ఆశ కలుగుతోందన్నారు. 22ఏళ్ల క్రితం పరిశ్రమ ఏర్పాటుకు అంకురార్పణ చేసిన కడియమే.. దీనిని పూర్తి చేసి చర్మకారుల కుటుంబాల్లో వెలుగులు నింపుతారని భావిస్తున్నాం.

నగర అభివృద్ధే నా ధ్యేయం

- 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి
- బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన నేతలు, అధికారులు



కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 : వరంగల్‌ను ఆదర్శ నగరంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల్లో పలువురు నేతలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో.. సోమవారం సాయంత్రం ఆయన వరంగల్‌లోని కుడా కార్యాలయంలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయనకు ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్, కుడా వైస్ ఛైర్మన్ అశ్విని తానాజీ వాకడే, కిసాన్ మోర్చా సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట నర్సింహరెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన సోనియా, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తానని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఔటర్‌రింగ్ రోడ్డుతో పాటు విమానాశ్రయం, ప్రధాన రోడ్డు పూర్తి చేయడమే ప్రధాన అంశంగా స్వీకరిస్తామన్నారు.

మార్చి 15న కుడా ఛైర్మన్‌గా ప్రకటన

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ యేడు మార్చి 15న రాష్ట్రంలోని పలు శాఖలకు నామినేటెడ్ పోస్టులను కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఈ క్రమంలో వరంగల్ కుడా ఛైర్మెన్‌గా ఇనుగాల వెంకట్రామ్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మర్నాడు 16న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కోడ్‌అమలులోకి వచ్చింది. దీంతో ఛైర్మెన్ పదవి ప్రకటించినా బాధ్యతల స్వీకరణకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారింది. కాగా, సోమవారం మధ్యాహ్నం 35 మంది ఛైర్మెన్‌లను రాష్ట్ర వ్యాప్తంగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని జీవో జారీ చేయడంతో పరిస్థితులు తాముమారు అవుతుండడంతో కొందరు హడావిడిగా ప్రకటించిన రోజే బాధ్యతలు స్వీకరించినట్టు ప్రచారం జరుగుంది.

బయోడెటా

పేరు: ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి
తల్లిదండ్రులు : ఇనుగాల అమరేందర్‌రెడ్డి, సుజితారెడ్డి
విద్యార్హతలు: పీజీ డిప్లమా ఇన్ కంప్యూటర్ సైన్స్
పుట్టిన తేదీ: 6-9-1968
స్వగ్రామం : ఆత్మకూరు మండల కేంద్రం, హనుమకొండ జిల్లా
భార్య: అవంతిరెడ్డి
కుమార్తె: శ్రీలలితారెడ్డి
రాజకీయ ప్రస్థానం : 2013లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2016లో సింగిల్‌విండో ఛైర్మెన్‌గా ఎన్నికయ్యారు. 2014లో పరకాల శాసనసభకు ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప మెజారిటీలో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం పీసీసీ మెంబర్, తెలంగాణ నార్తర్న్ జిల్లా కో ఆర్డినేటర్‌గా, కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు.

జల్సాలకు మరిగి.. చోరీల బాట ఎంచుకుని

- తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు
- వారిలో ఒకరు బాల నేరస్థుడు
- రూ.12లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

సరూర్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి సులువుగా సొమ్ము సంపాదించడం కోసం ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను సోమవారం మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకడు మైనర్(బాల నేరస్తుడు) కావడం గమనార్హం! దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీర్‌పేట్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి వెల్లడించారు. జనగామ జిల్లా, రఘునాథ్‌పల్లి మండలం బానాజీపేట్‌కు చెందిన వల్లెపు జితేందర్ అలియాస్ జిత్తు(20) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలంలోని పీర్జాదిగూడలో నివసిస్తూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లాలోని బీటీనగర్‌కు చెందిన రాపోల్ చందు అలియాస్ కృష్ణ(21) ఉప్పల్‌లో ఉంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. వరంగల్ జిల్లా గూడూరుకు చెందిన రాపోల్ శ్రీశైలం అలియాస్ చిన్నా(34) ఉప్పల్‌లోని బీరప్పగడ్డలో నివసిస్తూ లేబర్ పని చేస్తున్నాడు. వీరు ముగ్గురితో పాటు మరో బాల నేరస్తుడు కలిసి జట్టుగా ఏర్పడి రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి సొత్తు చోరీ చేయడం ప్రవృత్తిగా పెట్టుకున్నారు. జిత్తు, కృష్ణ, బాల నేరస్తుడిపై వనస్థలిపురం, మీర్‌పేట్, మేడిపల్లి పీఎస్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. వారంతా పలుమార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. సదరు ముగ్గురు జైలు నుంచి(బాల నేరస్తుడు అబ్జర్వేషన్ హోమ్ నుంచి) బయటకు వచ్చిన తర్వాత రాపోల్ శ్రీశైలంను పరిచయం చేసుకుని మళ్లీ చోరీలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఇటీవల బడంగ్‌పేట్ మారుతీనగర్‌కు చెందిన రమేశ్ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మీర్‌పేట్ పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు జరిపి నలుగురు నిందితులను సోమవారం హయత్‌నగర్ ప్రాంతంలో అరెస్టు చేశారు. వారి నుంచి 125 గ్రాముల బంగారు నగలు, 450 గ్రాముల వెండి వస్తువులు, ఒక ద్విచక్ర వాహనం, ఒక ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.12లక్షలు ఉంటుందని ఏసీపీ కాశిరెడ్డి చెప్పారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు.

భూ తగాదాలో మాజీ సర్పంచ్ దారుణ హత్య!

- ఇంట్లో నిద్రిస్తుండగా పెద్ద సుత్తెతో దాడి చేసి ఘాతుకం
- పరారీలో నిందితులు
- వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాహన్‌పల్లిలో ఘటన





రక్తపు మడుగులో సూదుల దేవేందర్, దేవేందర్ నివాసం వద్ద గుమిగూడిన జనం

రాయపర్తి, జూలై 8: భూ తగాదా విషయంలో తాజా మాజీ సర్పంచ్ హత్యకు గురైన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాహన్‌పల్లిలో జరిగింది. ఓ స్థలం విషయంలో హతుడు, నిందితుల మధ్య ఆరేళ్లుగా వివాదం జరుగుతుండగా.. అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మాజీ సర్పంచ్‌పై పెద్ద సుత్తెతో దాడి చేసి హతమార్చడం తీవ్ర కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాహన్‌పల్లికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్(56)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అమెరికాలో ఉంటుండగా, ఆమెకు ప్రసవ సమయం కావడంతో సాయంగా ఉండేందుకు దేవేందర్ భార్య ఉమ ఐదునెలల క్రితం అమెరికా వెళ్లింది. కుమారుడు ఉద్యోగ రీత్యా, వివాహమైన చిన్న కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. దాంతో ప్రస్తుతం దేవేందర్ ఒక్కరే ఇంటివద్ద ఉంటున్నారు. ఆయనకు హనుమకొండలోని యాదవనగర్‌లో కూడా ఓ ఇల్లు ఉండగా అక్కడకు తరచూ వెళ్లివచ్చేవారు. ఇదిలాఉండగా గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో దేవేందర్ సర్పంచ్‌గా గెలుపొందారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన పల్లె మల్లేష్ అనే వ్యక్తికి దేవేందర్‌కు మధ్య ఆరేళ్లుగా భూ తగాదాలున్నాయి. ఈ విషయంలో పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఆదివారం దేవేందర్ ఇంట్లో ఒక్కరే ఉండగా.. అప్పటికే భూ తగాదా కోపం పెంచుకుని కసి మీదున్న దుండగులు ఇదే అదనుగా దేవేందర్‌ను హతమార్చినట్టు తెలుస్తోంది. దేవేందర్ నిద్రించిన తర్వాత ఇంట్లోకి చొరబడి భారీ సుత్తితో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి చనిపోయాడని నిర్ధారించుకున్నాక సుత్తెను బాత్రూంలో ఉండే నీటి బకెట్‌లో వేసి, గోడదూకి పరారయ్యారు. సోమవారం ఉదయం పనిమనిషి బాల యాకమ్మ తలుపు తీసి చూసే సరికి దేవేందర్ నెత్తుటి మడుగులో కనిపించడంతో గ్రామస్థులకు విషయం చెప్పింది. భూ తగాదా కారణంగానే తన తండ్రిని పల్లె మల్లేష్, అతడి కుమారుడు పల్లె మురళీ హత్య చేసినట్టు దేవేందర్ కుమారుడు నిఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ వివాదం..

రాయపర్తి మండలంలోని కొండూరుకు చెందిన ప్రకాష్.. బురాహన్‌పెల్లి శివారులోఉన్న మూడెకరాల భూమిని ఆరేళ్ల క్రితం దేవేందర్‌కు అమ్మాలని నిర్ణయించుకుని దేవేందర్ నుంచి రూ.4లక్షలు బయానా తీసుకున్నాడు. కానీ దేవేందర్ మిగతా డబ్బులు ఇవ్వకపోవడం, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోకపోవడంతో ప్రకాష్ సదరు స్థలాన్ని అదేగ్రామానికి చెందిన పల్లె మల్లేష్‌కు విక్రయించాడు. విషయం తెలుసుకున్న దేవేందర్ తాను బయానాగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రకాష్, పల్లె మల్లేష్‌లపై రాయపర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పెద్ద మనుషుల మధ్యలో పంచాయతీ చేయగా.. పెద్ద మనుషులు చేసిన తీర్మా నాన్ని దేవేందర్ అంగీకరించలేదు. అప్పటి నుంచి దేవేం దర్, పల్లె మల్లేష్ మధ్య ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.

గతంలో మల్లేష్‌పై హత్యాయత్నం

రెండేళ్ల క్రితం పల్లె మల్లేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటడిన మల్లేష్.త నపై జరిగిన దాడి వెనక దేవేందర్ హస్తం ఉందని భావించి ఆయనపై కోపం పెంచుకున్నాడని, ఈ రెండేళ్ల నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరినట్టు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే దేవేందర్‌ను హతమార్చినట్టు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

నిందితుడి ఇంటి వద్దకు జాగిలాలు..

హత్య జరిగిన ఘటనా స్థలం వద్ద పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. దేవేందర్‌ఇంటిని పూర్తి స్థాయిలో జాగిలాలతో క్షుణ్ణంగా పరిశీలించి.. నిందితులను గుర్తించేందుకు గ్రామంలో గాలింపు చర్యలు చేపడుతుండగా ఆ జాగిలాలు పల్లె మల్లేష్ ఇంటి వద్దే నిలిచిపోయాయి. దీంతో పోలీసులు హత్య చేసిన నిందితులపై ప్రాథమికంగా ఓ నిర్ధారణకు వచ్చారు. సంఘటన స్థలాన్ని సైతం వెస్ట్‌జోన్ డీసీపీ మహేందర్ నాయక్ చేరుకుని పరిశీలించారు. వర్ధన్నపేట సీఐ సూర్య ప్రకాష్, రాయపర్తి ఎస్ఐ సందీప్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వర్ధన్నపేట, జఫర్‌ఘడ్ ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, రవిలు వారి సిబ్బంది బందోబస్తు చేశారు. అనంతరం దేవేందర్ మృతదేహాన్ని పోసుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

దేవేందర్ మృతదేహాన్ని చూసి గుండెపోటుతో వృద్ధుడి మృతి



కొమురయ్య (ఫైల్)

రాయపర్తి, జూలై 8 : గుండెపోటుతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బురాహన్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... బురాహన్‌పెల్లి గ్రామానికి చెందిన బాలే కొమురయ్య(70) మధ్యాహ్నం గ్రామంలో మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ మృతదేహాన్ని దగ్గరి నుంచి చూసి చలించిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న దేవేందర్ మృతదేహాన్ని, ఆయన తలకు తగిలి న గాయాన్ని చూసి భయాందోళనకు గురయ్యాడు. ఇంటికి వెళ్లిన తర్వాత అస్వస్థతకు గురై గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

'బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ, 5జీ సేవలను వెంటనే అందించాలి'

వడ్డెపల్లి, జూలై 8: బీఎస్ఎన్ఎల్ 4జీ, 5జీ సేవలను వెంటనే అందించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కంపెనీ జనరల్ సెక్రటరీ జె. సంపత్‌రావు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ వరంగల్ జిల్లా సెక్రటరి బుర్ర శ్రీనివాస్ గౌడ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిలయన్స్ జియో ఎయిర్‌టెల్ కంపెనీలు తమ టారీఫ్ పెంపుదలతో సామాన్య ప్రజల నడ్డి విరగనుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని పేర్కొన్నారు.

సామాన్య ప్రజల కోసం తక్కువ ధరలతో చౌకగా ఉండేలా బీఎస్ఎన్ఎల్ సంస్థకు 4జీ, 5జీ సేవలను వెంటనే ప్రారంభించేలా కేంద్ర ప్రభుత్వం చూడాలని కోరారు. ఈ సమావేశంలో బీఎస్ఎన్ఎల్ యూనియన్ నేతలు సంజీవ్, సంపత్, బషీర్ అహ్మద్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశాలకు క్రీడాకారుల ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, జూలై 8 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్)ఆధ్వర్యంలో రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలలోని స్పోర్ట్స్ హాస్టల్ 4వ తరగతిలో ప్రవేశాలకై జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జి డీవైఎస్‌వో నయీం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపి కైన జి. శ్రేయన్‌శివ, ఎం. నవనీత్, జె. రిషివర్ధన్, ఒ. దివాన్ష్, టి. అనూప్‌కుమార్, పి. అశ్లేష్, అయాన్‌కుమార్, కె. అనుశ్వేచ్ఛలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారని నయీం వెల్లడిం చారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మంగళవారం హైదరాబాద్ లోని హకీంపేట స్పోర్ట్స్ హాస్టల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు లోపు రిపోర్టు చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జులై 8 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ, శ్రీనగర్ కాలనీ, పోచమ్మకుంట, కమ్మరివాడ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని మడికొండ, రొట్టెబండ, టెక్ మహీంద్ర, తెలంగాణ పేపర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ పేర్కొన్నారు.

ముంపునకు గురికాకుండా చూడాలి

నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 8: నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని 13, 22 డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యాంకుకాలనీ, డాక్టర్స్‌కాలనీ, సీకేఎం కళాశాల మెయిన్‌రోడ్డు, లక్ష్మీనగర్, మర్రి వెంకటాద్రి కాలనీలలో ముంపునకు గురయ్యే ప్రాంతాలతో పాటు చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. గతంలో చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంతంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, గత సమస్య పునారావృత్తం కాకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బస్వరాజు కుమారస్వామి, సురేష్‌జోషిలతో పాటు బల్దియా ఏఈ సతీష్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో యాచకుడి మృతి



కాజీపేట, జూలై 8 : కాజీపేట రైల్వే స్టేషన్‌లో సోమవారం అనారోగ్యంతో ఓ యాచకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం ఒకటిలో అనారోగ్యంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయస్సు, ఎరుపు రంగు ఛాయ, పొడవైన ముఖం, నలుపు గడ్డం కలిగి ఉండి కాఫీ కలర్ ఫ్యాంట్, బ్లూ కలర్ చిన్న చుక్కల హాఫ్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై ఎస్. జ్యోతి అనే టాటు ఉంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లోని మెబైల్ నంబర్ 99498 59108 కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

క్రికెట్ కిట్టు పంపిణీ

ఐనవోలు, జులై 8: వనమాల కనపర్తి గ్రామ యువజన సంఘంనకు టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదేశానుసారం క్రికెట్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజ మాజీ సర్పంచ్ పొలేపాక స్వర్ణరవి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మనుపాటి రాజు, మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, ఐనవోలు మండల కాంగ్రెస్ అధికారప్రతినిధి కొత్తూరు సునీల్, ఐనవోలు గ్రామ అధ్యక్షుడు బరిగెల భాస్కర్, సొసైటీ మాజీ డైరక్టర్ బొల్లేపల్లి పరమేష్‌గౌడ్, అనుముల రవిందర్, బరిగెల భరత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై జవాబుదారీతనం అవసరం

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియా గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, జూలై 8 : గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులకు జవాబుదారితనం అవసరమని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను పిలిచి మాట్లాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం జరిగిన గ్రీవెన్స్‌లో 72 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్ పలాస, టీపీఆర్‌వో కోశ రాజేశ్‌కుమార్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 20, హెల్త్ అండ్ శానిటేషన్ - 04, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 10 టౌన్‌ప్లానింగ్ - 38 ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు.

● దేశంలో కొందరు రాజకీయ నాయకులు దేశాన్ని అమ్ముతున్నారని, దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత దేశ ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఉందని అగ్రోస్ మాజీ చైర్మెన్ లింగంపల్లి కిషన్‌రావు కమిషనర్‌తో అన్నారు. బల్దియాలో అవినీతి అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసు, రెవెన్యూ శాఖల్లో అవినీతికి పాల్పడిన అధికారులను గుర్తించి వేటు వేస్తుంటే కుడా, బల్దియాలో కొందరు అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మేడం నగరంలో ఇంటి అనుమతి ఇచ్చే ముందుకు ప్రతీ ఇంట్లో ఐదు మొక్కలు నాటాలనే ఆంక్షలతో ఇంటి అనుమతులు ఇవ్వాలని విన్నవించారు.



కమిషనర్‌కు వినతులు సమర్పిస్తున్న ప్రజలు

● హనుమకొండ గోపాల్ పూర్‌లో సందీప్‌రెడ్డి అనే వ్యక్తి రోడ్డును ధ్వంసం చేసి అక్రమక ట్టడాలు నిర్మిస్తున్నాడు. డబ్బు, పలుకుబడితో అక్రమ నిర్మానాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

● గ్రేటర్ 31వ డివిజన్‌లోని ఠాకూర్ కాలనీ అవంతి స్కూల్ ప్రాంతంలో 150 ఇండ్లకు నీటి సౌకర్యం లేదని స్థానిక ప్రజలు కమి షనర్‌కు విన్నవించారు.

● గ్రేటర్ 64వ డివిజన్‌లో 20 సంవత్సరాలుగా వందకు పైగా కుటుంబాలు జీవిస్తున్నాము, ఇప్పటి వరకు ఏలాంటి అభివృద్ది జరగలేదని వెస్ట్‌సిటీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఫిర్యాదు చేశారు.

● గ్రేటర్ 56వ డివిజన్‌లోని టీఎన్‌జీవోస్ కాలనీలో 5 నూతనంగా నిర్మించుకున్న ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలని కమిటీ ఫిర్యాదు చేశారు.

సెల్‌ఫోన్లలో నిమగ్నమైన అధికారులు..

ప్రతీ సోమవారం నగరంలోని ప్రజలు పుట్టెడు ఆశలతో సమస్యలు చెప్పుకునేందుకు బల్దియా కార్యాలయానికి వస్తుంటారు. కానీ వేదికపై, వేదిక ఎదురుగా కొందరు అధికారులు సెల్‌ఫోన్ జపం చేస్తున్నారు. ఎవరి సమస్య తమకేంటని నిర్లక్ష్యంగా కూర్చోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కాగా, వేదిక ముందు ఉన్న అధికారులు కూడా వందలో 80 శాతం మంది వివిధ విభాగాల అధికారులు సెల్‌ఫోన్ మాట్లాడడం, సెల్ ఫోన్ చూస్తూ సమయాన్ని గడిపేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ఓ అధికారి ఏకంగా ప్రజావాణి ముగిసే వరకు వీడియో గేమ్స్ ఆడుతూనే కనిపించింది.



ప్రజావాణిలో సెల్‌ఫోన్ చూసుకుంటున్న అధికారులు

'డయేరియా క్యాంపెయిన్' పకడ్బందీగా నిర్వహించాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 8 : ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో డయేరియా ప్రబలకుండా స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం డయోరియా క్యాంపెయిన్ వాల్‌పోస్టర్లను కలెక్టర్, సంబంధిత అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో డయేరియా నియంత్రణపై ఆగస్టు 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య, విద్యా, సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి పురపాలక సంఘాలు, నీటిపారుదల శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటిని సందర్శించి ఐదేళ్లలోపు పిల్లల వివరాలు సేకరించాలని, నీటి విరేచనాల సమస్య ఉన్నట్లయితే ఓఆర్ఎస్ ద్రావణం, వయసు వారిగా జింక్ మాత్రలు, చికిత్స అందించాలన్నారు. వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు భోజనం చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలని, అతిసారా రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, సీపీవో సత్యనారాయణ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, పరకాల ఆర్‌డీవో నారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి

పీఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల నిరసన, కలెక్టర్‌కు వినతి



జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీరాజ్ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు

హనుమకొండ సిటీ, జూలై 8 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ రాజ్ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు నిరసన తెలిపారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నేరేళ్ల విజయ్‌కుమార్ మాట్లాడారు. 30 ఏళ్లుగా పీఆర్ శాఖలోని నాల్గవ తరగతి ఉద్యోగులకు పదోన్నతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతల ఆధారంగా వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి పదోన్నతులు ఇవ్వాలన్నారు. పార్ట్ టైమ్ స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని, 317 జీవో రద్దు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలనే తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి రవి, రామక్రిష్ణ, రాజమౌళి, సరిత తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో అజర హాస్పిటల్ బ్రాంచ్

ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



అజర హాస్పిటల్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 8 : అజర హాస్పిటల్ బ్రాచ్‌ను నర్సం పేట పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అజర స్పెషాలిటీ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనతరం అజర హాస్పిటల్ ఎండి.డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం మాట్లాడుతూ నర్సంపేట ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఈ బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.రాజరామ్, డాక్టర్ వి.ఎం.జయుడు, రాజేందర్, రామానంద్, కాంగ్రెస్ పార్టీ సభ్యుడు పాలాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ విద్యార్థులకు 'భోజనం' అందించాలి

హనుమకొండ చౌరస్తా, జూలై 8 : ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ అశోక జంక్షన్‌లో జూనియర్ కాలేజీల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా, నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్ పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో పీసీసీగా ఉన్న సమయంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే విద్యార్థులను పట్టించుకోక పోవడం చాలా బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే అధికారంలోకి వచ్చాక విద్యార్థులను, నిరుద్యోగ యువతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించే విధంగా కార్యాచరణ చేపట్టాలని, లేదంటే ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేష్, ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, సభ్యులు కిరణ్, వెంకటేష్, సురేష్, రవి, నవ్య, ప్రవళిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ వీరంగం

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

హనుమకొండ టౌన్, జులై 8 : మాజీ కార్పొరేటర్ కానుగంటి శేఖర్ ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ములుగురోడ్డు సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ములుగురోడ్డు నుంచి మాజీ కార్పొరేటర్ కానుగంటి శేఖర్ రాపిడో బుక్ చేసుకోగా.. ఖిలా వరంగల్‌కు చెందిర రాపిడో బాయ్ సిద్దంశెట్టి కృష్ణంరాజు లోకేషన్‌కు వచ్చాడు. దాదాపు 15 నిమిషాలు వేచిచూసిన మాజీ కార్పొరేటర్ శేఖర్ లోకేషన్ ప్రాంతం నుంచి బయలుదేరడానికి సిద్ధం కాకపోవడంతో రైడ్ క్యాన్సిల్ చేసుకోవాలని ర్యాపిడో బాయ్ అనడంతో కానుగంటి శేఖర్ నానా దుర్భషలాడుతూ చేయి చేసుకోవడం జరిగింది. శేఖర్ స్నేహితుడు రమణాచారి సైతం బాధితుడిపై కర్రతో దాడి చేయడంతో తలకు, కంటికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, కానుగంటి శేఖర్‌పై ఇప్పటికే హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉండగా, అనిశెట్టి మురళి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు.

'ఎంజేపీ గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 8 : జిల్లాలోని ఎంజేపీ గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి. ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఎంజేపీ హాస్టళ్లలో కనీస వసతులు కరువై అధ్వాన్న స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భవనాల్లో అరకొర వసతుల్లోనే విద్యార్థులు చదువకుంటున్నారన్నారు. ఎంజేపీ హాస్టళ్లలో ఉన్న అసౌకర్యాలను ఆర్‌సీవో దృష్టికి తీసుకెళదామంటే ఆయన అసలు అందుబాటులోనే ఉండటం లేదని ఆరోపించారు. సొంత భవనాలు నిర్మించి అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జశ్వంత్, గణేష్, సాయివంశి, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కడియం జన్మదినోత్సవం



మల్లికాంబ మనో వికాస కేంద్రం, అతిథి అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, జూలై 8 : మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం తన జన్మదిన వేడుకలను మానసిక వికలాంగ, అనాథ ఆశ్రమం పిల్లలతో కలిసి జరిపారు. హనుమకొండ కనకదుర్గా కాలనీలోని శ్రీహరి నివాసంలో వేడుకలు జరిగాయి. మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక వికలాంగ పిల్లలు, అతిథి అనాథ ఆశ్రమంలోని పిల్లలు శ్రీహరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. పిల్లలతో కలిసి శ్రీహరి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టరు కడియం కావ్య పాల్గొన్నారు.

● ధర్మసాగర్ : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపం నుంచి తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుస్మిత గార్డెన్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలేరు మండల కేంద్రంలో కడియం జన్మదినాన్ని పురస్కరించుకొని రఘునాయకుల ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కరుణాపురంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘల ఇర్మియా ఆధ్వర్యంలో కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్‌లో నర్సింహారెడ్డి, రమేష్, మహేందర్, వెంకటరెడ్డి, కునూర్ రాజు, గొట్టం రవయ్య, దుర్గయ్య, లక్ష్మి, వేలేరు మండల ఇన్‌చార్జి మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, సమ్మిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు,బిల్లా యాదగిరి, రామ్‌గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడియంను కలిసిన టెస్కాబ్ చైర్మన్

ఐనవోలు, జులై 8: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదినం సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు జోజిరెడ్డి, వాకటి చందర్‌రెడ్డి, సముద్రా మధు తదితరులు ఉన్నారు.

టెస్కాబ్ చైర్మన్ పరామర్శ

ఐనవోలుకు చెందిన గద్దం రాజుగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయనవెంట మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, నాయకులు మునిగాల సంపత్‌కుమార్, బుర్ర రాజశేఖర్, పరమేష్‌గౌడ్, శ్రీను, భాస్కర్ తదితరులు ఉన్నారు.

పెయింటర్స్ కమిటీ ఎన్నిక

ఐనవోలు, జులై 8: కొండపర్తి గ్రామ పెయింటర్స్(పెయింటింగ్) సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కూరి రాజు, ఉపాధ్యక్షుడిగా బొక్కల సారయ్య, ప్రధాన కార్యదర్శిగా గద్దల ప్రభాకర్, కార్యదర్శిగా గద్దల రాజ్‌కుమార్, కోశాధికారిగా నాగారపు స్వామి, కార్యవర్గ సభ్యులుగా నేతాజీ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గద్దల సత్యం, గౌరవ సలహాదారు మచ్చిక రమేష్, మాజీ అధ్యక్షుడు కట్కూరి రహీం, కట్కూరి చంద్రమౌళిలు పాల్గొన్నారు.



ఎన్నికైన పెయింటర్స్ కమిటీ

సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ఆర్

హనుమకొండ సిటీ, జూలై 8 : మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం సోమవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జరిగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా తదితర కాంగ్రెస్ నాయకులు వైయస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్నతో పాటు డాక్టర్ రామక్రిష్ణ, రంగనాథ్, ఖుర్షీద్, తౌటం రవీందర్, బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కాజీపేట : కాజీపేట చౌరస్తాలో, 47 వ డివిజన్‌లో, డీజిల్ కాలనీలలో కాంగ్రెస్ నాయకులు వైఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్‌లు రావుల సదానందం, సుంచు అశోక్, గుంటి కుమార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసునూరి మనోహర్‌లు మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రిగా పాలన సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దడబోయిన వీరస్వామి, మేకల ఉపేందర్, ఇప్ప శ్రీకాంత్, అజ్జర్, కొమురవెల్లి రమేశ్, చిలువేరు విజయ్, సిరిల్ లారెన్స్, మానస మధు పాల్గొన్నారు.



రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మడికొండ చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

● మడికొండ : మాజీ ముఖ్యమంత్రి జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మడికొండ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారెపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, 64, 46 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్ల మోహన్, వస్కుల నాగరాజ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు బిల్ల రవిందర్, గుర్రమం అమర్‌నాథ్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, బరిగెల శ్రావణ్, రాజు యాదవ్, వస్కుల బిక్షపతి, చంద్రమౌళి, వస్కుల భాస్కర్, పల్లపు అర్జున్, కొప్పుల నవీన్‌యాదవ్, దువ్వ చిన్నకుమార్, ముంజ రమేష్, దండిగం సదానందం, రాజేందర్, కడమంచి సాయిలు, పెనుకుల విష్ణు, భాస్కర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కడిపికొండలోని బొడ్రాయి వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్మెట వెంకటరమణగౌడ్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాము రమేష్, నాయకులు సట్ల సదానందం, గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్, బుచ్చిరెడ్డి, కర్ర హరీష్‌రెడ్డి, నీలం రమేష్, బత్తిని విజ్ఞగిరి, నర్మెట సుధాకర్, నూటెంకి సతీష్, నర్మెట వేణు, నాగపురి రాజయ్య, సాయిప్రేమ్ పాల్గొన్నారు.

ఐ కేర్

మెల్ల కన్ను మంచిదేనా?

కొన్ని కనుగుడ్డు సమస్యలను బాల్యంలోనే సరిదిద్దే వీలుంది. వీటిలో ముఖ్యమైనది... 'మెల్ల కన్ను'! ఈ సమస్యతో పుట్టిన పిల్లల్ని అలాగే వదిలేయకుండా సాధ్యమైనంత త్వరగా చికిత్స చేయించి కళ్లను సరిచేయించడం ఎంతో అవసరం!



బాల్యంలో 'స్ట్రాబిస్మస్'

నేరుగా, ఒకే తీరుగా ఉండకుండా హెచ్చుతగ్గులుగా ఉన్న కనుగుడ్ల సమస్యను వైద్య పరిభాషలో 'స్ట్రాబిస్మస్' అంటారు. కొందరికి రెండు కనుగుడ్లు ముక్కు వైపుకి తిరిగి (క్రాస్‌డ్ ఐస్) ఉండొచ్చు. ఇంకొందరికి ఒక కనుగుడ్డు పైకి, మరొకటి కిందకి ఉండొచ్చు. మరికొందరికి చెవుల వైపుకి తిరిగి (వాల్ ఐస్) ఉండొచ్చు. ఇలాంటి కనుగుడ్డు వంకరలు స్థిరంగా ఉండొచ్చు, లేదా అప్పుడప్పుడూ జరుగుతూనూ ఉండొచ్చు. పుట్టుకతోనే ఉండొచ్చు, లేదా పెరిగే క్రమంలో కనిపించవచ్చు. కొంతమందిలో ఏదైనా ప్రమాదం తర్వాతగానీ, లేదా జబ్బుపడిన తర్వాతగానీ మొదలవవచ్చు. స్ట్రాబిస్మస్ సమస్య మన దేశంలో 2% పిల్లలను బాధిస్తుంటే, వారిలో సగం మందికి పుట్టుకతోనే మెల్ల కన్ను ఉంటోంది. అయితే మెల్ల కన్ను సమస్య ఒక్కొకరిలో ఒక్కోలా ఉంటుంది. 'ఆల్టర్నేటింగ్ స్ట్రాబిస్మస్'లో మొదట ఒక కంటితో మొదలై తర్వాత రెండో కంటికి సమస్య తలెత్తుతుంది. దగ్గరి చూపు అవసరమయ్యే పనులు చేసే వారికి కూడా ఈ సమస్య రావొచ్చు.

లక్షణాలు ఇవే!

మూడేళ్లలోపు వయసులో పిల్లల కనుగుడ్లు ఎదిగే దశలోనే ఉంటాయి. ఆ సమయంలో తల్లితండ్రులు పిల్లల కనుగుడ్లలో వంకరలు, తేడాలు గమనించాలి. మెల్ల కన్ను వల్ల పిల్లలు తలను వంచి చూస్తుంటారు. అలాగే పిల్లలు అలసిపోయినప్పుడు, తక్కువ వెలుతురు ఉన్న ప్రదేశంలో ఉన్నప్పుడు, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఒక కనుగుడ్డు తిరిగిపోవడం, కళ్లను పదే పదే ఆర్పుతూ ఉండడం, ఎండలోకి వెళ్లినప్పుడు ఒక కంటిని మూసి ఉంచడం, కళ్లను రుద్దుకోవడం, వస్తువులను కంటికి దగ్గరగా పెట్టుకుని చూడడం... పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యుల చేత పరీక్ష చేయించాలి. మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు కచ్చితంగా కంటి పరీక్షలు చేయించగలిగితే ఈ సమస్యలను ప్రారంభంలోనే సరిదిద్దే వీలుంటుంది. ఐదారేళ్ల వయసులో పిల్లల కంటిచూపు 20/20 లేదా పెద్దల కంటి చూపుతో సమానంగా ఉంటుంది. 20/20 అంటే.. 20 అడుగుల దూరం నుంచి కూడా నిర్దిష్ట పరిమాణంలో ఉన్న అక్షరాలను చదవగలగడం. అయితే ఈ సామర్థ్యం పిల్లలందరికీ ఉండదు. మూడు నుంచి ఐదేళ్ల వయసులో తలెత్తే స్ట్రాబిస్మస్‌ను గుర్తించి చికిత్స చేయించకపోతే ఆ తర్వాత అది శాశ్వత సమస్యగా ఉండిపోతుంది. దీనికితోడు మెల్ల కన్ను వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం కూడా దెబ్బతింటుంది.

చికిత్స తేలికే!

మూసుకుపోయే కన్ను: ఒక కన్ను కిందకు వాలిపోయే 'లేజీ ఐ' సమస్యను తొలినాళ్లలోనే పసిగట్టాలంటే పిల్లల కళ్లను తరచుగా గమనిస్తూ ఉండాలి. అలాగే పుట్టింది మొదలు ఆరు నెలలకోసారి కంటి వైద్యుల చేత పరీక్షలు చేయించాలి. పాక్షికంగా లేదా పూర్తిగా మూసుకుపోయే ఎలాంటి 'లేజీ ఐ' సమస్యనైనా చికిత్సతో సరి చేయించవచ్చు. వక్రీభవన లోపాలను కళ్లజోడుతో లేదా కాంటాక్ట్ లెన్సులతో సరిచేయొచ్చు. అలాగే 'ప్లిఆప్టిక్స్ క్యామ్ స్టిమ్యులేషన్, బైపోలార్ ట్రైనింగ్' అనే కంటి వ్యాయామాలతో కొంతమేరకు సమస్యలను అదుపు చేయొచ్చు. అవసాన్నిబట్టి కంటి కండరాలకు సర్జరీ చేసి కనుగుడ్డును సరిచేయొచ్చు. ఈ సర్జరీ ఎంతో శులభం. పిల్లలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

హై బిపి

'డ్యాష్' డైట్

డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్‌టెన్షన్ అనే డ్యాష్ డైట్‌ను అమెరికాకు చెందిన డాక్టర్. మార్లా హెల్లర్ కనిపెట్టింది. రకరకాల ఆహారపదార్థాల ద్వారా శరీరానికి తగినన్ని పోషకాలను అందించి ఆరోగ్యాన్ని మెరుగు పరచటంతోపాటు రక్తపోటును తగ్గించటంలో ఈ డ్యాష్ డైట్ దిట్ట. రక్తపోటు రాకుండా ఉండాలన్నా, నియంత్రణలో ఉండాలన్నా ఈ డైట్‌ను అనుసరించటం మేలని వైద్యులు కూడా అంటున్నారు. ఈ డైట్‌ను అనుసరిస్తే రెండు వారాల్లోనే సిస్టాలిక్ బ్లడ్ ప్రెషర్ 8 నుంచి 14 పాయింట్లు తగ్గినట్టు ప్రయోగాత్మకంగా రుజువైంది. సోడియంను తగ్గించటంతోపాటు రక్తపోటును నియంత్రణలో ఉంచే పొటాషియం, కాల్షియం, మెగ్నీషియంలను పెంచటం డ్యాష్ డైట్ ప్రత్యేకత. ఈ డైట్‌లో భాగంగా తృణధాన్యాలు, పళ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వు ఉండే పాల ఉత్పత్తులు తీసుకోవాలి. చేపలు, చికెన్, చిక్కుళ్లతోపాటు వారంలో ఒకటి రెండు రోజులు నట్స్,



సీడ్స్ తినాలి. తక్కువ పరిమాణాల్లో మాంసం, స్వీట్లు, కొవ్వులు కూడా తీసుకోవచ్చు.

- తృణధాన్యాల్లో భాగంగా రోజుకి ఒక హోల్ వీట్ బ్రెడ్ స్లయిస్ లేదా అర కప్పు బ్రౌన్ రైస్ లేదా పాస్తా తినొచ్చు.
- టొమాటో, క్యారెట్, బ్రక్కోలి, స్వీట్ పొటాటో, ఆకుకూరల్లో పీచు ఎక్కువగా ఉంటుంది. విటవి ఎన్లతోపాటు పొటాషియం, మెగ్నీషియం కూడా సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి వీటిని రోజూ తినటం మేలు.
- పుల్లగా ఉండే నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ ఫ్రూట్స్ తినాలి.
- పాలు, పెరుగు, జున్ను కాల్షియం, విటమిన్ డి ఎక్కువగా ఉండే పదార్థాలు. వీటిని తినటం వల్ల కూడా రక్తపోటు అదుపులో ఉంటుంది.

హెయిర్ కేర్

బట్టతలకు బ్రేక్!



తోచిన చిట్కాలు పాటిస్తూ, దొరికిన నూనెలన్నీ పూసేసినంత మాత్రాన బట్టతలకు బ్రేక్ పడదు. వెంట్రుకలు రాలుతున్నాయని గ్రహించిన వెంటనే అప్రమత్తమై వైద్యులను కలిస్తే బట్టతలను వాయిదా వేయొచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

కుటుంబంలో బట్టతల ఉంటే తర్వాతి తరానికి సంక్రమించే అవకాశాలు ఎక్కువ! అలాగని బట్టతల కోసం ఎదురు చూస్తూ, రాలిపోయే వెంట్రుకలను చూసుకుని దిగాలు పడుతూ ఉండడం వల్ల ప్రయోజనం ఏముంటుంది? బట్టతలకు శాశ్వత పరిష్కారమనేది లేకపోయినా, వెంట్రుకలు రాలిపోకుండా చేసి, రాలిన వెంట్రుకల స్థానంలో కొత్త వెంట్రుకలను నాటే ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా ఎక్కువ మంది.. 'రాలినన్ని వెంట్రుకలు రాలనిద్దాం! పూర్తిగా రాలిపోయిన తర్వాత హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకుందాం' అనే ధోరణితో ఉంటారు. కానీ వెంట్రుకలు రాలడం కనిపెట్టిన వెంటనే చికిత్స మొదలుపెడితే, మిగిలిన వెంట్రుకలు రాలిపోకుండా నియంత్రించుకోవచ్చు. కుటుంబంలో బట్టతల ఉన్నవాళ్లు మరికాస్త ముందుగా, అంటే వెంట్రుకలు రాలడం మొదలవక ముందే చికిత్స మొదలుపెడితే, బట్టతలకు అడ్డుకట్ట వేయొచ్చు.

అధిక రక్తపోటు, మధుమేహ సమస్యలున్నవాళ్లు వాటిని మందులతో అదుపులో పెట్టుకున్న తర్వాతే హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకోవాలి. తర్వాత నుంచి అందర్లాగే వ్యవహరించవచ్చు. తలస్నానం చేయొచ్చు. ఊడిపోతాయేమోననే భయం అవసరం లేదు. కొందరికి ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత పిఆర్‌పి అవసరం పడుతుంది. ఈ విషయాన్ని వైద్యులే సూచిస్తారు. అలాంటివాళ్లు వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి.



హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ఎప్పుడు?

బట్టతలకు వయసుతో సంబంధం లేదు. 20 ఏళ్లకే బట్టతలతో బాధపడుతున్న వాళ్లను చూస్తున్నాం. ఆ సమస్యతో సర్దుకుపోకుండా, వెంట్రుకలు రాలడం మొదలుపెట్టగానే చికిత్స తీసుకోవాలనే విషయం కూడా చాలా మందికి తెలియదు. ఈ సమస్య ఏ వయసులో మొదలైనా, ఎవరైనా నిరభ్యంతరంగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవచ్చు. 20 నుంచి 70 ఏళ్ల వయస్కులు ఈ ప్రక్రియను ఆశ్రయించవచ్చు. అయితే అంతకంటే ముందు బట్టతల ఏర్పడే దశల గురించి కొంత అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం. సాధారణంగా బట్టతలలో 8 దశలుంటాయి. 8వ దశలో 70 నుంచి 80% వెంట్రుకలు లేని వాళ్లకు ఎక్కువ వెంట్రుకలు అవసరమవుతాయి. అన్ని వెంట్రుకలు వాళ్ల శరీరం మీద లేకపోతే, వాళ్లకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సాధ్యపడదు. అలాగే తొలి రెండు దశల్లో కూడా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకోవలసిన అవసరం లేదు. కాబట్టి రెండో దశ నుంచి ఆరో దశ వరకూ ఉన్న బట్టతలలకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకోవచ్చు.

ఇతర సమస్యలతో....

పేను కొరుకుడు, స్కారింగ్ అలోపేసియా, సోరియాసిస్ మొదలైన సమస్యలున్నవాళ్లలో ఆ సమస్యల మూలంగా తల మీద వెంట్రుకలు ఊడిపోతుంటే, దాన్ని బట్టతలగా భావించడానికి వీల్లేదు. ఇలాంటి సందర్భాల్లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినా, శరీరం ఆ వెంట్రుకలను రిజెక్ట్ చేస్తుంది కాబట్టి ఆ వెంట్రుకలు నాటుకోకుండా ఊడిపోయే అవకాశాలుంటాయి. కాబట్టి ఆ సమస్య ఏడాదిపాటు పెరగకుండా ఉండి, అసలు సమస్యకు చికిత్స చేసుకున్నా, వెంట్రుకలు మొలవని సందర్భాల్లో మాత్రమే హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆశ్రయించాలి. లేదంటే చికిత్స విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొందరిలో స్కారింగ్ అలోపేషియా ఉంటుంది. చర్మానికి రక్తసరఫరా లేకపోవడంతో, ఆ ప్రదేశంలో వెంట్రుకలను నాటినా, శరీరం రిజెక్ట్ చేయొచ్చు. కాబట్టి సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని, స్కాల్ప్ బయాప్సీతో సమస్యను కచ్చితంగా గుర్తించి, సమస్యను సరిదిద్దుకున్న తర్వాత మాత్రమే హెయిర్ ట్రాన్స్‌ప్లేంటేషన్‌ను ఆశ్రయించాలి.

ఫెయిల్యూర్ ఎందుకు?

నాటిన వెంట్రుకలు ఊడిపోతున్నాయంటే, అందుకు చాలా కారణాలుంటాయి. సోరియాసిస్, అలోపేసియా లాంటి చర్మ సమస్యలతో హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఆశ్రయించడంతో పాటు, ఆ చికిత్సలో సమర్థులైన వైద్యులను ఎంచుకోకపోవడం హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ విఫలమవడానికి ప్రధాన కారణం. సాధారణంగా ఈ ప్రక్రియ కోసం తల వెనకభాగంలో, మెడ పైన ఉన్న వెంట్రుకలనూ, లేదంటే గడ్డం, ఛాతీల్లోని వెంట్రుకలను హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఉపయోగిస్తారు. అయితే ఆ వెంట్రుకలను సేకరించేటప్పుడు, ఎంతో జాగ్రత్తగా వేరుతో సహా సేకరించాలి. ఆ క్రమంలో వేరు తెగిపోతే, ఆ వెంట్రుక నాటడానికి పనికి రాదు. వేరు లేని మొక్క ఎలా పెరగదో, వేరు లేని వెంట్రుక కూడా పెరగదు. బయటకు వెంట్రుక ఉన్నట్టు కనిపించినా, అది పెరగకుండా కొంత కాలానికి రాలిపోతుంది. కాబట్టి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అనుభవజ్ఞులైన డెర్మటాలజిస్ట్ లేదా ప్లాస్టిక్ సర్జన్‌ను ఎంచుకోవాలి. చాలా మంది హెయిర్ సెలూన్లనూ, చిన్నచిన్న క్లినిక్స్‌నూ, టెక్నీషియన్లనూ ఆశ్రయిస్తూ ఉంటారు. ఇది సరి కాదు.

బట్టతల రాకుండానే...

తల పలుచగా ఉండీ, చిక్కగా కనిపించాలనుకునేవాళ్లకు కూడా హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చు. అలాంటప్పుడు తల మీద నాటిన వెంట్రుకలతో పాటు, ముందు నుంచీ ఉన్న వెంట్రుకలు రెండూ ఉంటాయి. కానీ నాటిన వెంట్రుకలు శాశ్వతంగా ఉండిపోతే, ముందు నుంచీ ఉన్న వెంట్రుకలు కొంత కాలానికి ఊడిపోవచ్చు. అప్పుడు తల మీద వెంట్రుకలు ఎబ్బెట్టుగా కనిపించే అవకాశాలుంటాయి. కాబట్టి ముందునుంచీ ఉన్న వెంట్రుకలను కాపాడుకోవడం కోసం, ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత, కొన్ని లోషన్లను వైద్యులు సూచిస్తారు. వాటిని వాడుకుంటే వెంట్రుకలు రాలిపోకుండా ఉంటాయి. వీళ్లే కాకుండా బట్టతల ప్రారంభంలో వెంట్రుకలు రాలడం మొదలైన సందర్భాల్లో కూడా ఈ లోషన్‌తో వెంట్రుకలు రాలకుండా చూసుకోవచ్చు. దీంతో వెంట్రుకలు రాలే ప్రక్రియ వాయిదా పడుతుంది.

ఎన్ని వెంట్రుకలు?

ఎన్ని వెంట్రుకలను నాటాలి అనేది ఎంత ఏరియాలో ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకుంటున్నారు? వాళ్ల దగ్గరి నుంచి సేకరించడానికి ఎన్ని వెంట్రుకలు ఉన్నాయి? అనే అంశాల మీద ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఒక సిటింగ్‌లోనే ట్రాన్స్‌ప్లాంట్ పూర్తయిపోతుంది. ఒకవేళ 5 నుంచి 6 వేల వెంట్రుకలు నాటవలసి వస్తే, రెండు సిట్టింగ్స్ అవసరమవుతాయి. వెంట్రుక కుదుళ్లలో ఒక వెంట్రుకే ఉంటుందనుకుంటాం. కానీ రెండు, మూడు, నాలుగు వెంట్రుకలు కూడా ఉంటూ ఉంటాయి. ఇలా ఒక గ్రాఫ్ట్ నుంచి ఎన్ని వెంట్రుకలు వస్తాయనేదాని మీద కూడా ఫలితాలు ఆధారపడి ఉంటాయి.



పిఆర్‌పి ఫలితం ఏ మేరకు?

ఐదారు నెలల క్రితం పోగొట్టుకున్న వెంట్రుకలు పెరగడానికి పిఆర్‌పి తోడ్పడుతుంది. కానీ ఎన్నో ఏళ్ల ముందు వెంట్రుకలు ఊడిపోయి, తల నున్నగా మారిపోయిన సందర్భాల్లో పిఆర్‌పి, డెర్మా రోలర్. ఇంజెక్షన్స్ లాంటి చికిత్సలు ఫలితాన్నివ్వవు. ఇలాంటి కేసుల్లో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ఒక్కటే ఉత్తమమైన పరిష్కారం.

డాక్టర్ స్వప్న ప్రియ, డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత ఇలా...

ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత, నొప్పి, వాపు సహజం. ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత రెండు నుంచి 15 రోజుల వరకూ వైద్యుల పర్యవేక్షణలో ఉండాలి. సెకండరీ ఇన్‌ఫెక్షన్లు తలెత్తకుండా



ఇన్‌డైజెషన్

అజీర్తి అంతం ఇలా!

అడపాదడపా బాధిస్తే ఫరవాలేదు. కానీ అదే పనిగా అజీర్తి వేధిస్తుంటే సమస్యను సీరియస్‌గానే పరిగణించాలి. కారణాలను వెతికి, వాటిని సరిదిద్దడంతో పాటు అవసరాన్ని బట్టి సమర్థమైన చికిత్స తీసుకోవాలి.



నోరూరించే పదార్థాలను చూసినా, వాటి వాసన ముక్కుపుటాలకు తాకినా నోట్లో నీళ్లూరతాయి. ఇలా నోట్లోనే కాదు పొట్టలోనూ స్రావాలు ఊరతాయి. అవే డైజెస్టివ్ జ్యూసెస్. ఇవి ముందుగానే విడుదలై రెడీగా ఉండటంతో పొట్టలోకి ఆహార పదార్థాలు చేరగానే జీర్ణక్రియ మొదలవుతుంది. అయితే పరిమితంగా తింటే పనంతా సజావుగా సాగిపోతుంది. అలాకాకుండా ఎడాపెడా లాగించేస్తే ఆ ఆహారాన్ని జీర్ణం చేసుకునేందుకు జీర్ణరసాలు సరిపోక పొట్టలో అసౌకర్యం మొదలవుతుంది. ఆ అసౌకర్యమే అజీర్తి. దీన్ని వైద్య పరిభాషలో 'డిస్పెప్సియా' అంటారు. అయితే భారీ భోజనం తిన్న వెంటనే తాత్కాలికంగా అసౌకర్యంగా అనిపిస్తే దాన్ని భుక్తాయాసంగా భావించాలి. అదే అసౌకర్యం రోజుల తరబడి బాధిస్తే అది కచ్చితంగా అజీర్తే!

అజీర్తి లక్షణాలు ఇవే!

- తినకపోయినా పొట్ట నిండుగా ఉన్న ఫీలింగ్
- త్రేన్పులు
- తల తిరుగుడు, వాంతులు
- పొట్టలో శబ్దాలు, అసౌకర్యం, నొప్పి
- అసిడిటీ

అజీర్తి నుంచి విముక్తి ఇలా!

- సోంపుతో సూపర్‌ఫాస్ట్ రిలీఫ్

రెండు టేబుల్ స్పూన్ల సోంపును నూనె లేకుండా వేయించి పొడి చేసుకోవాలి. గ్లాసు నీళ్లలో ఒక టీస్పూను పొడి కలుపుకుని రోజుకి రెండుసార్లు తాగలి. ఇలా చేస్తే కారంగా ఉండే పదార్థాలు తినటం వల్ల కలిగిన అజీర్తి వదులుతుంది.

అల్లంతో అజీర్తికి చెక్

- జీర్ణాశయంలో అరగకుండా మిగిలిపోయిన పదార్థాలను అరిగించటానికి అల్లం సహాయపడుతుంది. కాబట్టి ఒక టీస్పూను అల్లం తురిమి ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో కలపాలి. కొద్దిగా నిమ్మరసం, కొన్ని చుక్కల తేనె కూడా కలిపి నెమ్మదిగా తాగితే ఫలితం ఉంటుంది.

వాము దివ్యౌషధం

- వాము అజీర్తి నివారిణి అనే విషయం అందరికీ తెలిసిందే! వాముకు అల్లం చేర్చి మెత్తగా రుబ్బాలి. ఈ ముద్దను ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో కలిపి రోజుకి రెండుసార్లు తాగితే అజీర్తి నుంచి ఉపశమనం కలుగుతుంది.

నీళ్లతో అజీర్తి రిలీఫ్

ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. అజీర్తి లక్షణాలు వేధిస్తుంటే కొద్ది కొద్ది పరిమాణాల్లో నీళ్లు తాగుతూ ఉండాలి. ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగితే ఫలితం ఉండకపోవచ్చు. కాబట్టి వీలైనన్ని ఎక్కువ నీళ్లు కొద్ది కొద్దిగా తాగుతూ ఉంటే జీర్ణక్రియ మెరుగై సమస్య పరిష్కారమవుతుంది.

సోడా ఉప్పుతో సో బెటర్

అజీర్తితో తలెత్తే అసిడిటీ వదలాలంటే ఒక గ్లాసు నీళ్లలో టీస్పూను సోడా ఉప్పు, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి తాగాలి. దీంతో పొట్టలోని యాసిడ్ న్యూట్రలైజ్ అయి ఛాతీలో మంట తగ్గుతుంది.

- పొట్టలో తయారయ్యే హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఒక రోజులో దాదాపు 2 లీటర్ల పరిమాణానికి కూడా చేరుకోవచ్చు.
- జీర్ణక్రియలో భాగంగా మనం తీసుకున్న ఆహారం జీర్ణాశయంలో కనీసం రెండు నుంచి మూడు గంటల పాటు ఉంటుంది.
- శరీర ఉష్ణోగ్రతతో సమం చేయటం కోసం మన నోరు అక్కడికి చేరుకున్న ఆహారంసం ఉష్ణోగ్రతను పెంచటం లేదా తగ్గించటం చేస్తుంది.
- మనం ఒక ఏడాదిలో కనీసం 500 కిలోల ఆహారం తీసుకుంటాం.
- కొవ్వు కలిగిన పదార్థం జీర్ణమవటానికి కనీసం 6 గంటల సమయం పడుతుంది.
- పిండి పదార్థాలున్న పదార్థం జీర్ణమవటానికి రెండు గంటలు సరిపోతుంది.
- 11 లీటర్ల పదార్థాలు, జీర్ణ రసాలు జీర్ణ వ్యవస్థలో సర్క్యులేట్ అయితే చివరికి విసర్జించబడేది 100 మి.లీటర్లే!
- తీసుకున్న ఆహారంలోని 90 % పోషకాలు చిన్న పేగుల్లోనే శోషణ చెందుతాయి.
- ప్రతి 5-10 రోజులకు జీర్ణాశయం లోపల కొత్త రక్షణ పొర తయారవుతూ ఉంటుంది.

యాపిల్ సెడార్ వనిగర్

అర కప్పు నీళ్లలో ఓ టీస్పూను యాపిల్ సెడార్ వెనిగర్, కొద్దిగా తేనె కలిపి తాగాలి. ఇలా చేస్తే తిన్న ఆహారాన్ని అరిగించుకునేంత యాసిడ్ సరిపడా జీర్ణాశయంలో లేకపోయినా ఆహారం అరిగిపోతుంది.

డాక్టర్‌ని ఎప్పుడు కలవాలి?

అజీర్తి కోసం వైద్యుల్ని కలవాలా? అనుకుంటాం. కానీ కొన్ని సందర్భాల్లో సొంత వైద్యం సరిపోకపోవచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల్ని కలవటం మంచిది.

- వరసగా వాంతులు
- రక్తపు వాంతులు, విరేచనాలు
- విపరీతమైన పొత్తి కడుపు నొప్పి
- రెండు వారాలకు మించి అజీర్తి

24 నుంచి 72 గంటలు

మనం తీసుకున్న ఆహారం పొట్టలోనే జీర్ణమవుతుందనుకుంటాం. కానీ ఆహారం నోట్లోకి చేరుకున్నది మొదలు, జీర్ణాశయంలో, చిన్న, పెద్ద పేగుల్లో....ఇలా అది కదిలే మార్గంలోని ప్రతి అవయవంలో దశలవారీగా జీర్ణమవుతూనే ఉంటుంది. కాబట్టే తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణమవటానికి కనీసం 24 నుంచి 72 గంటల సమయం పడుతుంది. అలాగే జీర్ణాశయం కెపాసిటీ గురించి కూడా మనకు కొన్ని అపోహలున్నాయి. ఎంత ఆహారం తీసుకున్నా తోలు తిత్తి లాంటి జీర్ణకోశం సాగుతూనే ఉంటుందనుకుంటాం. కానీ నిజానికి జీర్ణకోశం కెపాసిటీ 1.5 లీటర్లే! ఇంత చిన్న జీర్ణకోశంలోకి అపరిమితంగా ఆహారాన్ని తోస్తే తిరగటానికి ఇబ్బందిపడే మిక్సీ జార్‌లా మన జీర్ణకోశం ఇబ్బంది పడుతుంది. ఫలితంగా అజీర్తి, పొట్టలో నొప్పి సమస్యలు మొదలవుతాయి.

ఎక్కువ తింటే ఏమవుతుంది?

పరిమితికి మించి తిన్నప్పుడు శరీరంలో ఈ మార్పులు జరుగుతాయి.

- **పొట్ట లావవుతుంది:** ఎక్కువ తిన్నప్పుడు ఆ పదార్థాలకు చోటు కల్పించటం కోసం జీర్ణాశయం సాగుతుంది. దాంతో దాని చుట్టుపక్కన ఉంటే అంతర్గత అవయవాలు నెట్టబడతాయి. దాంతో పొట్టలో నొప్పి మొదలవుతుంది.
- **పొట్ట బరువుగా:** ఆహారం మింగినప్పుడల్లా కొంత గాలి పొట్టలోకి చేరుకుంటూ ఉంటుంది. ఈ గాలి త్రేన్పుల రూపంలో బయటకొచ్చే ప్రయత్నం చేస్తుంది. అయితే త్రేన్పు బయటికొచ్చేస్తే ఫర్వాలేదు. అందుకు అడ్డంకి ఏర్పడితే పొట్టలో ఇబ్బంది మొదలవుతుంది.
- **ఛాతీలో మంట:** ఎక్కువ ఆహారం తీసుకున్నప్పుడు హైడ్రోక్లోరిక్ యాసిడ్ అన్నవాహికలోకి ఎగదన్నుతుంది. దాంతో ఛాతీలో మంట మొదలవుతుంది. జీర్ణం కావటానికి ఎక్కువ సమయం పట్టే కొవ్వు, తీపి పదార్థాలు తిన్నప్పుడు ఈ సమస్య బాధిస్తుంది.
- **శ్రమకు లోనయ్యే అర్గాన్స్:** పరిమితికి మించి ఆహారం తిన్నప్పుడు దాన్ని అరిగించుకోటానికి సరిపడా స్రావాలను విడుదల చేయటం అంతర్గత అవయవాలు అవసరానికి వి ంచి శ్రమ పడాల్సి ఉంటుంది. ఇలా తరచుగా జరుగుతూ ఉంటే మెటబాలిజం, ఎండోక్రైన్ పనితీరు గాడితప్పి గ్రోత్ హార్మోన్ తగ్గటం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ మొదలైన సమస్యలు మొదలవుతాయి.

మెదడు చెప్పింది వినాలి

తీసుకునే ఆహారం ద్వారా పొట్టలోకి చేరుకునే కొవ్వు కణాలు 'లెప్టిన్' అనే హార్మోన్‌ను స్రవిస్తాయి. ఈ హార్మోన్ మన మెదడుకు సంకేతాలు పంపిస్తుంది. తిన్నది సరిపోయిందని, ఇక తినాల్సిన అవసరం లేదని ఈ హార్మోన్ పంపే సంకేతాలు అందుకున్న మెదడు ఆకలి తీరిందనే భావన కలిగేలా చేస్తుంది. దాంతో మనం తినటం ముగిస్తాం. కానీ త్వరత్వరగా తినేవాళ్లలో ఈ మెకానిజం గాడి తప్పుతుంది. మెదడుకు సిగ్నల్స్ వెళ్లక పొట్ట నిండినా ఇంకా తింటూనే ఉంటాం. దాంతో స్థూలకాయులుగా తయారయ్యే ప్రమాదం ఉంది.

అవగాహన

ఎముకలెందుకు గుల్లబారతాయి?

30 ఏళ్ల వయసుకి చేరుకునేసరికి ఎముకలు పూర్తి సాంద్రతను సంతరించుకుంటాయి. ఆ తర్వాత ఎముక పునర్నిర్మాణం మొదలవుతుంది. ఈ మార్పులన్నీ సక్రమంగా జరగాలంటే తగినంత క్యాల్షియం శరీరానికి అందుతూ ఉండాలి.

ఆహారం ద్వారా శరీరంలోకి చేరుకునే క్యాల్షియంను ఎముకలు పీల్చుకుంటాయి. ఒకవేళ రక్తంలో క్యాల్షియమ్ స్థాయి తక్కువగా ఉంటే ఎముకల మజ్జ నుంచి క్యాల్షియం రక్తంలోకి విడుదలవుతుంది. ఎముకలకే క్యాల్షియమ్ సరిపోకపోతే రక్తం నుంచి శోషించుకుంటాయి. ఇలా ఎముకలు, రక్తం..రెండిట్లో క్యాల్షియం స్థాయులు సక్రమంగా ఉన్నంతకాలం ఎటువంటి సమస్యా ఉండదు. ఎప్పుడైతే ఈ సమతౌల్యం అదుపు తప్పుతుందో అప్పుడే ఎముకలు గుల్లబారటం, బలహీనపడటం మొదలవుతుంది. అలాగే సహజసిద్ధంగానే 30 ఏళ్ల వరకూ పెరుగుతూ వచ్చిన ఎముకల సాంద్రత అప్పటి నుంచి తగ్గటం మొదలుపెడుతుంది. దాంతో ఆస్టియోపోరోసిస్, ఎముకలు తేలికగా విరిగిపోవటం మొదలైన సమస్యలు మొదలవుతాయి.

ఇలా జరగకుండా ఉండాలంటే....

30 ఏళ్ల లోపు వరకూ సాధ్యమైనంత ఎక్కువ క్యాల్షియమ్‌ను తీసుకోవటంతోపాటు, ఆ తర్వాత దాని పరిమాణాన్ని జీవనశైలి, వయసుల ఆధారంగా పెంచుతూ ఎముకల్ని బలంగా ఉంచుకోవాలి.

ఆహారంలో క్యాల్షియం:

క్యాల్షియం తగినంత లేని ఆహారం తీసుకోవటం వల్ల ఎముకల సాంద్రత తగ్గుతుంది. చిన్న వయసులోనే బోన్ లాస్ జరిగి ఎముకలు విరిగే అవకాశాలు పెరుగుతాయి.

అస్తవ్యస్త ఆహార వేళలు:

సమయానికి తినకపోవటం, తగినంత తినకపోవటం వల్ల కూడా క్యాల్షియమ్‌ను తగినంతగా శరీరం శోషించుకోలేదు.

పాలకు బదులు టీ, కాఫీలు:

పాలు తాగే అలవాటు అందరిలో కొరవడుతోంది. టీ, కాఫీలు తాగుతున్నాం కాబట్టి పాలు తాగినట్టే అనుకుంటే పొరపాటు. కానీ టీ, కాఫీల్లో ఉండే ఫైటేట్స్ క్యాల్షియమ్‌ను శరీరం శోషించుకోనివ్వకుండా అడ్డుకుంటాయి. కాబట్టి పాలను నేరుగా తాగాలి.

వ్యాయామం అవసరం:

వ్యాయామం వల్ల ఎముకల పటుత్వం పెరుగుతుంది. బాల్యంలో, యుక్త వయసులో వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

మద్యపానం, ధూమపానం:

ఈ వ్యసనాల వల్ల ఎముకల్లోని క్యాల్షియం అవసరానికి మించి రక్తంలోకి విడుదలవుతూ శరీరం నుంచి బయటికి వెళ్లిపోతూ ఉంటుంది. ఫలితంగా ఎముకలు గుల్లబారతాయి.

వయసురీత్యా:

వయసు పైబడేకొద్దీ ఎముకలు పలుచనై, బలహీనపడతాయి.

వంశపారంపర్యంగా:

తల్లితండ్రుల్లో ఆస్టియోపోరోసిస్ ఉంటే పిల్లలకు వంశ పారంపర్యంగా సంక్రమించే అవకాశం ఉంది.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 9 జూలై 2024
cinema@andhrajyothy.com

విజయ్ సినిమా మైత్రీ చేతుల్లో..




తమిళ అగ్రకథానాయకుడు విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'. ఈ సినిమాలో విజయ్ సరసన మీనాక్షి చౌదరి నటిస్తోంది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ విడుదల చేయనుంది. ప్రశాంత్, ప్రభుదేవా, మోహన్ జయరామ్, స్నేహ, లైలా ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కల్పాతి ఎస్ అఘోరం, కల్పాతి ఎస్. గణేశ్, కల్పాతి ఎస్.సురేశ్ నిర్మిస్తున్నారు.

వరుణ్‌తేజ్ విజృంభణ



వరుణ్‌తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొంటున్న ఈ చిత్రానికి కరుణకుమార్ దర్శకుడు. మీనాక్షి చౌదరి హీరోయిన్. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్మించిన ఓ భారీ సెట్‌లో ప్రస్తుతం యాక్షన్ పార్ట్ చిత్రీకరణ జరుగుతోంది. సినిమాలో చాలా కీలకమైన ఓ ఫైట్‌ను విజయ్ మాస్టర్ సారథ్యంలో చిత్రీకరిస్తున్నారు. వరుణ్‌తేజ్ చాలా రిస్క్ తీసుకుని ఈ ఫైట్ చిత్రీకరణలో పాల్గొంటున్నారు. యాక్షన్ పార్ట్‌లో అతని విజృంభణను అదిరిపోయే లెవల్‌లో ఉంటుందని నిర్మాతలు చెప్పారు. అలాగే ఇంతవరకూ పోషించని ఓ విభిన్న పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించి ఆడియన్స్‌ను అలరించనున్నారు. అతని కెరీర్‌లో ఇదొక మైలు రాయిగా నిలుస్తుందని దర్శకుడు కరుణకుమార్ చెబుతున్నారు. వింటేజ్ వైజాగ్‌ను ఈ సినిమాలో చూడవచ్చని అంటున్నారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

మహేశ్‌బాబు సినిమా అప్‌డేట్ అప్పుడేనా?



సోషల్ మీడియాలో నిరంతరం ట్రెండ్ అయ్యే విషయాల్లో దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, మహేశ్‌బాబు సినిమా ఒకటి. ఈ సినిమా షూటింగ్ నుంచి ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని మహేశ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం గురించి రకరకాలుగా చర్చించుకుంటున్నారు. సినిమా షూటింగ్ అప్పుడంటూ.. ఇప్పుడంటూ మొదలైన వార్తలు కొన్ని రోజులుగా ఆగిపోయాయి. కానీ ఇప్పుడు మహేశ్‌బాబు పుట్టినరోజు దగ్గరపడుతున్న తరుణంలో ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్స్‌పై ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను లేదా అనౌన్స్‌మెంట్ వీడియోను లేదా సినిమా నేపధ్యాన్ని పరిచయం చేసే గ్లింప్స్ అయినా మహేశ్ పుట్టినరోజున వదులుతారేమో అని నెట్టింట చర్చిస్తున్నారు. కాగా, మహేశ్ ఈ సినిమా కోసం తన లుక్ మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ ఏ సినిమాలో కనిపించని విధంగా సరికొత్త లుక్‌లో పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కథను రచయిత విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. పృథ్విరాజ్ సుకుమారన్ ఇందులో విలన్‌గా నటిస్తున్నారనే వార్త వినిపిస్తోంది. అలాగే బాహుబలి తర్వాత నాజర్ మళ్లీ రాజమౌళి దర్శకత్వం వహించే ఈ చిత్రంలో నటిస్తారని కూడా అంటున్నారు. ఇతర పాత్రలు పోషించే నటీనటుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు మహేశ్ పుట్టిన రోజైన ఆగస్టు 9న ఫుల్‌స్టాప్ పెట్టవచ్చని, ఆ రోజే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తారని అంతా ఎదురు చూస్తున్నారు.

సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా



బెంగుళూరు రేవ్ పార్టీ కేసులో నటి హేమ అరెస్టయిన సంగతి తెలిసిందే. దీంతో 'మా' అసోసియేషన్ నుంచి ఆమెను సస్పెండ్ చేశారు. తాజాగా, నటి హేమ ఓ లేఖ రాసి, 'మా' అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు అందజేశారు. అందులో "నేను దశాబ్ద కాలం పైగా 'మా'లో సభ్యురాలిగా ఉన్నాను. 'మా' నాకు అమ్మలాంటిది. డ్రగ్స్ కేసులో నాపై అనేక ఆరోపణలు రావడంతో నా అంతట నేనే డ్రగ్స్ శాంపిల్ టెస్ట్ చేయించుకున్నాను. అందులో నాకు నెగెటివ్ వచ్చింది. త్వరలోనే పోలీసులు చేసిన టెస్ట్‌లోనూ ఇదే ఫలితం వస్తుందనే నమ్మకం ఉంది. డ్రగ్స్ కేసులో నాపై జరిగిన దుష్ప్రచారంతో నేను ఎంతో మానసిక క్షోభకు లోనయ్యాను. నా విషయంలో 'మా' సభ్యులు అండగా ఉండాలని కోరుకుంటున్నాను. నాపై సస్పెన్షన్ తొలగిస్తారని ఆశిస్తున్నా" అని లేఖలో పేర్కొన్నారు. అలాగే, త్వరలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అపాయింట్‌మెంట్‌ను తీసుకొని తనకు న్యాయం చేయాలని హేమ కోరనున్నారు.

తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేశారు

కమల్‌హాసన్ 'సేనాపతి'గా నటించిన చిత్రం 'భారతీయుడు2'. 1996లో తెరకెక్కిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వం వహించగా, సుభాస్కరన్ నిర్మించారు. సిద్ధార్థ్, బాబీసింహా, ఎస్.జే.సూర్య, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 12న 'భారతీయుడు 2' విడుదలవుతున్న సందర్భంగా సోమవారం చిత్రబృందం మీడియాతో సమావేశమై చిత్ర విశేషాలను పంచుకున్నారు.



కమల్‌హాసన్

కమల్ హాసన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులే నన్ను స్టార్‌ను చేసి ఈ స్థాయికి తెచ్చారు. ఈ సినిమాలో 'సేనాపతి' క్యారెక్టర్ చెప్పే డైలాగ్స్ సమాజంలో నుంచి పుట్టినవాటిలా ఉంటాయి. శంకర్ విజన్‌ను, మేకింగ్‌ను థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు. రెండు వేళ్ల మడత పెట్టడం అంటే.. ఒకటి ఓటు వేసేది. రెండోది మన బాధ్యతది చెప్పేది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ 'భారతీయుడు' టైమ్‌లో సీక్వెల్ తీస్తానని అస్సలు అనుకోలేదు. ఆ మూవీ తరువాత ఇన్నేళ్లలో ఎక్కడ లంచం తీసుకున్నారనే వార్తలు చదివినా నాకు సేనాపతి గుర్తుకు వచ్చేవారు. కానీ కథ కుదరక ఆగిపోయేవాడ్ని. సినిమాలో నేను రాసిన ప్రతీ సన్నివేశాన్ని కమల్‌హాసన్ తన నటనతో పదిరెట్లు పెంచారు' అని చెప్పారు. సిద్ధార్థ్ మాట్లాడుతూ 'భారతీయుడు 2' సినిమా సమాజంలో జరిగే అవినీతికి ఓ అప్‌డేటెడ్ యాంటీ వైరస్ లాంటిది. శంకర్ దర్శకత్వం వహించిన 'బాయ్స్'తోనే కెరీర్‌ను ఆరంభించాను. మళ్లీ 20 ఏళ్ల తరువాత ఇందులో నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. యువత సమాజం కోసం ఏం చేయాలో చెప్పే చిత్రమిది' అని చెప్పారు. నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ 'కమల్ హాసన్ ఇండియన్ సినిమా హద్దుల్ని చెరిపేస్తూ ముందుకు సాగుతుంటారు. డైరెక్టర్ శంకర్ సోషల్ మెసేజ్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్ జోడించి సినిమా తీసే విధానం అద్భుతం' అని అన్నారు. బాబీసింహా మాట్లాడుతూ 'భారతీయుడు' చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ 28 ఏళ్ల తర్వాత 'భారతీయుడు 2'గా 'సేనాపతి' వస్తున్నాడు. ఈ చిత్రం మొదటి పార్ట్ కంటే పదింతలు హిట్ అవుతుంది' అని అన్నారు. రకుల్ ప్రీత్ మాట్లాడుతూ 'భారతీయుడు' సినిమా సీక్వెల్‌లో నేను నటిస్తానని కలలో కూడా అనుకోలేదు' అని చెప్పారు.

లక్కీ భాస్కర్ వచ్చేది ఎప్పుడంటే?



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తెలుగులో నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. 1980-90 ల కాలంలో అసాధారణ స్థాయికి చేరుకున్న ఓ సాధారణ బ్యాంక్ క్యాషియర్ ప్రయాణాన్ని చూపించే సినిమా ఇది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 7న విడుదల కానుంది. చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ విషయాన్ని ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' చిత్రం కోసం ఆర్ట్ డైరెక్టర్ బంగ్లాన్ 80ల నాటి ముంబై నగరాన్ని హైదరాబాద్‌లో భారీ సెట్స్‌తో పునర్నిర్మించారు. అలాగే ఆ కాలం నాటి బ్యాంకులను పోలి ఉండే భారీ బ్యాంక్ సెట్‌ను కూడా రూపొందించారు మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

కూతురికి పేరు పెట్టిన మంచు మనోజ్



మంచు మనోజ్, మౌనిక దంపతులకు ఏప్రిల్‌లో పాప పుట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ పాపకు బారసాల చేసి 'దేవసేన శోభా ఎంఎం' అని పేరు పెట్టినట్లు మంచు మనోజ్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'శివ భక్తుడిని కనుక సుబ్రహ్మణ్య స్వామి భార్య పేరు వచ్చేలా 'దేవసేన' అని పెట్టాం. మా అత్తగారు శోభా నాగిరెడ్డి జ్ఞాపకార్థం 'శోభ' అని యాడ్ చేశాం' అని వెల్లడించారు మనోజ్.

సిద్ధమవుతున్న షణ్ముఖ



మంచి కథాంశం ఎన్నుకుని ఆసక్తి కలిగించే నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. 'శాసన సభ' చిత్రాన్ని అందించిన సాప్పని బ్రదర్స్ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. షణ్ముగం సాప్పని దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఆది సాయికుమార్ గెటప్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను ఆది వెనుక షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కనిపిస్తుండడం ఆసక్తిగా మారింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తెరకు ఎక్కిస్తున్నాం. అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేస్తాం' అని చెప్పారు. తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్



వెన్నెల కిశోర్, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల నటిస్తున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టైటిల్ సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇటీవల ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'ప్రేమించానే పిల్లా' సాంగ్‌ను రిలీజ్ చేశారు. పూర్ణాచారి లిరిక్స్ అందించగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. సునీల్ కశ్యప్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: అవినాశ్ గుర్లింక, డీఓపీ: మల్లికార్జున్ ఎన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్‌బాల.

చతుర్... వితుర్



హాస్య నటులు శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర .. సినిమాలో ఉన్నారంటే చాలు హాస్యానికి కొదవుండదు. తాజాగా వీరిద్దరూ 'అరి' చిత్రంలో నటిస్తున్నారు. సినిమాలో వాళ్ల పేర్లు ఏమిటో తెలుసా? చతుర్, వితుర్. పేర్లలోనే కామెడీ ఉంది కదూ. సినిమాలో కూడా బాగా నవ్విస్తారని దర్శకుడు జయశంకర్ చెప్పారు. పండితుల వేషధారణలో ఉన్న వీరి గెటప్ ఫస్ట్ లుక్‌ని సోమవారం విడుదల చేశారు. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'అరి' విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. శ్రీనివాస్ రామిరెడ్డి, డాక్టర్ తిమ్మప్ప నాయుడు, శేషు మారంరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ప్రేమకు నిర్వచనం ఇచ్చే ఉషా పరిణయం



'నువ్వే నువ్వే', 'మన్మధుడు', 'మల్లీశ్వరి' వంటి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లను ప్రేక్షకులకు అందించిన పాపులర్ డైరెక్టర్ కె.వి జయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఉషా పరిణయం'. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఈ ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా నటిస్తుండగా, హీరోయిన్‌గా తన్వీ ఆకాంక్ష నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే నెల 2న విడుదల అవుతుందని మేకర్స్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ "ఈ సినిమా ప్రేమకు నేనిచ్చే నిర్వచనం. సినిమా లవర్స్‌కు ఫుల్ మీల్స్‌లా ఉంటుందీ చిత్రం. ఈ సినిమా అందరికీ నచ్చేలా అన్ని రకాల భావోద్వేగాలతో ఉంటుంది" అని చెప్పారు.

నిర్మాతగా ప్రభాస్ అభిమాని



రవి సిరోర్, నివిష్క పాటిల్ జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఎవరు.. ఎందుకు?' షూటింగ్ పూర్తయింది. ఎస్.జి.ఆర్. దర్శకత్వంలో జి.వెంకటేశ్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ ను సీనియర్ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి ఆవిష్కరించారు. లిరికల్ వీడియోను తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్యామలాదేవి మాట్లాడుతూ 'వెంకటరెడ్డి హిందుపూర్ ప్రభాస్ ఫ్యాన్ అసోసియేషన్ ప్రెసిడెంట్. ఆయన మా ఫ్యామిలీ మొత్తానికీ అభిమాని' అన్నారు. 'మా ఆరాధ్యదైవం కృష్ణంరాజుగారి సతీమణి చేతుల మీదుగా ఫస్ట్ లుక్ విడుదల కావడం ఆనందంగా ఉంది ఇది ఒక మంచి ఫ్యామిలీ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ అన్నారు.

పీఎస్‌బీల ప్రైవేటీకరణకు ఇదే సరైన సమయం

ఎస్‌బీఐ నివేదిక వెల్లడి

బ్యాంకుల సంఖ్యను మరింత కుదించాలి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ప్రైవేటీకరణకు ఇదే సరైన సమయమని ఎస్‌బీఐ తన రీసెర్చ్ నివేదికలో ప్రభుత్వానికి సూచించింది. దాదాపు అన్ని పీఎస్‌బీలు నష్టాలు పూడ్చుకుని మంచి లాభాల్లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ బ్యాంకులను కొనేందుకు ఎవరైనా ముందుకొస్తారని తెలిపింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ప్రైవేటీకరణకు నీతి ఆయోగ్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్ఐసీ, కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణకీ రంగం సిద్ధమైంది. దీంతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బ్యాంకుల ప్రైవేటీకరణపై వచ్చే కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ విడుదల చేసిన నివేదిక ప్రాధాన్యత సంతరించుకుంది.

మరింత కుదింపు: ప్రైవేటీకరణతో పాటు ఇప్పుడున్న 12 పీఎస్‌బీలను మరింత కుదించాలని ఎస్‌బీఐ మరో సూచన చేసింది. దేశ ఉత్తర-దక్షిణ, తూర్పు-పశ్చిమ ప్రాంతాల్లో గట్టి పట్టు ఉన్న పీఎస్‌బీల్లో, ఆయా ప్రాంతాల్లోని మిగతా పీఎస్‌బీలను విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విలీనాలతో పీఎస్‌బీల ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగుపడి ప్రైవేటు బ్యాంకులకు గట్టి పోటీ ఇస్తాయని నిపుణుల అంచనా. దీంతో ఎస్‌బీఐ తాజా నివేదికపై ప్రభుత్వం తప్పకుండా దృష్టి పెడుతుందని భావిస్తున్నారు. అయితే ఈ విలీనాల ప్రతిపాదనలను ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ విలీనాలు చివరికి తమ ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తుందని ఉద్యోగ సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

వినియోగాన్ని పెంచేలా బడ్జెట్: మరోవైపు కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న 2024-25 ఆర్థిక సంవత్సర పూర్తి బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించనున్నారు. దీంతో కార్పొరేట్ రంగం తన బడ్జెట్ కోరికల చిట్టాను కేంద్ర ఆర్థిక మంత్రికి విన్నవించింది. వినియోగ రంగం ముఖ్యంగా గ్రామీణ వినియోగ రంగం ఇంకా పుంజుకోలేదు. దీంతో వచ్చే కేంద్ర బడ్జెట్, దేశంలో వినియోగాన్ని పెంచేలా ఉండాలని కార్పొరేట్ రంగం ఆర్థిక మంత్రిని కోరింది. ఇందుకోసం తక్కువ పన్ను పోటు పరిధిలోకి వచ్చే అల్పాదాయ వర్గాల పన్ను మినహాయింపు ఆదాయ పరిమితిని మరింత పెంచాలని కోరింది.

కంపెనీలపైనా దయ చూపండి: ప్రస్తుత కార్పొరేట్ ట్యాక్స్ రేట్లపై కంపెనీలు అసంతృప్తితో ఉన్నాయి. ఈ పన్ను రేటును మరింత తగ్గించి, హేతుబద్ధం చేయాలని అసోచామ్ కోరింది. దీనికి తోడు పన్ను వసూలు వ్యవస్థను మరింత సంస్కరించాలని విజ్ఞప్తి చేసింది. మినహాయింపులను తొలగించి, పన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చే వారి సంఖ్యను మరింత విస్తృతం చేయాలని సూచించింది. మూలధన పెట్టుబడులకు కోత పెట్టకుండా ఆర్థిక మంత్రి వచ్చే బడ్జెట్‌లో ద్రవ్య లోటును జీడీపీలో 4.9 శాతం లేదా ఐదు శాతం వద్ద కట్టడి చేసే అవకాశం ఉందని ఇక్రా పరపతి సంస్థ అంచనా.

మార్కెట్లోకి బెంజ్ ఎంట్రీ లెవెల్ ఈవీలు



న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ సోమవారం భారత మార్కెట్లోకి ఎంట్రీ లెవెల్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ)ను ప్రవేశపెట్టింది. ఇందులో ఆల్ ఎలక్ట్రిక్ ఎంట్రీ ఎస్‌యూవీ ఈక్యూఏ 250 ప్రారంభ ధర రూ.66 లక్షలు. ఏడు సీట్ల సామర్థ్యంతో కూడిన ఈక్యూబీ 250 ప్లస్ ఎస్‌యూవీ ధర రూ.70.90 లక్షలుగా ఉంది. ఐదు సీట్ల సామర్థ్యంతో కూడిన ఈక్యూబీ 350 ఎస్‌యూవీ ధర రూ.77.5 లక్షలు. ఈ ఏడాదిలోనే ఈక్యూఎస్ మేబ్యాక్ ఎస్‌యూవీ సహా ఎలక్ట్రిఫైడ్ జీ-క్లాస్ మోడళ్లను భారత మార్కెట్లోకి తీసుకురానుంది.

14 వరకు జోయాలుక్కాస్ జువెలరీ సేల్ ఆఫర్స్

హైదరాబాద్: జోయాలుక్కాస్ జువెలరీ సేల్-2024 ఈనెల 14తో ముగియనుంది. జూన్‌లో ప్రారంభమైన ఈ ఆఫర్‌లో భాగంగా బంగారం, వజ్రాలు, వెండి, ప్రీషియస్ ఆభరణాల మజూరీ చార్జీల (వీఏ)పై ఫ్లాట్ 50 శాతం తగ్గింపును జోయాలుక్కాస్ అందిస్తోంది. ఈ జువెలరీ సేల్ ఎంతో మంది వినియోగదారులను ఆకర్షించిందని జోయాలుక్కాస్ ఎండీ, ఛైర్మన్ జోయ్ అలుక్కాస్ తెలిపారు. ఈ సేల్‌లో భాగంగా వినియోగదారులు ఎన్నడూ లేని ధరలకు అత్యుత్తమ ఆభరణాలను కొనుగోలు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 14తో ముగియనున్న ఈ సేల్ జోయాలుక్కాస్‌కు చెందిన అన్ని షోరూమ్‌ల్లో అందుబాటులో ఉందని తెలిపారు.

స్టార్ ఫిన్‌సర్వ్ రిజిస్ట్రేషన్ రద్దు

ముంబై: హైదరాబాద్‌కు చెందిన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) స్టార్ ఫిన్‌సర్వ్ ఇండియా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్టు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం తెలిపింది. ప్రోగ్‌క్యాప్ పేరుతో సేవలందిస్తోన్న స్టార్ ఫిన్‌సర్వ్.. తన డిజిటల్ లెండింగ్ కార్యకలాపాల్లో ఆర్థిక సేవల ఔట్‌సోర్సింగ్‌కు సంబంధించిన నియమావళిని ఉల్లంఘించిన కారణంగా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్టు ఆర్‌బీఐ వెల్లడించింది. కంపెనీ వ్యాపారపరమైన నిర్ణయాలకు కీలకమైన క్రెడిట్ అప్రైజల్, రుణ మంజూరు, కేవైసీ వెరిఫికేషన్ ప్రక్రియలను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చిందని, తద్వారా డేటా గోప్యత, వినియోగదారు సమాచార భద్రత నియమావళిని అతిక్రమించిందని ఆర్‌బీఐ పేర్కొంది. స్టార్ ఫిన్‌సర్వ్‌తో పాటు ముంబైకి చెందిన పాలిటెక్స్ ఇండియా రిజిస్ట్రేషన్‌ను సైతం ఆర్‌బీఐ రద్దు చేసింది.

హైదరాబాద్‌లో సీ1 కేంద్రం విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ ఇన్నోవేషన్, క్యాపబిలిటీస్ సెంటర్‌ను (జీఐసీసీ) గణనీయంగా విస్తరిస్తున్నట్టు సీ1 (గతంలో కన్వర్జ్‌వన్) ప్రకటించింది. తమ వృద్ధి వ్యూహంలో భాగంగా ఈ కేంద్రాన్ని విస్తరించినందు వల్ల కంపెనీ వృద్ధి మరింతగా పెరగడంతో పాటు సామర్థ్యాలు మరింతగా మెరుగుపడతాయని, తద్వారా ప్రపంచ కస్టమర్లకు విలువ సృష్టించగలుగుతామని సీ1 తెలిపింది. గత ఏడాదే సీ1 ఈ కేంద్రాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి ఈ కంపెనీ జీఐసీసీపై పెట్టుబడులు రెట్టింపు చేసింది. జీఐసీసీని 40,000 చదరపు అడుగుల విస్తీర్ణం గల కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు అత్యాధునిక శిక్షణా కేంద్రాల్లో సీటింగ్ సామర్థ్యం కూడా రెట్టింపు చేసినట్టు సీ 1 కంట్రీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర బొడ్డేజు అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ రూ.360 కోట్ల సమీకరణ

క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.360 కోట్లు సమీకరించనున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ వెల్లడించింది. క్యూఐపీలో భాగంగా రూ.5 ముఖ విలువ కలిగిన షేరును రూ.1,054.25 కు జారీ చేయనున్నట్లు తెలిపింది. ఈ నిధుల సమీకరణకు సోమవారం కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

జాంబియాలో లిథియం మైనింగ్‌లోకి నవ లిమిటెడ్

జాంబియాలో కంపెనీ అనుబంధ సంస్థ మాంబా కాలరీస్ లిమిటెడ్ (ఎంసీఎల్) రెండు కీలకమైన గనుల తవ్వకాల లైసెన్సులను దక్కించుకుందని నవ లిమిటెడ్ వెల్లడించింది. జాంబియాలోని నదరన్ ప్రావిన్స్‌లో లిథియం సహా మరికొన్ని ఖనిజ నిక్షేపాల తవ్వకాలకు సంబంధించి ఈ లైసెన్సులను అందుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ లైసెన్స్ కాలపరిమితి నాలుగేళ్లని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,580 ▼	67,450 ▼	99,500 ▲
ముంబై	72,746 ▲	66,635 ▲	91,733 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	118
వరంగల్	114	గుంటూరు	118
కరీంనగర్	114	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	129
కర్నూలు	114	నెల్లూరు	129
విశాఖపట్నం	114	అనంతపురం	118
గోదావరి	118		

రోష్నీ నాడార్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం



న్యూఢిల్లీ: దేశీయ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రాకు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం "నైట్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ హానర్" లభించింది. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి థియరీ మాథౌ ఈ అవార్డును సోమవారం రోష్నీకి ప్రదానం చేశారు. వ్యాపార ప్రపంచానికి తాను అందించిన సేవలు, ఫ్రాన్స్-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలను ప్రోత్సహించేందుకు నిర్విరామ కృషితో పాటు సామాజిక, పర్యావరణ సంక్షేమం విషయంలో తిరుగులేని నిబద్ధతకు గుర్తింపుగా రోష్నీకి ఈ అవార్డు దక్కింది. ఈ పురస్కారం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాని రోష్నీ ఈ సందర్భంగా అన్నారు. భారత్- ఫ్రాన్స్ మధ్య సంబంధాన్ని ఇది నొక్కి చెబుతుందన్నారు. తమ కంపెనీకి వ్యూహాత్మక మార్కెట్లలో ఫ్రాన్స్ ఒకటని అన్నారు. ఫ్రాన్స్‌లో కంపెనీ వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించడంతో పాటు మా వైవిధ్య సేవల ద్వారా ఫ్రెంచ్ వ్యాపారాల డిజిటల్ పరివర్తనానికి దోహదపడే విషయంలో హెచ్‌సీఎల్ టెక్ కట్టుబడి ఉందని రోష్నీ పేర్కొన్నారు.

ఏసీలు, ఎల్ఈడీల తయారీకి మరింత ఊతం

అక్టోబరు 12 వరకు పీఎల్ఐ దరఖాస్తులు

న్యూఢిల్లీ: ఏసీలు, ఎల్ఈడీ బల్బుల వంటి గృహోపయోగ వస్తువుల దేశీయ ఉత్పత్తిని మరింతగా ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే కంపెనీల కోసం కేంద్ర ప్రభుత్వం తాజాగా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 15 నుంచి అక్టోబరు 12 వరకు కంపెనీలు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే పీఎల్ఐ పథకం ప్రయోజనాలు పొందుతున్న సంస్థలు కూడా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కాకపోతే ఈ సంస్థలు ఇందుకోసం మరిన్ని పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ పథకం కింద ప్రోత్సాహకాలు అందుకుంటున్న సంస్థలు ఇక ఏడాదికి ఒకసారి కాకుండా, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది.

స్వల్ప నష్టాల్లో సూచీలు

సెన్సెక్స్ 36 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ర్యాలీ కొనసాగేందుకు దోహదపడే కొత్త అంశాలేమీ లేకపోవడంతో ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని ప్రదర్శించారు. దాంతో సోమవారం ప్రామాణిక ఈక్విటీ సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 264.77 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ మళ్లీ కాస్త తేరుకుని 36.22 పాయింట్ల నష్టంతో 79,960.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3.30 పాయింట్లు తగ్గి 24,320.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగం నష్టపోయాయి.

ఐపీఓ అప్‌డేట్స్

- అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఆమోదం తెలిపింది. గోల్డ్ ప్లస్ గ్లాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సిగల్ ఇండియా, ఓరియంట్ టెక్నాలజీస్ ఐపీఓ దరఖాస్తులను సైతం ఆమోదించింది.
- వ్యాపార రుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ ఎస్‌కే ఫైనాన్స్ రూ.2,200 కోట్ల ఐపీఓ దరఖాస్తును తాత్కాలికంగా పక్కకు పెట్టినట్లు సెబీ తెలిపింది. ఇందుకు కారణాలను మాత్రం వెల్లడించలేదు.
- ట్రక్ ఆపరేటర్ల డిజిటల్ ప్లాట్‌ఫామ్ జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.550 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 2.16 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.


ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ షేర్ల విభజన

హైదరాబాద్‌కు చెందిన సాక్స్ అండ్ కాటన్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ షేర్లను విభజించనుంది. మార్కెట్లో లిక్విడిటీతో పాటు షేర్‌హోల్డర్ల పరిధిని పెంచుకుందనేందుకు రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూపాయి ముఖవిలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

గ్లోబల్ చెస్ లీగ్‌లో అశ్విన్

న్యూఢిల్లీ: భారత ఆఫ్ స్పిన్నర్ ఆర్.అశ్విన్ గ్లోబల్ చెస్ లీగ్‌లోని అమెరికన్ గాంబిట్స్ ఫ్రాంచైజీలో సహ యజమానిగా మారాడు. టెక్ మహీం ద్రా, అంతర్జాతీయ చెస్ సమాఖ్య నిర్వహణలో జరుగుతున్న ఈ లీగ్ రెండో సీజన్ అక్టోబరు 3 నుంచి 12 వరకు లండన్‌లో జరుగుతుంది. తొలి సీజన్‌లో ఆడిన చింగారి గల్ఫ్ టైటాన్స్ వైదొలగడంతో అమెరికన్ గాంబిట్స్‌కు చోటు కల్పించారు. దీంట్లో అశ్విన్‌తో పాటు మరో ఇద్దరు యజమానులుగా ఉంటారు.

అతడితో ఐదేళ్లుగా మంధాన డేటింగ్!



బెంగళూరు: టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతీ మంధానాకు సంబంధించిన ఓ అనూహ్య విషయం బయటకు వచ్చింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో ఆమె ఐదేళ్లనుంచి రిలేషన్‌షిప్ కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని ముచ్చల్ స్వయంగా వెల్లడించాడు. తమ అనుబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఫొటోను అతడు ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. ఈ చిత్రానికి 'హృదయాల' ఎమోజీతో స్పందిస్తూ తమ రిలేషన్‌షిప్‌ను టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి ధ్రువీకరించింది. 'మై క్యూటీస్' అంటూ పలాష్ సోదరి పాలక్ ఆ ఫొటోపై వ్యాఖ్యానించింది. పలాష్, మంధాన డేటింగ్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలను వారు తొలిసారి ధ్రువీకరించారు.

ఎవరీ పలాష్ ముచ్చల్?

29 ఏళ్ల పలాష్ మ్యూజిక్ కంపోజర్, నటుడు. అశుతోష్ గోవారికర్ దర్శకత్వంలో వచ్చిన 'ఖేలే హమ్ జీ జాన్ సే' అనే చిత్రంలో అభిషేక్ బచ్చన్, దీపికా పదుకోన్‌తో కలిసి నటించాడు. రిక్షా, అర్థ్ అనే వెబ్ సిరీస్‌లను పలాష్ డైరెక్ట్ చేశాడు. పలాష్ అక్క పాలక్ ముచ్చల్ బాలీవుడ్ గాయని.

ఫైనల్ బెర్త్ ఎవరిదో?

స్పెయిన్ x ఫ్రాన్స్ 'యూరో' సెమీస్ నేడు

రా. 12.30 నుంచి సోనీలో..



మ్యూనిచ్: యూరోపియన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్స్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న స్పెయిన్.. రికార్డుస్థాయిలో నాలుగోసారి ఫైనల్ చేరాలనే పట్టుదలతో ఉంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి జరిగే తొలి సెమీస్‌లో మరో బలమైన జట్టు ఫ్రాన్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటి వరకు టోర్నీలో ఇరుజట్ల ప్రదర్శన భిన్నంగా సాగింది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ స్పెయిన్ విజేతగా నిలిచింది. క్వార్టర్స్‌లో పటిష్ట జర్మనీని ఓడించి సత్తా చాటింది. స్ట్రయికర్లు అల్వరో విలియమ్స్, ఓమ్నో, లామిన్ యమల్, అల్వరో మొరాటా ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు టోర్నీలో ఫ్రాన్స్ ఇప్పటి వరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. ఆ టీమ్ ఆటగాడు ఎవరూ నేరుగా ఒక్క గోల్ కూడా చేయలేదు. ఏవైనా గోల్స్ నమోదయ్యాయంటే అవి సెల్ఫ్ గోల్స్ లేదా పెనాల్టీ షూటౌట్‌ల ద్వారా వచ్చినవే. గాయపడిన స్టార్ ప్లేయర్ ఎంబప్పే దూకుడుగా ఆడలేకపోవడం కూడా మైనస్‌గా మారింది. క్వార్టర్స్‌లో పోర్చుగల్‌పై షూటౌట్‌లో నెగ్గింది. పైగా ఇటీవలి కాలంలో స్పెయిన్ చేతిలో ఫ్రాన్స్ కంగుతిన్న సందర్భాలే ఎక్కువ.

గెలవాల్సిందే!

సిరీస్ సమంపై హర్మన్ సేన దృష్టి

జోష్‌లో దక్షిణాఫ్రికా **రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18లో**

నేడు ఆఖరి టీ20



చెన్నై: దక్షిణాఫ్రికాతో వన్డే, టెస్టు సిరీస్‌లో పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శించిన భారత మహిళల జట్టు టీ20ల్లో మాత్రం వెనుకబడింది. ఇప్పటికే తొలి మ్యాచ్‌ను కోల్పోగా.. రెండో మ్యాచ్ వర్షార్పణమైంది. సఫారీల ఇన్నింగ్స్ సజావుగానే సాగినా.. భారత్ మాత్రం బరిలోకి దిగలేకపోయింది. అందుకే నేడు జరిగే ఆఖరి మ్యాచ్ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందానికి చావోరేవో లాంటిదే. ఈ మ్యాచ్ గెలిస్తేనే సిరీస్‌ను సమం చేసుకుని, ఓటమి లేకుండా మూడు ఫార్మాట్లనూ ముగించినట్టవుతుంది. ఇది జరగాలంటే వాతావరణం సహకరించడమే కాదు.. జట్టు బౌలింగ్ తీరు కూడా మారాల్సి ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో వీరి పేలవ ప్రదర్శనతో ప్రత్యర్థి 189, 177 పరుగులు చేసింది. పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ మినహా అంతా తేలిపోయారు. శ్రేయాంక, రాధా యాదవ్ చెరో వికెట్ తీసినా పరుగులు నియంత్రించలేకపోయారు. ఈనేపథ్యంలో సిరీస్ ప్రమాదంలో ఉంది కాబట్టి బౌలర్లు రాణించక తప్పదు. అటు బ్యాటింగ్‌లో ఓపెనర్ స్మృతి మంధాన, జెమీమా, హర్మన్ కీలకంగా మారారు. అయితే యువ ఓపెనర్ షఫాలీ ఆశించిన మేర ఆకట్టుకోలేకపోయింది. మరోవైపు దక్షిణాఫ్రికా తరఫున ఓపెనర్ బ్రిట్స్ రెండు హాఫ్ సెంచరీలతో ఫామ్‌లో ఉంది. వోల్వార్డ్, కాప్, బోష్ తమ వంతుగా పరుగులు సాధిస్తున్నారు. ఇదిలావుండగా మంగళవారం వర్షం కురిసే అవకాశం 40 శాతంగా ఉండడంతో ఈ మ్యాచ్‌కు ఆటంకం కలిగే అవకాశం లేకపోలేదు.

చెఫ్ డి మిషన్‌గా నారంగ్



పతాకధారిగా సింధు
పారిస్ ఒలింపిక్స్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత క్రీడా బృందానికి చెఫ్ డి మిషన్‌గా దిగ్గజ షూటర్ గగన్ నారంగ్ నియమితుడయ్యాడు. గతంలో మేరీకోమ్‌ను ఎంపిక చేసిన భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), ఆమె స్థానంలో గగన్ పేరును ప్రతిపాదించింది. ఆరంభ వేడుకల్లో భాగంగా జరిగే మార్చ్‌ఫాస్ట్‌లో భారత మహిళల బృందానికి పతాకధారిగా పీవీ సింధు పేరును ఐఓఏ ఖరారు చేసింది. వెటరన్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ శరత్‌కమల్‌తో కలిసి సింధు మార్చ్‌ఫాస్ట్‌లో భారత బృందాన్ని ముందుకు నడిపించనుంది. ప్రధాన పతాకధారిగా శరత్ పేరును ఐఓఏ ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక, చెఫ్ డి మిషన్‌గా ఉన్న మేరీకోమ్ అనూహ్యంగా ఆ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడంతో డిప్యూటీ చెఫ్ డి మిషన్‌గా ఉన్న గగన్‌ను ఆ పదవిలో నియమించామని ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష తెలిపింది.

వింబుల్డన్



గాఫ్ మరో 'సారీ'

నాలుగో రౌండ్‌లో ఓటమి
రెండో సీడ్‌కు షాకిచ్చిన నవారో
జ్వెరెవ్ కూడా ఇంటిబాట




లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ మహిళల విభాగంలో సంచలనాలపై సంచలనాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్న డిఫెండింగ్ చాంపియన్ ఒండ్రుసోవా, నిన్న టాప్‌సీడ్ స్వియటెక్ తిరుగుముఖం పడితే..ఈసారి రెండో సీడ్ కోకో గాఫ్ పోరాటం ముగిసింది. ఇక పురుషుల్లో నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ కూడా ఇంటిబాట పట్టాడు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అమెరికాకే చెందిన 19వ సీడ్ ఎమ్మా నవారో వరుస సెట్లలో 6-4, 6-3తో టైటిల్ ఫేవరెట్, అమెరికా స్టార్ కోకో గాఫ్‌కు షాకిచ్చింది. దాంతో ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో గాఫ్ మరోసారి నాలుగో రౌండ్ గండాన్ని దాటలేకపోయింది. గతంలో రెండుసార్లు (2019, 2021) ఆమె నాలుగో రౌండ్‌లోనే పరాజయం చవిచూడడం గమనార్హం. గాఫ్ ఓటమి దరిమిలా ఇక మహిళల సింగిల్స్‌లో టాప్-10 క్రీడాకారిణుల్లో ఇద్దరే బరిలో మిగిలారు. నాలుగో సీడ్ రిబకినా, ఏడో సీడ్ జాస్మిన్ పోలిని మాత్రమే పోటీలో ఉన్నారు. పోలిని ఇప్పటికే ప్రీక్వార్టర్స్ చేరగా..ప్రత్యర్థి కలిన్స్కయా వాకోవర్ ఇవ్వడంతో నాలుగో సీడ్ రిబకినా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టిన నవారో.. ఏడోసీడ్ పోలినితో అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్ ఇతర రౌండ్-16 మ్యాచ్‌లలో లులు సున్ 6-2, 5-7, 6-2తో లోకల్ స్టార్ ఎమ్మా రదుకానును ఓడించింది. ఈ విజయంతో లులు సున్ వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్ చేరిన తొలి న్యూజిలాండ్ క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఇతర మ్యాచుల్లో 13వ సీడ్ జెలెనా ఓస్టాపెంకో 6-2, 6-3తో పుతిన్‌త్సెవాపై, 21వ సీడ్ స్విటోలినా 6-2, 6-1తో వాంగ్ గ్జినుపై విజయం సాధించి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

జ్వెరెవ్‌కు టేలర్ ఝలక్

ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ జ్వెరెవ్‌కు నాలుగోరౌండ్లో అనూహ్య షాక్ తగిలింది. అమెరికాకు చెందిన 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 4-6, 6-7(7), 6-4, 7-6(3), 6-3తో జ్వెరెవ్‌కు ఝలకిచ్చి ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో రెండోసారి క్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు. ఇక, నాలుగో రౌండ్‌లో 9వ సీడ్ డిమినార్ 6-2, 6-4, 4-6, 6-3తో ఆర్థర్ ఫిల్స్‌పై, 27వ సీడ్ ముసేటి 4-6, 6-3, 6-3, 6-2తో పెరీకార్డ్‌పై నెగ్గారు.

ఎందుకీ వివక్ష?

మహారాష్ట్ర ప్రభుత్వంపై చిరాగ్ ఫైర్



న్యూఢిల్లీ: క్రికెట్టేతర క్రీడలపట్ల మహారాష్ట్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని టాప్ షట్లర్ చిరాగ్ షెట్టి విమర్శించాడు. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన టీమ్‌లోని ముంబైకర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్‌ను షిండే ప్రభుత్వం సన్మానించింది. అయితే, మిగతా క్రీడల పట్ల వివక్ష ప్రదర్శించడాన్ని డబుల్స్ టాప్ ప్లేయర్ షెట్టి తప్పుబట్టాడు. 2022లో భారత జట్టు ప్రతిష్ఠాత్మక థామస్ కప్‌ను నెగ్గినప్పుడు మహారాష్ట్ర ఆటగాడిగా తనను రాష్ట్ర ప్రభుత్వం గౌరవించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. 'ప్రభుత్వం ఇతర క్రీడలను చిన్నచూపు చూస్తోంది. థామస్ కప్ కూడా వరల్డ్‌కప్‌తో సమానం. రాష్ట్ర ప్రభుత్వం అన్ని క్రీడలను సమంగా చూడాల'ని అన్నాడు.

ఒక్కో క్రికెటర్‌కు రూ. 5 కోట్లు

బోర్డు ప్రైజ్‌మనీ పంపిణీ

ముంబై: టీ20 వరల్డ్‌కప్ విజేత భారత జట్టుకు బీసీసీఐ ప్రకటించిన రూ.125 కోట్ల నజరానాలో ఎవరికి ఎంత దక్కనుందో స్పష్టత వచ్చింది. ఈ మెగా టోర్నీ కోసం భారత జట్టు తరఫున మొత్తం 42 మంది వెళ్లగా, ఇందులో 15 మంది క్రికెటర్లకు రూ.5 కోట్ల చొప్పున అందనుంది. కోచ్ ద్రవిడ్‌తో పాటు బ్యాటింగ్, బౌలిం గ్, ఫీల్డింగ్ కోచ్‌లకు రూ.2.5 కోట్ల చొప్పున, 8 మంది సహాయక సిబ్బందికి రూ.2 కోట్ల చొప్పున ఇస్తారు. ఐదుగురు సెలెక్షన్ కమిటీ సభ్యులకు, నలుగురు రిజర్వ్ ఆటగాళ్లకు రూ. కోటి చొప్పున దక్కనుంది. ఇక, టీమ్ వీడియో విశ్లేషకుడు, మీడియా అధికారులు, లాజిస్టిక్స్ మేనేజర్ కూడా ప్రైజ్‌మనీలో భాగం కానున్నారు.

లంక తాత్కాలిక కోచ్‌గా జయసూర్య

కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు తాత్కాలిక కోచ్‌గా సనత్ జయసూర్యను ఎంపిక చేశారు. టీ20 వరల్డ్‌కప్‌లో జట్టు వైఫల్యంతో కోచ్ సిల్వర్‌వుడ్ రాజీనామా చేశాడు. త్వరలో భారత్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు లంక కోచ్‌గా జయసూర్య వ్యవహరిస్తాడు.

జగజ్జేతలకు మాల్దీవుల ఆహ్వానం

మాలె: టీ20 వరల్డ్‌కప్ విజేతగా నిలిచిన భారత్‌కు మాల్దీవులు రెడ్‌కార్పెట్ పరిచింది. పొట్టికప్ విజయోత్సవ సంబరాలను తమ దేశంలో నిర్వహించుకోవాల్సిందిగా ఆహ్వానం పంపింది. టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నామని ఆ దేశ పర్యాటక శాఖ తెలిపింది. కాగా, ప్రధాని నరేంద్ర మోదీని పరుషంగా విమర్శించడంతో.. ఆ దేశ పర్యాటకాన్ని నిషేధించాలన్న పిలుపు బలంగా వినిపించింది. దీంతో అక్కడకు వెళ్లే భారత టూరిస్టుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. మళ్లీ పర్యాటకులను ఆకర్షించాలన్న ఎత్తుగడతోనే టీమిండియాకు ఆహ్వానం పలికారని నెటిజన్లు విమర్శిస్తున్నారు.



సిరిసిల్లలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న బండి సంజయ్

కుల సంఘాల భవనాలతో నాయకులకే లాభం!

- కల్యాణ మండపాలు నిర్మిస్తే అందరికీ ఉపయోగకరం
- ఆ నిర్మాణాలకే ఎంపీ నిధులిస్తా: కేంద్ర మంత్రి సంజయ్

సిరిసిల్ల/హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాలకు కార్యాలయాలు నిర్మిస్తే ఆ సంఘంలోని నాయకులకే ఉపయోగపడుతుందని, కుల సంఘాల తరఫున కల్యాణ మండపాలు నిర్మిస్తే ఆ కులంలోని ప్రతి కుటుంబానికి ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. అలాంటి వాటికే ఎంపీ లాడ్స్ నిధులు కేటాయిస్తానని స్పష్టం చేశారు. ఏ కుల సంఘమైనా ఆ కులంలోని పేదలను ఆదుకున్నప్పుడే మనుగడ ఉంటుందన్నారు. మున్నూరు కాపు సంఘం చేపట్టే ప్రజా ఉపయోగ పనులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో ఎంపీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం సంజయ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారం, సమన్వయంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందించే బాధ్యతను తాను తీసుకుంటానని చెప్పారు. ఎన్నికలు అయిపోయినందున ఒకరినొకరు తిట్టుకోవడం బంద్ చేద్దామని, విమర్శలు, ఆరోపణలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెడదామని ఇతర పార్టీల నాయకులకు సూచించారు.

గురుకులాల పనివేళలు కుదించాలి.. సీఎంకు లేఖ

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు సంబంధించి కొత్తగా విడుదల చేసిన టైం టేబుల్ అశాస్త్రీయంగా ఉందని, దానిని వెంటనే సవరించాలని బండి సంజయ్ సూచించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఉదయం 5 నుండి రాత్రి 9.30 గంటల వరకు పని వేళలు, రాత్రి పూట కేర్ టేకర్ విధులను కూడా టీచర్లకు అప్పగించడం సరికాదన్నారు. తక్షణమే వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాగా, కరీంనగర్ జిల్లా పోలీసులకు నెలల తరబడి టీఏ, డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్ బిల్లులు చెల్లించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అన్ని జిల్లాలకు బకాయిలు చెల్లించిన ప్రభుత్వం.. కరీంనగర్ జిల్లా పోలీసులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

కార్మికుల వైద్య పరీక్షల్లో గోల్‌మాల్: సీపీఎం

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరుతో భారీ దోపిడీ జరుగుతోందని సీపీఎం ఆరోపించింది. ఎలాంటి టెండర్లు లేకుండానే గత ప్రభుత్వం ముంబైకి చెందిన సీఎ్‌సీ హెల్త్‌కేర్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చిందని పేర్కొంది. ఆరోగ్య పరీక్షలను నిర్వహించే ఏజెన్సీని మార్చి.. కార్మికుల సొమ్మును కాపాడాలని సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 2022లో సీఎస్‌సీ సంస్థతో ఒప్పందం చేసుకున్నాయన్నారు. ఒక్కో కార్మికుడికి పరీక్షల కోసం రూ.3256 చొప్పున చెల్లించేలా ప్రభుత్వం అనుమతిచ్చిందని తెలిపారు. దొంగ లెక్కలతో నిధులను కాజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 14 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉంటే 11 లక్షల మందికి పరీక్షలు నిర్వహించినట్లు లెక్కలు చెబుతున్నారన్నారు. స్థానికంగా ఉన్న డయాగ్నస్టిక్స్ సంస్థలను పక్కన పెట్టి ముంబై సంస్థతో ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఈ దోపిడీని అడ్డుకొని, ఏజెన్సీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పార్టీ వీడిన నేతలూ.. తిరిగి రండి

రాహుల్‌ను ప్రధానిని చేయాలన్నదే వైఎస్ లక్ష్యం.. అది నెరవేరకుండానే ఆయన దూరమయ్యారు

- ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు వైఎస్ అభిమానులు సంకల్పించాలి
- పని చేసినోళ్లకే నామినేటెడ్ పదవులిచ్చాం
- వైఎస్ జయంతి కార్యక్రమంలో రేవంత్ రెడ్డి
- అభివృద్ధికి వైఎస్ పునాదులు: భట్టి
- ఆత్మీయతను పంచి అందరి హృదయాల్లో స్థానం: కేవీపీ



గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో కేవీపీ, భట్టి, దీపాదాస్

హైదరాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని వీడిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు తిరిగి రావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయాలన్నదే వైఎస్ఆర్ లక్ష్యమని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండోసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఈ మేరకు ఆయన చేసిన వ్యాఖ్యలు ఇంకా తనకు గుర్తున్నాయని తెలిపారు. కానీ, రాహుల్ ప్రధాని కాకమునుపే వైఎస్ మనకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌ను ప్రధానిని చేయడానికి ఎవరైతే పూనుకుంటారో వారే నిజమైన వైఎస్ఆర్ అభిమానులని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు తెలంగాణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పంజాగుట్టలోని వైఎస్ విగ్రహానికి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైఎస్ సన్నిహితుడు కేవీపీ రామచంద్రరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ప్రజా భవన్లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ తర్వాత గాంధీ భవన్లో, సీఎల్పీలో కూడా వైఎస్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తొలుత మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్‌ను వీడిన వాళ్లంతా తిరిగి పార్టీలోకి రావాలంటూ పిలుపునిచ్చారు. ఆ తర్వాత మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. భట్టి విక్రమార్క పిలుపును నూటికి నూరు శాతం సమర్థిస్తున్నానని, వైఎస్‌ను అభిమానించే నాయకులంతా తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని కోరారు. "అందరం కలిసి దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి రాహుల్‌ను ప్రధానిని చేయడానికి కృషి చేద్దాం. దేశంలో సంక్షేమం అంటే గుర్తుకు వచ్చే పేరు వైఎస్ఆర్. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు స్ఫూర్తి కూడా ఆనాడు వైఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలే. మూసీ ప్రక్షాళన, మెట్రో రైల్, హైదరాబాద్‌లో పెట్టుబడులకు కూడా వైఎస్ఆరే స్ఫూర్తి. దానిని మా ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుంది. చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు ఆనాడు వైఎస్ చేసిన పాదయాత్రనే భారత్ జోడో యాత్రకు స్ఫూర్తి. ఆ పాదయాత్ర ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే.. రాహుల్ భారత్ జోడో యాత్ర తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చింది"అని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ రాణిస్తున్న తీరు చూస్తుంటే ప్రధాని పదవికి ఆయన ఒక అడుగు దూరంలో ఉన్నారని అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. వైఎస్ 75వ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు రాహుల్‌ను ప్రధానిని చేయాలన్న ప్రతిజ్ఞను తీసుకోవాలన్నారు. మూడేళ్లలో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నామని, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి పని చేసిన 35 మంది నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చామని తెలిపారు. ఎలాంటి పైరవీలు లేకుండా పార్టీ కోసం పని చేసిన, త్యాగం చేసిన వారికే వీటిని ఇచ్చామన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేయడానికి అప్పట్లో వైఎస్ఆర్ వేసిన పునాదులే కారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్టుతోపాటు ఆయన కల్పించిన మౌలిక సదుపాయాలు ఇప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో ఉండేలా చేశాయని కొనియాడారు. రాబోయే రెండు దశాబ్దాలూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుందని అన్నారు. వైఎస్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజల కోసం మరోమారు కలిసి పని చేద్దామని సూచించారు. వైఎస్ఆర్ దూరమై దశాబ్దంన్నర అయినా దేశంలో ఆయన పాదముద్రలు కనిపిస్తున్నాయని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సరే.. దేశమంతా ఆశ్చర్యపడేలా ఆగస్టు 15కల్లా రుణమాఫీని అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ వైఎస్ వంటి గొప్ప మనిషిని తాను చూడలేదని, ఇన్నేళ్లు అయినా ప్రజల గుండెల్లో నిలిచిపోవడం గొప్ప విషయమని అన్నారు. 1999లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 26 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, పాదయాత్ర చేసి పార్టీని వైఎస్ 2004లో అధికారంలోకి తీసుకొచ్చారని ఆయన సన్నిహితుడు కేవీపీ రామచంద్రరావు చెప్పారు. పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని, కార్యకర్తలకు మనో ధైర్యాన్ని ఇవ్వడమే కాకుండా ఆత్మీయతా భావాన్ని పంచి అందరి హృదయాల్లో స్థానం సంపాదించారని కొనియాడారు.

ప్రజా భవన్‌లో వైఎస్ఆర్ ఫొటో ఎగ్జిబిషన్

వైఎస్ జయంతి సందర్భంగా ప్రజా భవన్‌లో రాజశేఖర్‌రెడ్డి ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. దీనిని సీఎం రేవంత్ రెడ్డి, దీపాదాస్ మున్షీ, కేవీపీ రాంచందర్ రావు, పార్టీ ఇతర ముఖ్య నేతలు తిలకించారు. వైఎ్‌సతో తమకున్న అనుభవాలను నాయకులు పంచుకున్నారు. ఆనాడు వైఎస్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొన్న భట్టి విక్రమార్క.. దానికి సంబంధించిన ఫొటోలను చూపిస్తూ ఆనాటి సంఘటనలను వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాదయాత్రకు ప్రజల నుంచి వచ్చిన ఆదరణను గుర్తు చేశారు. కాగా.. వైఎస్ జయంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

భారత్ జోడో యాత్రకు వైఎస్ పాదయాత్రే స్ఫూర్తి

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాను చేపట్టిన భారత్ జోడో యాత్రకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రే స్ఫూర్తి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఆయన నుంచి వ్యక్తిగతంగా తాను చాలా నేర్చుకున్నానని చెప్పారు. ఎండలో, వానలో వైఎస్ నడుస్తున్న దృశ్యాలు తనకు గుర్తున్నాయని, ఆయన పాదయాత్ర నుంచే కొన్ని ఐడియాలు తీసుకుని భారత్ జోడో యాత్రల్లో పొందుపరిచానని తెలిపారు. వైఎస్ జయంతి సందర్భంగా సోమవారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. వైఎస్ నిజమైన ప్రజానాయకుడని.. ఆంధ్రప్రదేశ్ ప్రజల బాధలను గ్రహించి, వారిని నమ్మి, వారి కోసమే జీవించారని తెలిపారు. వైఎస్ మరణం తీరని లోటని.. ఆయన బతికుంటే ఆంధ్రప్రదేశ్ నేడు ఎదుర్కొంటున్న విషాదాలు, కష్టాలు ఉండేవి కావని.. పూర్తిగా భిన్నమైన రాష్ట్రంగా ఉండేదని వ్యాఖ్యానించారు. వైఎస్ కుమార్తె షర్మిల తనకు బాగా తెలుసని.. తండ్రి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తారని, కాంగ్రెస్‌ను రాష్ట్రంలో బలోపేతం చేయగల సత్తా ఆమెకు ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నేత వైఎస్ఆర్ అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దయాగుణం, దూరదృష్టి ఉన్న వైఎస్ తన పాలనలో విన్నూత పథకాలు ద్వారా ఏపీ ప్రజల జీవితాలపై చెరగని ముద్రవేశారని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

2029లో షర్మిలే ఏపీ సీఎం

- ఉప ఎన్నిక వస్తే ఊరూరా తిరుగుతా
- కడప నుంచే కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం
- వైఎస్ జయంతి సభలో సీఎం రేవంత్
- బీజేపీతో పొత్తు పెట్టుకున్నవారు వైఎస్ వారసులా?: షర్మిల



మంగళగిరిలో నిర్వహించిన వైఎస్ జయంతి సభలో సీఎం రేవంత్, మంత్రులు భట్టి, పొంగులేటి, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

అమరావతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్‌కు దెబ్బ తగిలిన కడప జిల్లా నుంచే జెండా ఎగురవేద్దాం.. ఉప ఎన్నిక వస్తుందని ప్రచారం జరుగుతోంది.. వస్తే షర్మిల తరఫున ఊరూరా తిరిగే బాధ్యత నాదే.." అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏపీలో ప్రతిపక్షం లేదని, ప్రజల తరఫున ఆ పాత్ర పోషించేది పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మాత్రమేనని అన్నారు. ఆమెకు తోడుగా, ఏపీలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా తాము ఉంటామన్నారు. వైఎస్ జయంతిని పురస్కరించుకుని సోమవారం మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్‌లో సభ నిర్వహించారు. సీఎంతోపాటు మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఏపీలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సర్పంచ్‌ను కూడా గెలిపించుకోలేని స్థితిలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ముళ్లబాటను ఎంచుకున్న షర్మిల.. 1999లో తన తండ్రి ప్రతిపక్ష నేతగా పోరాడిన స్ఫూర్తితో ఏపీ ప్రజల తరఫున కొట్లాడతారని అన్నారు. 1984లో పోరాటం మొదలు పెట్టిన వైఎస్ 2004లో సీఎం అయ్యారని, తండ్రిని కోల్పోయి అనివార్య పరిస్థితుల్లో 2009లో రాజకీయ ప్రవేశం చేసిన షర్మిల 2029లో ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. 2007లో శాసన మండలిలో మొదటిసారి అడుగు పెట్టిన తాను ముందు రోజు రాత్రంతా ప్రజా సమస్యలపై ప్రిపేరై మరుసటి రోజు ప్రస్తావిస్తే వైఎస్ ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. ఏళ్ల తరబడి కష్టపడినా పదవి రాలేదని ఎన్నడూ పార్టీని వదల్లేదని, 2004 పాదయాత్రతో అధికారంలోకి వచ్చారని చెప్పారు.

నిత్యం ప్రజల కోసమే నాన్న (వైఎస్) తపన పడేవారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఏళ్ల తరబడి రాజకీయాల్లో ప్రజల తరఫున పనిచేసిన ఆయన.. ముఖ్యమంత్రి అయ్యాక మరింత బాధ్యతతో పని చేశారని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ తోనే మంచి జరుతుందని విశ్వసించే తన తండ్రికి మత రాజకీయాలు చేసే బీజేపీ అంటే అసలు గిట్టదని, అదే బీజేపీతో తెరవెనుక రాజకీయాలు చేసే నాయకులు (జగన్) వైఎస్‌కు వారసులు ఎలా అవుతారని ప్రశ్నించారు. వైఎస్ తనకు ఆదర్శమంటూ పాదయాత్రలో చెప్పిన రాహుల్ పార్లమెంటులో మోదీని నిలదీస్తున్న తీరు చూస్తుంటే భావి ప్రధాని కనిపించాడని వ్యాఖ్యానించారు.

టీడీపీని ముందు పెట్టి బీజేపీ రాజకీయం

ఏపీలో ఆడిన పొలిటికల్ గేమ్‌ను ఇక్కడా స్టార్ట్ చేయాలని చూస్తున్నారు

- విభజన సమస్యల పేరుతో చంద్రబాబు తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చిండు
- బీజేపీ డైరెక్షన్‌లో బాబు, పవన్ కల్యాణ్ పని చేస్తున్నరు
- కాంగ్రెస్ కార్యకర్తలూ అలర్ట్‌గా ఉండండి
- బీజేపీ ఎన్ని వ్యూహాలు చేసినా కాంగ్రెస్ కార్యకర్తల శక్తిని చంపలేదు: జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ.. టీడీపీని ముందు పెట్టి రాజకీయాలను మొదలు పెట్టిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ఏపీలో ఆడిన పొలిటికల్ గేమ్‌నే తెలంగాణలోనూ ఆడాలని చూస్తోందన్నారు. బీజేపీ ఎన్ని వ్యూహాలు పన్నినా.. కాంగ్రెస్ కార్యకర్తల శక్తిని చంపలేదన్నారు. అయినా రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు.. కొన్ని సందర్భాల్లో బలపడటం, కొన్ని సందర్భాల్లో బలహీనపడటం సహజమన్నారు. ఉత్తర భారత దేశంలో బీజేపీకి బలం తగ్గడంతో ఆ పార్టీ దక్షిణాదిన ఏపీ, తెలంగాణ, కర్ణాటకపై దృష్టి పెట్టిందన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో ఫలితాలే కేంద్రంలో బీజేపీకి అధికారాన్ని తెచ్చి పెట్టాయని విశ్లేషించారు. ఈ మూడు రాష్ట్రాల్లోనూ ఎన్డీయే బలహీనపడి ఉంటే ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి ఉండేదన్నారు. ఏపీలో పరోక్షంగా జగన్‌ను మెయింటైన్ చేస్తూ, పవన్ కల్యాణ్‌ను ముందు పెట్టి చంద్రబాబును కంట్రోల్‌లో తెచ్చుకున్న బీజేపీ.. ఆ రాష్ట్ర రాజకీయాల్లో నాలుగు స్తంభాల ఆట నడిపించిందన్నారు. ఆ ఆటలో కాంగ్రెస్ పార్టీని అక్కడ లేవకుండా చేస్తోందన్నారు. ఏపీలో అసలు పట్టే లేని బీజేపీ.. మూడు సీట్లు గెలుచుకుందని గుర్తు చేశారు. ఏపీలో మాదిరిగానే ఇక్కడా పొలిటికల్ గేమ్‌ను బీజేపీ స్టార్ట్ చేసిందన్నారు. అక్కడ పవన్ కల్యాణ్‌ను ముందు పెట్టి రాజకీయం చేస్తే.. ఇక్కడ టీడీపీని ముందు పెట్టి రాజకీయం మొదలు పెట్టిందన్నారు. పదేళ్ల తర్వాత పొలిటికల్‌గా తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చిన చంద్రబాబు.. బీజేపీ డిజైన్‌లో పని చేస్తున్నారని, దీనికి మద్దతుగా పవన్ కల్యాణ్ పని చేస్తున్నరన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి డౌన్ అయిన కేసీఆర్.. బీజేపీతో కొట్లాడాలని చూస్తారా? లేదంటే జైల్లో ఉన్న కూతురిపై ప్రేమతో మోదీ, అమిత్ షా చెప్పింది విని... తెలంగాణలో బీజేపీ ఆడుతున్న పొలిటికల్ గేమ్‌లో నాలుగో స్తంభంగా మారుతారా? అన్నది చూడాలన్నారు. గతంలో చంద్రబాబు హైదరాబాద్‌కు వచ్చి పోయేది కూడా ఎవ్వరికీ తెలియకపోయేదన్నారు. విభజన సమస్యల పేరుతో తెలంగాణ గడ్డపైన చంద్రబాబు ఎంట్రీ ఇచ్చారన్నారు. రాజకీయంగా ఇష్టం లేకున్నా విభజన సమస్యలు ఉన్నాయి కాబట్టి తమ ముఖ్యమంత్రి ఆయనతో భేటీ కావాల్సి వచ్చిందన్నారు. ఆ భేటీ ముగిసిన తర్వాత.. చంద్రబాబు తన అసలు రంగు బయటపెట్టారన్నారు. రెండు రాష్ట్రాలు.. రెండు కళ్లన్న సంగతి చంద్రబాబుకు మళ్లీ గుర్తుకు వచ్చిందన్నారు. నామినేటెడ్ పదవులకు యోధుడు పోటీ పడడని, యుద్ధం చేసే గెలుస్తాడని చెబుతూ సంగారెడ్డి ప్రజలు తనను మళ్లీ గెలిపించుకుని రాజును చేస్తారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈడీ, సీబీఐ కేసుల్లో ఉన్నవారిని బీజేపీలోకి తీసుకోబోమని బండి సంజయ్ మాట్లాడుతున్నారని, ఇప్పటికే ఆ కేసులు ఉన్నవారిని ఆ పార్టీ చేర్చేసుకుందన్నారు. బీజేపీ ఇంకా నిలబడుతుందంటే.. ఈడీ, సీబీఐ, ఐటీల వల్లనేనన్నారు. వీటిని ఉపయోగించకపోతే రాహుల్ ప్రధాని అయ్యేవారని పేర్కొన్నారు.

సభాపతికి ఆదేశాలు ఇవ్వడం సాధ్యంకాదు

- ఆ అధికారాల పరిధిలో జోక్యం చేసుకోకూడదు
- ఎమ్మెల్యేల ఫిరాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం వాదన

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలన్న అంశంపై సోమవారం మరోసారి హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను పరిష్కరించాలంటూ అసెంబ్లీ స్పీకర్‌కు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వలేదని తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని గుర్తు చేసింది. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ సభాపతి పరిశీలనలో ఉన్న అనర్హత పిటిషన్లను పరిష్కరించాలంటూ హైకోర్టు నిర్దేశించజాలదని తెలిపారు. అలా ఆదేశిస్తే అది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్‌గా విశేష అధికారాలు ఉన్న స్పీకర్ అధికార పరిధిలో జోక్యం చేసుకోవడమే అవుతుందని పేర్కొన్నారు. స్పీకర్‌కు అనర్హత పిటిషన్‌లు ఇచ్చి పదిరోజులు పూర్తికాకముందే హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. అడ్వకేట్ జనరల్ సుదీర్ఘంగా వాదనలు కొనసాగించడంపై బీఆర్ఎస్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు అభ్యంతరం చెప్పారు. మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం పార్టీ మారే వరకు ఏజీ వాదనలు కొనసాగిస్తూనే ఉంటారని చలోక్తులు విసిరారు. త్వరగా విచారణ పూర్తిచేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది.

సాధారణ బదిలీలు ఆపొద్దు: ఏఈఈల సంఘం

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను అనుసరించి, నీటిపారుదలశాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టాలని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల(ఏఈఈ) సంఘం ప్రభుత్వాన్ని కోరింది. 10-12 ఏళ్లుగా బదిలీలు జరగలేదని పేర్కొంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి, వినతిపత్రాన్ని అందించింది. వెంటనే స్పందించిన మంత్రి... ఈఎన్‌సీ(అడ్మిన్)కు అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. ఏఈఈల సీనియారిటీ జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఏఈఈల నుంచి డిప్యూటీఈఈల దాకా పదోన్నతులు కల్పించడానికి వీలుగా తక్షణమే శాఖపరమైన పదోన్నతుల కమిటీ(డీపీసీ) ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం పదోన్నతుల ప్రక్రియను చేపడతామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.

డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేయాలి

- 25 వేల పోస్టులతో ప్రకటించాలని నిరుద్యోగుల డిమాండ్

ఖైరతాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేయాలని, పీఆర్సీ నివేదికల ప్రకారం ఖాళీగా ఉన్న 25వేల టీచర్ పోస్టులతో ప్రకటించాలని కోరుతూ నిరుద్యోగులు పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. బీసీ సంక్షేమ సంఘం, నిరుద్యోగ జేఏసీల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పలు జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగులు పాల్గొన్నారు. వీరికి రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ మద్దతు తెలిపి వారితో పాటు అరెస్టయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ డీఎస్సీని కేవలం 11వేల టీచర్ పోస్టులకు నిర్వహించడం సరికాదని, ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 25 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. పోలీసులు అరెస్టయిన వారిని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అమాయక ప్రజలపై సర్కారు కక్ష

- పీర్జాదిగూడలో ఇళ్లను కూల్చేయడం దారుణం
- మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రోద్బలంతో దుశ్చర్య
- ఆ స్థలాలను ఎప్పుడో క్రమబద్ధీకరించాం: కేటీఆర్



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతోందని, అలాంటి వాటిని వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో ప్రజలు కట్టుకుంటున్న ఇళ్లను అక్రమంగా కూల్చారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కాంగ్రెస్ నాయకులు అమ్మిన, కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ఇళ్లను మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఏం ఆశించి కూలగొట్టించారో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా..? అని ప్రశ్నించారు. రేవంత్‌కు అన్నగా ప్రచారం చేసుకుంటూ సుధీర్‌రెడ్డి చేస్తున్న అరాచకాలపై ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోవాలని సీఎంను కోరారు. కాంగ్రెస్ నాయకులు రాందాస్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ అమర్‌సింగ్ కుటుంబం అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మారని, వీటిని రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని గుర్తు చేశారు. గతంలో రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా ఎన్వోసీ జారీ చేశారని తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 118జీవో పరిధిలోకి చేర్చి ప్లాట్ యజమానులకు మేలు చేసిందని పేర్కొన్నారు. ఈ విషయంలో అక్కడి మేయర్ జక్క వెంకట్‌రెడ్డిని, కార్పొరేటర్లను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని తెలిపారు.

భోజన బిల్లులు 5 నెలలుగా పెండింగ్

- కోడిగుడ్ల బిల్లులూ రావట్లేదు..
- బడికి ఉచిత విద్యుత్ ఏమైంది?: హరీశ్



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో నెలకొన్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తే.. అసలు సమస్యలే లేవన్నట్లుగా విద్యా శాఖ ప్రకటించడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. వాస్తవాలను మరుగున పెడితే ఎలా..? అని ప్రశ్నించారు. ఇవే సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయని నిర్ధారించేందుకు తన నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన తర్వాత.. తాను గుర్తించిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు హరీశ్‌రావు వెల్లడించారు. వంట మనిషితో పాటు సహాయకులుగా పని చేసే వారికి చెల్లించే రూ.3 వేల గౌరవ వేతనం గతేడాది డిసెంబరు వరకే వచ్చిందని.. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చ్, ఏప్రిల్, జూన్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 9, 10 తరగతులకు సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు జనవరి వరకు మాత్రమే వచ్చాయని, ఆ తర్వాత నాలుగు నెలలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు సంబంధించిన మధ్యాహ్న భోజన బిల్లులు ఏప్రిల్ వరకు వచ్చాయని, జూన్ నెల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. కోడిగుడ్డు బిల్లులు జనవరి వరకు మాత్రమే వచ్చాయని, ఫిబ్రవరి, మార్చ్, ఏప్రిల్, జూన్ నెలలకు సంబంధించి బిల్లులు రాలేదని చెప్పారు. సర్వశిక్ష అభియాన్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ల వేతనాలు మే వరకే వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని, పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.10 వేలు విడుదల చేయాలని, నిలిచిపోయిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు.

35 మందికి నామినేటెడ్ పదవులు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వాస్తవానికి 37 కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లను నియమిస్తూ ప్రభుత్వం మార్చి 15నే జీవోలు సిద్ధం చేసింది. కానీ, ఆ సమయంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలై.. కోడ్ అమల్లోకి రావడంతో జీవోల జారీని నిలిపివేసింది. దీంతో ఈ పదవులకు ఎంపికైన వారు అధికారిక ఉత్తర్వుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. ఇదే సమయంలో నాటి జాబితాలో కొందరి ఎంపికపై నేతల నుంచి అభ్యంతరాలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ విషయాన్ని సీఎం రేవంత్.. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి.. నియామకాలను ఖరారు చేశారు. ఈ మేరకు 35 మంది నియామకాలపై ప్రభుత్వం జీవోలను జారీ చేసింది. చైర్‌పర్సన్లుగా నియమితులైన వారందరి పదవీకాలం బాధ్యతలు స్వీకరించిన దగ్గర్నుంచి రెండేళ్లపాటు ఉంటుందని పేర్కొంది. ఈ 35 సంస్థల్లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ కూడా ఉన్నాయి. కాగా, పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీ ఐఐసీ) చైర్మన్‌గా టి.నిర్మలా జగ్గారెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య సహా దాదాపు అందరికీ ఇంతకుముందు ప్రకటించిన కార్పొరేషన్ల బాధ్యతలనే అప్పగించారు.

అభ్యంతరాలు.. మార్పులు

మార్చి నెలలో చేపట్టిన 37 మంది నియామకాల్లో.. మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద, శాతవాహన డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కె.నరేందర్‌రెడ్డి ఎంపికపై మంత్రి పొన్నం ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా వెంకట్రామిరెడ్డి ఎంపికపై మంత్రి కొండా సురేఖ అభ్యంతరం చెప్పినట్లు ప్రచారం జరిగింది. దీంతోపాటు బాల్కొండ నియోజకవర్గ పరిధిలో ముగ్గురు నేతలను నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయడంపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్.జగదీశ్వర్‌రావును ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఎంపిక చేయగా.. ఆయన దానికి బదులుగా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ఇటీవల ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క భేటీ సందర్భంగా చర్చ జరిగింది. జాబితాలో మార్పులు చేపడితే గందరగోళానికి దారితీసే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో అవే పేర్లతో నియామక ఉత్తర్వులు జారీ చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. జగదీశ్వర్‌రావు.. ఎమ్మెల్సీ సీటునే కోరుకుంటుండడంతో ఆయన స్థానంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబును నియమించారు. వాస్తవానికి విజయ్‌బాబును హౌసింగ్ ఫెడరేషన్‌కు చైర్మన్‌గా నియమించాలనుకున్నారు. ఇక జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను తొలుత డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఆ తర్వాత ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు కావడంతో సామాజికవర్గం రీత్యా ఆయనను ఆ పోస్టులో నియమించారు. అలాగే ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముందుగా కోతక్ నాగును అనుకుని.. తాజా ఉత్తర్వుల్లో కోట్నాక తిరుపతిని నియమించారు. ఇక మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద నియామకానికి సంబంధించి గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయాల్సి ఉంది.

బాధ్యతలు స్వీకరించిన పలువురు

నియామక ఉత్తర్వులు వెలువడిన వెంటనే పలువురు బాధ్యతలు స్వీకరించారు. ఫుడ్ కార్పొరేషన్ ఎండీగా ఎంఏ ఫహీం, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మెట్టు సాయికుమార్, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మల్‌రెడ్డి రాంరెడ్డి, టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా మన్నె సతీశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

18 పోస్టులు అగ్రకులాలకే

వివిధ కార్పొరేషన్లు, సంస్థలకు చైర్‌పర్సన్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ 35 మందిలో 18 మంది అగ్రకులాలకు చెందినవారే ఉన్నారు. వీరిలో 12 మంది రెడ్డి, ముగ్గురు కమ్మ సామాజికవర్గానికి చెందినవారు ఉండగా, వెలమ, వైశ్య, బ్రాహ్మణ సామాజికవర్గాలకు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ఇక ఎస్టీలకు మూడు, ఎస్సీలకు ఒకటి చొప్పున పదవి దక్కింది. ముస్లిం వర్గానికి మూడు పదవులు దక్కాయి. బీసీల్లో గౌడ సామాజికవర్గానికి నాలుగు పదవులు, ముదిరాజ్, మున్నూరుకాపు సామాజికవర్గాలకు రెండు చొప్పున, పద్మశాలి, లింగాయత్, వడ్డెర సామాజికవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున లభించాయి. అయితే కొద్ది రోజుల్లోనే మరిన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ కానున్నాయని, సామాజిక కూర్పులో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిలో సరిదిద్దుతామని పార్టీ నాయకత్వం చెబుతోంది.

కార్పొరేషన్ల చైర్మన్లు వీరే..

కార్పొరేషన్/ఫెడరేషన్/అథారిటీ/అకాడమీ పేరు	చైర్‌పర్సన్
విత్తనాభివృద్ధి సంస్థ	ఎస్.అన్వేశ్‌రెడ్డి
వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధి సంస్థ	కాసుల బాలరాజు
సహకార నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య	జంగా రాఘవరెడ్డి
కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్	మానాల మోహన్‌రెడ్డి
గిడ్డంగుల సంస్థ	రాయల నాగేశ్వరరావు
ముదిరాజ్ సహకార సొసైటీల కార్పొరేషన్	జ్ఞానేశ్వర్ ముదిరాజ్
ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీల సమాఖ్య	మెట్టు సాయికుమార్
గ్రంథాలయ పరిషత్	ఎండీ రియాజ్
అటవీ అభివృద్ధి సంస్థ	పొదెం వీరయ్య
ఆర్య వైశ్య కార్పొరేషన్	కాల్వ సుజాత
పోలీసు గృహ అభివృద్ధి సంస్థ	ఆర్.గురునాథ్‌రెడ్డి
సెట్విన్	ఎన్.గిరిధర్‌రెడ్డి
కనీస వేతనాల సలహా మండలి	జనక్ ప్రసాద్
సాగునీటి పారుదల అభివృద్ధి సంస్థ	ఎం.విజయబాబు
హస్తకళల అభివృద్ధి సంస్థ	నాయుడు సత్యనారాయణ
ఖనిజాభివృద్ధి సంస్థ	ఈరవత్రి అనిల్
పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ	టి.నిర్మలా జగ్గారెడ్డి
ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్	అయిత ప్రకాశ్‌రెడ్డి
టెక్నాలజీ సర్వీసెస్ డెలప్‌మెంట్ కార్పొరేషన్	మన్నె సతీశ్‌కుమార్
పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ	చల్లా నర్సింహారెడ్డి
శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ	కె.నరేందర్‌రెడ్డి
కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ	ఇ.వెంకట్రామిరెడ్డి
రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్	మల్‌రెడ్డి రాంరెడ్డి
పర్యాటక అభివృద్ధి సంస్థ	పటేల్ రమేశ్‌రెడ్డి
ఫుడ్స్ కార్పొరేషన్	ఎంఏ ఫహీం
మహిళా సహకార అభివృద్ధి సంస్థ	బండ్రు శోభారాణి
వికలాంగుల సహకార అభివృద్ధి సంస్థ	ఎం.వీరయ్య
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్	కె.శివసేనారెడ్డి
సంగీత నాటక అకాడమీ	పుంజాల అలేఖ్య
ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ	ఎన్.ప్రీతమ్
బీసీ సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ	నూతి శ్రీకాంత్
ఎస్టీ సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ	బెల్లయ్య నాయక్
గిరిజన సహకార సంస్థ(జీసీసీ)	కోట్నాక్ తిరుపతి
ఎంబీసీ అభివృద్ధి సంస్థ	జెరిపేటి జైపాల్
అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ(వైస్ చైర్మన్)	ఎంఏ జబ్బార్

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జులై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సుంకెట అన్వేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యులు ఎం. కోదండరెడ్డి, తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ పాల్గొని అన్వేష్ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీడ్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా తయారు చేస్తామని చెప్పి రైతులకు విత్తనాలు దొరకని పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విత్తనాభివృద్ధి సంస్థకు జీవం పోసి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.



సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వేష్ రెడ్డిని అభినందిస్తున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండ రెడ్డి

పింఛన్ దరఖాస్తుల లెక్కతీయండి

- వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేయండి
- సమీక్షలో ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

హైదరాబాద్, జులై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పింఛన్ల దరఖాస్తులకు త్వరలో మోక్షం లభించనుంది. ఈ మేరకు పింఛన్ల కోసం గత ప్రభుత్వ హయాంలో వచ్చిన, కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత అందిన దరఖాస్తులపై మంత్రి సీతక్క ఆరా తీశారు. వచ్చిన దరఖాస్తుల నుంచి అర్హుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని సెర్ప్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్), మహిళా శిశు సంక్షేమ శాఖపై ఆమె సమీక్షించారు. ప్రస్తుతం సెర్ప్ ద్వారా అమలవుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడంతో కేంద్రం పథకాలను వినియోగించుకోలేక పోయామని అధికారులు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మ్యాచింగ్ గ్రాంట్లకు నిధులు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేంద్రం పథకాలను వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. వచ్చే బడ్జెట్‌లో మహిళాశక్తికి అవసరమైన నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అభయహస్తం పథకాన్ని అమలు చేయకుండా, మహిళల పొదుపు సొమ్మును గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని విమర్శించారు. సంబంధిత వివరాలను వెంటనే అందించాలని ఆదేశించారు. కాగా, రాష్ట్రంలో కొన్ని అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యత లేని గుడ్లు పంపిణీ కావడంపై సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లతోపాటు ఇతర వస్తువుల నాణ్యతపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు అందించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు ఎవరైనా నాసిరకం వస్తువులు సరఫరా చేస్తే తిరస్కరించాలని, లేని పక్షంలో సంబంధిత అంగన్‌వాడీ టీచర్, సిబ్బందిని బాధ్యుల్ని చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంట్రాక్టు గడువును గత ప్రభుత్వం రెండేళ్లకు పెంచడం వల్లే కొందరు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని, దీనిని తగ్గించేందుకు కసరత్తు చేయాలని సూచించారు.

పెద్దాస్పత్రులకు సీఎస్ఆర్ నిధులివ్వండి!

- ఫార్మా సంస్థలను కోరిన మంత్రి దామోదర
- 12 కంపెనీల ప్రతినిధులతో సమావేశం

హైదరాబాద్, జులై 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించే విషయంలో ఫార్మా సంస్థలు సహకరించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. ఈ పెద్దాస్పత్రుల్లో పారిశుధ్యం, భద్రత, రోగుల సంరక్షణ, ఆహారం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు వంటి సదుపాయాలతోపాటు రోగులకు ఉత్తమ వైద్య సేవలందించడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. సోమవారం ఆయన రాష్ట్రానికి చెందిన 12 ప్రముఖ ఫార్మా కంపెనీల 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)' విభాగ అధిపతులతో సచివాలయంలో సమావేశం అయ్యారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల బలోపేతానికి ఫార్మా కంపెనీలు సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవలు, ఆస్పత్రుల పరిసరాల పరిశుభ్రత, రోగులకు నాణ్యమైన భోజనం వంటి వాటికి సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని చెప్పారు. దీనిపై ఫార్మా కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. వారంలో తమ బృందాలతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను సందర్శిస్తామని.. క్షేత్రస్థాయి పర్యటనలో ప్రాధాన్యాంశాలపై నివేదికను సమర్పిస్తామని చెప్పారు. వైద్యశాఖలో బదిలీలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని మంత్రి దామోదర ఆదేశించారు. సర్కారు ఇచ్చిన జీవో నంబరు 80లో పేర్కొన్న నిబంధనలను పాటించాలని విభాగాధిపతులకు సూచించారు.

రాష్ట్రంలోని జాతీయ రహదారులపై.. కేంద్ర, రాష్ట్ర అధికారుల సమీక్ష నేడు..?

- ఆర్‌ఆర్‌ఆర్, హైదరాబాద్-విజయవాడ రోడ్డు విస్తరణ..
- మరికొన్ని జాతీయ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజెక్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రహదారుల శాఖ అధికారులు మంగళవారం సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం. ఈ మేరకు కేంద్రం నుంచి తెలంగాణకు ప్రత్యేక అధికారుల బృందం రానున్నట్టు తెలిసింది. సమావేశంలో ప్రధానంగా రీజినల్ రింగ్ రోడ్డు ప్రస్తుత పరిస్థితి.. ఈ రహదారికి నేషనల్ హైవే నంబర్ కేటాయింపు, నిర్మాణ ఖర్చు, భూసేకరణ, పరిహారం అంశాలపై చర్చ జరగనుంది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ దాదాపు 90శాతం పూర్తయిన నేపథ్యంలో రహదారి నిర్మాణానికి టెండర్లకు వెళ్లే అంశంపై కూడా అధికారుల బృందం చర్చించనున్నట్టు తెలిసింది. ఇక దక్షిణ భాగాన్ని కూడా జాతీయ రహదారిగా గుర్తించడంతో పాటు, దాని నిర్మాణానికి అవసరమైన డీపీఆర్, నిర్మాణ వ్యయం, ఈ భాగానికి నేషనల్ హైవే నంబర్ కేటాయింపు సహా మరికొన్ని అంశాలపై చర్చించనున్నారు. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) రహదారి విస్తరణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియపై కూడా చర్చ జరగనుంది. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయి దాదాపు 7 ఏళ్లు అవుతోంది. దాని నిర్మాణం కోసం కొత్తగా టెండర్లను ఆహ్వానించాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఆహ్వానించాల్సిన టెండర్ల అంశంపై అధికారుల బృందం చర్చించనుంది. కాగా, రాష్ట్రానికి ఇప్పటికే మంజూరైనవి, మంజూరై నిర్మాణంలో ఉన్నవి, త్వరలో మంజూరు కాబోయేవి, డీపీఆర్ స్థాయిలో ఉన్నవి కలిపి మొత్తం 32 జాతీయ రహదారులు ప్రాజెక్టులున్నాయి. వీటన్నింటిపై అధికారుల బృందం చర్చించే అవకాశం ఉంది.

పార్టీ పేరు బీఆర్ఎస్ అయినా టీఆర్ఎస్‌గానే పిల్చుకుంటాం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, జూలై 8: తమ పార్టీ పేరు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అయినా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)గానే పిల్చుకుంటామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. టీఆర్ఎస్ అంటేనే తెలంగాణ నినాదం అని చెప్పారు. సాంకేతికంగా ఇబ్బందులు ఉంటే వాడుకలో టీఆర్ఎస్ అనే పిలుచుకుంటామని స్పష్టం చేశారు. తాముఅధికారంలో ఉన్నప్పుడు అందరినీ పార్టీలో కలుపుకొని నష్టపోయామని, తాము చేసిన పనే కాంగ్రెస్ చేస్తున్నందున భవిష్యత్తులో ఆ పార్టీ నష్టపోక తప్పదని పేర్కొన్నారు.

ఉపాధి సొమ్ము ఉద్యోగుల ఖాతాల్లోకి..

(మొదటిపేజీ తరువాయి)

తమ బంధువులైన ప్రభుత్వ ఉద్యోగులను ఉపాధి కూలీలుగా చేర్చి జాబ్ కార్డులు సృష్టించారు. కూలీలు పని చేస్తున్నట్లుగా చూపిస్తూ కూలి వేతనం వారి ఖాతాలో జమ చేస్తున్నారు. ఆ తర్వాత సదరు సొమ్మును సగం-సగం చొప్పున పంచుకుంటున్నారు. అక్రమంగా సొమ్ములు పొందుతున్న వారిలో మహబూబాబాద్ జిల్లాలోని పోలీసు కానిస్టేబుల్ నునావత్ సరోజిని, హైదరాబాద్ నిమ్స్‌కు చెందిన వైద్యుడు శివ, గార్ల పోస్టల్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న చంద్రశేఖర్, భూపాలపల్లిలోని సింగరేణి కార్మికుడు సురేష్, హైదరాబాద్‌కు చెందిన లైబ్రేరియన్ సుధాకర్, టేకుపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న పరిగిణి, భద్రాచలం ఐటీడీఏ పాఠశాలలో పని చేస్తున్న జగదీశ్‌బాబు, కామేపల్లిలో మిషన్ భగీరథలో పనిచేస్తున్న రవితోపాటు పొన్నెకల్, బర్లగూడెం గ్రామాల్లోని పలువురు వృద్ధులు, మహిళలు ఉన్నారు. ఇలా మొత్తం వంద మందిపైగా ఖాతాల్లో కూలి సొమ్ము జమ చేస్తూ స్వాహా చేస్తున్నట్లు ప్రాథమికంగా తేలింది. అక్రమాలకు పాల్పడిన వారు కామేపల్లి ఎంపీడీవో కార్యాలయం లాగిన్ ఐడీ నుంచి కాకుండా ఒక ప్రైవేట్ ఇంటర్‌నెట్ సెంటర్ ద్వారా రోజు వారీ మస్టర్లు నమోదు చేసినట్లు తేలింది. ఈ విషయమై డీఆర్‌డీఏ ఏపీఓ శిరీషను వివరణ కోరగా నిధులు మళ్లించినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. మూడు రోజుల్లో విచారణ పూర్తవుతుందని, అన్ని వివరాలు తెలియజేస్తామని చెప్పారు.



ట్రామా కేర్ సెంటర్ నమూనాతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఏడీపీ సంస్థ ఇండియా హెడ్ విజయ్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రమాద రహితంగా విజయవాడ హైవే

- 2 నెలల్లో అందుబాటులోకి ట్రామాకేర్
- క్షతగాత్రుల తరలింపునకు హెలికాప్టర్
- 6 నెలల్లో 6 లేన్ల రహదారిగా అభివృద్ధి
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ట్రామాకేర్ సెంటర్‌కు శంకుస్థాపన

కేతేపల్లి, జూలై 8: హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిని ప్రమాద రహితంగా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణం వైద్య సాయం అందేలా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ట్రామా కేర్ సెంటర్ రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. భారత్‌లో ఆటోమెటిక్ డేటాబేస్ ప్రాసెస్ (ఏడీపీ) సంస్థను ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా రూ.5కోట్ల వ్యయంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ట్రామా కేర్ సెంటర్‌ను నిర్మించనుంది. ఈ మేరకు సోమవారం ఏడీపీ ఇండియా హెడ్ విజయ్ వేములపల్లితో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ - విజయవాడ మధ్య ఉన్న జాతీయ రహదారి డెత్ రోడ్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చి ప్రమాదాలను నివారించాలని పలు మార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించానని, కేంద్ర మంత్రికి తాను కనిపించగానే డెత్‌రోడ్ నేత వస్తున్నాడని ఆటపట్టించే వారని గుర్తు చేశారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని 17 బ్లాక్‌స్పాట్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పునరావృతం కావొద్దన్న ఉద్దేశంతోనే ఏడీపీ సంస్థ సహకారంతో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోల్డెన్ అవర్(ప్రమాదం జరిగిన మొదటి గంటలో అందించే వైద్యం)లో తక్షణం వైద్యసాయం అందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా మెరుగైన వైద్యం అందించాల్సి ఉంటే హెలికాప్టర్‌ను సైతం వినియోగించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సెంటర్ నిర్మాణ పనులను రెండు నెలల్లోనే పూర్తి చేసి, సెప్టెంబరు 7వ తేదీలోగా ప్రారంభించేందుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. 65వ నెంబరు జాతీయ రహదారి వచ్చే ఆరు నెలల్లో ఆరు లేన్లుగా మారబోతుందని, దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడకు ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా కేవలం రెండు గంటల వ్యవధిలో చేరవచ్చన్నారు. మురికి కూపంగా మారిన మూసీ నది సుందరీకరణను రూ.30-40వేల కోట్ల వ్యయంతో త్వరలో చేపడతామని ఆయన చెప్పారు.

ఐదేళ్లలో 30 లక్షల ఎకరాలకు సాగునీరు

- ఏటా 6 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు
- రెండేళ్లలోపు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పూర్తి చేయాలన్న లక్ష్యం
- ప్రాధాన్య జాబితాలోకి 19 ప్రాజెక్టులు
- వీటి నిర్మాణానికి 19,289 కోట్ల వ్యయం



హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరిన్ని ఎకరాల భూమికి సాగునీరందించే దిశగా రాష్ట్ర సర్కారు ప్రణాళికలు రచిస్తోంది. వచ్చే ఐదేళ్లలో 30 లక్షల ఎకరాలు సాగులోకి తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇందులో భాగంగా ఏటా 6 లక్షల నుంచి 6.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలని యోచిస్తోంది. రాష్ట్రంలో ప్రాజెక్టులను ప్రభుత్వం నాలుగు కేటగిరీలుగా విభజించింది. ఈ ఏడాది వంద శాతం పూర్తయ్యే ప్రాజెక్టును కేటగిరీ-ఏ కింద చేర్చారు. రానున్న కాలంలో పూర్తయ్యే ప్రాజెక్టులను కేటగిరి-బీ, సీ, డీ కిందికి తెచ్చారు. నీటిపారుదల శాఖకు ఈ ఏడాది (2024-25)లో రూ.28 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ఇందులో రూ.18 వేల కోట్లు రుణాల చెల్లింపులు, రూ.2,500 కోట్ల దాకా వేతనాలకు పోను.. రూ.8 వేల కోట్లలో కొన్ని పెండింగ్ బకాయిలు చెల్లిస్తూ కొత్తగా ప్రాధాన్య జాబితాలో పెట్టుకున్న ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూ పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. వచ్చే పదేళ్లపాటు వివిధ ప్రాజెక్టుల కింద తీసుకున్న అప్పులకు అసలు/వడ్డీలు కట్టడానికే అత్యధికంగా నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ప్రధానంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కార్పొరేషన్.. కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపు ప్రక్రియ 2035 ఆగస్టులో పూర్తికానుంది. కాళేశ్వరం రుణం తీరితేనే ప్రభుత్వంపై భారం తగ్గి ఊపిరి పీల్చుకోనుంది. ఈ నేపథ్యంలో ఏటా పరిమిత బడ్జెట్‌తో ప్రాధాన్య జాబితాలో పెట్టిన ప్రాజెక్టుల కింద సాగునీరు అందించాలని నిర్ణయించింది. ఈ రెండేళ్లలో మొత్తం 19 ప్రాజెక్టులను ప్రాధాన్య జాబితాలో పెట్టి, వీటి నిర్మాణానికి రూ.19,289 కోట్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.51 లక్షల ఎకరాలు సాగులోకి రావాల్సి ఉండగా... మరో 1.78 లక్షల ఎకరాలు సాగులోకి రాలేదు. దాంతో ఈ ప్రాజెక్టును పూర్తిచేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. రెండేళ్లలోపు కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. దీని కోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.

ఆ ప్రాజెక్టులకే ప్రాధాన్యం...

సదర్‌మట్ బ్యారేజీ కింద 18,600 ఎకరాలు, నీల్వాయి ప్రాజెక్టు కింద 13 వేలు, చిన్న కాళేశ్వరం(ముక్తేశ్వర్) కింద 45 వేలు, మొడికుంటవాగు కింద 14 వేలు, చనకా కొరాటా కింద 51 వేలు, శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కింద 1.64 లక్షల ఎకరాలు, దేవాదుల ఎత్తిపోతల పథకం కింద 5.57 లక్షల ఎకరాలు, సీతారామ ఎత్తిపోతల పథకం కింద 3.20 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం కింద 46 వేల ఎకరాలు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.51 లక్షల ఎకరాలు, గట్టు-తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టును సృష్టించడం, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం కింద లక్ష ఎకరాలు, డిండి ఎత్తిపోతల పథకం కింద 3.06 లక్షల ఎకరాలు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్(ఎస్ఎల్‌బీసీ) కింద 4.12లక్షల ఎకరాలు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతంగా చేపట్టడం, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకాలతోపాటు శ్రీరాంసాగర్ రెండో దశను పూర్తిచేయడం వంటివి ప్రాధాన్య ప్రాజెక్టులుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ ప్రాజెక్టుల కింద పూర్తిస్థాయిలో సాగునీరు అందించే లక్ష్యాలు చేరుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో.. స్కిల్ యూనివర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)

రావాలని అధికారులతోపాటు, పారిశ్రామికరంగ ప్రముఖులకు సూచించారు. ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం 24 గంటల్లోనే ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన స్కిల్ యూనివర్సిటీ అంశంపై సోమవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతోపాటు పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఐటీ కంపెనీలతోపాటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ-సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అధునాతన పరిజ్ఞానం అందించేలా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించాలని అధికారులకు సూచించారు. నిర్దేశిత గడువు విధించుకుని ప్రతిపాదనలను రూపొందించాలని, అసెంబ్లీ సమావేశాలకు మరో 15 రోజుల సమయం మాత్రమే ఉన్నందున.. ప్రతి ఐదు రోజులకో సారి సమావేశం కావాలని అన్నారు. సమీక్ష సమావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్‌ను సీఎం రేవంత్ పరిశీలించారు.

ఐఎస్‌బీ తరహాలో ప్రత్యేక బోర్డు..

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకుగాను.. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలో ఒక ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాల్సి ఉంటుందని సమావేశంలో చర్చ జరిగింది. అయితే బోర్డు ఏర్పాటయ్యే వరకు సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని సీఎం నిర్ణయించారు. దీంతోపాటు యూనివర్సిటీలో ఏయే కోర్సులుండాలి, ఎలాంటి కరిక్యులమ్ అందుబాటులో ఉండాలనే విషయాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించాలన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు లభించేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులను నిర్వహించాలనే విషయాన్ని కూడా ముందుగానే అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా? ప్రభుత్వమే బాధ్యతలు చేపట్టాలా? లేదా మరేదైనా విధానాన్ని అనుసరించాలా? అనే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణుడైన కన్సల్టెంట్‌ను నియమించుకోవాలని సూచించారు. యూనివర్సిటీ ఏర్పాటు వ్యవహారాల పర్యవేక్షణకు పరిశ్రమల శాఖ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, భారత్ బయోటెక్ హరి ప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, ఐ ల్యాబ్స్ చైర్మన్ శ్రీనిరాజు తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్

నేడు పాలమూరు ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే ప్రజాప్రతినిధులతో రెండు దఫాలుగా మంత్రుల స్థాయిలో సమీక్షలు జరగ్గా.. మంగళవారం మహబూబ్‌నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. సీఎం సమీక్ష ఏర్పాట్లపై సోమవారం జలసౌధలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు.. నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొత్తగా చేపట్టే, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల వివరాలను ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.

సదర్‌మట్ ప్రారంభానికి సీఎం రేవంత్

- నెలాఖరున కార్యక్రమం.. పంద్రాగస్టున రాజీవ్ కెనాల్

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోదావరి నదిపై నిర్మిస్తున్న సదర్‌మట్ బ్యారేజీ ఈ నెలాఖరున సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈలోగా బ్యారేజీలో మిగిలిన పనులను పూర్తిచేసి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి నదిపై రూ.520 కోట్లతో ఈ బ్యారేజీని కడుతున్నారు. ఇక సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి వీలుగా చేపట్టిన రాజీవ్‌గాంధీ కెనాల్‌ను ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

18 నుంచి డీఎస్సీ పరీక్షలు!

» 11 నుంచి హాల్‌టికెట్ల జారీ

» గ్రూపు-2 పరీక్షలు వాయిదా పడే అవకాశం

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ పరీక్షలు 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి 11వ తేదీ నుంచి హాల్‌టికెట్లను జారీ చేయనున్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలు ఆగస్టు 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మరోవైపు ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్- 2 పరీక్షలు జరగనున్నాయి. అయితే డీఎస్సీ పరీక్షలు, గ్రూపు-2 పరీక్షలు వెంట వెంటనే ఉండడంతో రెండింటిలో ఒక దానికి సంబంధించిన పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలసిందే. ఈ నేపథ్యంలో డీఎస్సీ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథాతథంగా కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దాంతో గ్రూపు-2 పరీక్షలు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చార్జిషీటే సరిగా లేదు.. బెయిల్ ఇవ్వండి

» ఎమ్మెల్సీ కవిత పిటిషన్.. 12కు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి.. తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటే సరిగా లేదని, అందులో అన్నీ తప్పులే ఉన్నాయని కవిత తరఫు న్యాయవాదులు నితేశ్ రాణా, మోహిత్‌రావు సోమవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో సీబీఐ తొలుత ఒక చార్జిషీట్‌ను, ఆ తర్వాత అడిషనల్ చార్జిషీట్‌ను దాఖలు చేసిందని, అయితే.. రెండూ సక్రమంగా లేవని అన్నారు. అందుకే కవితకు బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో కవిత బెయిల్ పిటిషన్‌పై గురువారం లోపు కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని న్యాయమూర్తి కావేరి భవేజా ఆదేశించారు. మరోవైపు మద్యం పాలసీలో కవిత పాత్రపై సీబీఐ జూన్ 7న దాఖలు చేసిన అడిషనల్ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలా? వద్దా? అనే అంశంపై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా.. సీబీఐ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశం, కవిత బెయిల్ పిటిషన్.. రెండింటిపైనా శుక్రవారం (ఈ నెల 12న) మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేపడతామని న్యాయమూర్తి ప్రకటించారు.

జూలో యానిమల్ కీపర్‌పై సింహం దాడి

ఎన్‌క్లోజర్‌నుంచి బయటకు వచ్చిన మృగం

మదీన, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ జూలాజికల్ పార్కులో సోమవారం ఓ యానిమల్ కీపర్‌పై సింహం దాడి చేసింది. అతడు తప్పించుకొని బయటపడినా, ఎన్‌క్లోజర్ దాటి బయటకొచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలివి.. జూపార్కులో ప్రతిరోజు ఉదయం జంతువుల ఎన్‌క్లోజర్లను సిబ్బంది శుభ్రం చేసి వాటికి ఆహారం అందిస్తుంటారు. సోమవారం ఉదయం హుస్సేన్ అనే వ్యక్తి బోనులను శుభ్రం చేసేందుకు సింహాలున్న ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లాడు. ఓ ఆడ సింహాన్ని అదిలించి, దాన్ని శుభ్రం చేసివున్న మరో బోనులోకి పంపాడు. అయితే బయట నుంచి లాక్ చేయడం మరిచిపోయి.. మరో బోనును శుభ్రం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ బోనులోంచి వచ్చిన సింహం, హుస్సేన్‌పై పంజా విసిరింది. అతడికి చేతులు, ఛాతీపై స్వల్ప గాయాలయ్యాయి. దాన్నుంచి తప్పించుకొని భయంతో ఎన్‌క్లోజర్ నుంచి బయట పడ్డ హుస్సేన్, కంగారులో ఎన్‌క్లోజర్ గేటు మూయడం మరిచిపోయాడు. హుస్సేన్‌ను వెంటాడుతూ సింహం ఎన్‌క్లోజర్ దాటి బయటకొచ్చేసింది. అప్రమత్తమైన సిబ్బంది సింహానికి తుపాకీతో మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. స్పృహ తప్పగానే పట్టుకొని ఎన్‌క్లోజర్‌లోకి తరలించారు. హుస్సేన్‌కు ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపినట్లు తెలిసింది.

పొలాన్ని చదును చేయనివ్వట్లేదని రైతు ఆత్మహత్యాయత్నం!

ముదిగొండ, జూలై 8: తన పట్టా పొలంలో భూమిని చదును చేయకుండా కొందరు అడ్డుకుంటున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు కలుపు నివారణా మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురంలో చోటు చేసుకుంది. రైతు మేడి సీతయ్య, అతడి కుటుంబసభ్యులు కమలాపురం రెవెన్యూ పరిధిలో 5 ఎకరాల 37 గుంటల భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో తమ పొలంలో చదును చేసేందుకు వెళ్లగా కమలాపురం గ్రామస్థులు అడ్డగించారని ఆరోపిస్తూ రైతు సీతయ్య గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అతడిని ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై.. ఇరిగేషన్ డీఈ రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువు శిఖం భూమిలో సీతయ్య, ఆయన కుటుంబీకులు చెరువులోకి వర్షపు నీరు సహజసిద్ధంగా వెళ్లకుండా అక్రమంగా పెద్ద కట్ట పోశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితమే వరద నీరు పోకుండా కట్టపోయడంతో తొలగించామన్నారు. మళ్లీ అక్రమంగా కట్టను నిర్మిస్తున్నారని తెలిసి ముదిగొండ మండల ఇరిగేషన్ ఏఈ భగీరథబాబు, మత్స్య సహకార సంఘం సభ్యులు వెళ్లి ఆపాలని కోరగా.. సీతయ్య బెదిరిస్తూ పురుగుల మందు తాగాడని డీఈ ఫిర్యాదులో వివరించారు.

నాయబ్ తహసీల్దార్ల బదిలీలకు సర్క్యులర్

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నాయబ్ తహసీల్దార్లు (డీటీ), సీనియర్ అసిస్టెంట్లు, సీనియర్ స్టెనోలను బదిలీ చేసేందుకు సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ సర్క్యులర్ జారీ చేశారు. వీరి బదిలీలకు సంబంధించిన ప్రక్రియను జిల్లా కలెక్టర్లు చేపట్టాలని, ఉద్యోగులు కోరుకున్న బదిలీల స్థానాల ఐచ్ఛికాల ప్రతిపాదనలు తయారు చేసి సీసీఎల్ఏ అనుమతికి పంపించాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అంతకు ముందు ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను వారు ఇచ్చిన ఐచ్ఛికాల ద్వారా మాత్రమే అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

కల్తీ కల్లు తాగి ఒకరి మృతి

తాండూరు రూరల్, జూలై 8 : కల్తీ కల్లు ఒకరి ప్రాణం తీసింది. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినుగుర్తిలో సోమవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కొత్తపేట అంజిలప్ప(58) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి కల్లు తాగే అలవాటు ఉంది. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం గ్రామంలోని ఓ కల్లు దుకాణంలో కల్లు తాగిన అంజిలప్ప అక్కడి నుంచి నడుచుకుంటూ వస్తుండగా అస్వస్థతకు గురై అక్కడికక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతడిని ఇంటికి తీసుకెళ్లి చూడగా, అప్పటికే మృతి చెందాడు. కాగా, తాండూరు మండలంలోని పలు గ్రామాల్లో కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి?

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా?.. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ చల్లా

» జిల్లా సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం

» ఎమ్మెల్యేతో కలిసి హస్తం గూటికి చేరతారని ప్రచారం



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



విజయుడు

మహబూబ్‌నగర్/హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిరాయింపులతో కుదేలవుతున్న బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఆయన అనుచరుడైన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు.. గులాబీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలవడం ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమస్యలను పరిష్కరించాలని, రాయచూర్ నుంచి శ్రీశైలం వరకు రహదారిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని, ఆర్డీఎస్ కింద రిజర్వాయర్లు, నెట్టెంపాడు ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కోరుతూ ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను వెంకట్రామిరెడ్డి కోరారు. అయితే పైకి ఈ విషయం చెబుతున్నా.. కాంగ్రెస్‌లో చేరికపై చర్చించేందుకే సీఎంను కలిశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, వెంకట్రామిరెడ్డి పార్టీ మారితే అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా ఆయన వెంట నడవడం ఖాయమవుతుంది. ఇదే జరిగితే.. సీఎం రేవంత్ సొంత జిల్లాలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసినట్లవుతుంది. గతంలో అలంపూర్ నియోజకవర్గం జనరల్‌గా ఉన్న సమయంలో వెంకట్రామిరెడ్డి అక్కడినుంచి కాంగ్రెస్ తరఫున ఓసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఏడాదిన్నర క్రితం బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2023 ఎన్నికల్లో తన అనుచరుడైన విజయుడుకి టికెట్ ఇప్పించుకొని గెలిపించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ 12 చోట్ల గెలుపొందగా.. గద్వాల, అలంపూర్ స్థానాలను మాత్రమే బీఆర్ఎస్ గెలుచుకుంది. అయితే గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరడంతో ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు కూడా హస్తం గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. అయితే ఈ ప్రచారాన్ని వీరిద్దరు ఇప్పటిదాకా ఖండించలేదు. కానీ, అలంపూర్‌కే చెందిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ వీరి చేరికకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. చల్లా చేరికతో నియోజకవర్గంలో పట్టు కోల్పోతాననే భావనలో సంపత్ ఉన్నట్లు, అయితే పార్టీ పదవుల్లో సముచితం స్థానం కల్పిస్తామంటూ ఆయనను నాయకత్వం బుజ్జగిస్తున్నట్లు సమాచారం.

తండ్రీ కూతుళ్ల బంధంపై విషం

» లైంగిక కోణంలో చూస్తూ వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు, మరో నలుగురు.. వారిపై ఎఫ్ఐఆర్



హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారి తన తండ్రితో ఆడుకుంటున్న వీడియో చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది! కానీ.. ప్రణీత్ హన్మంతు అనే ప్రముఖ యూట్యూబర్, అతడితోపాటు మరో ముగ్గురు కలిసి.. ఆ వీడియోను వికృతమైన లైంగిక కోణంలో వక్రదృష్టితో చూస్తూ సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా.. సోషల్ మీడియా వేదికగా దారుణ వ్యాఖ్యలు చేశారు. వారిపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రణీత్‌హన్మంతు బృందం వీడియో చూసిన హీరో సాయిధరమ్ తేజ్.. తొలుత ఈ విషయాన్ని ట్విటర్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సోషల్ మీడియా ప్రపంచం నిర్దాక్షిణ్యంగా, ప్రమాదకరంగా మారిందని.. దాన్ని నియంత్రించడం కష్టం కాబట్టి తమ పిల్లల ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి రాక్షసులపై కఠినచర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం హీరో మంచు మనోజ్ కూడా అదే స్థాయిలో తన ఎక్స్ ఖాతాలో సదరు యూట్యూబర్‌పై విరుచుకుపడ్డారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో పాటుగా టెక్సస్ అధికారులు, యుఎస్ రాయబార కార్యాలయాన్ని ఆయన ట్యాగ్ చేసి ప్రణీత్ హన్మంతుపై చర్య తీసుకోవాలని కోరారు. హాస్యం పేరిట సామాజిక మాధ్యమాలలో ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న అతడి ప్రవర్తన అసహ్యకరమైనది మాత్రమే కాక, ప్రమాదకరం కూడా అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై హీరో నారా రోహిత్ కూడా ప్రభుత్వ అధికారులను ట్యాగ్ చేస్తూ యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ట్వీట్ చేశారు. డిజిటల్ కంటెంట్‌పై నియంత్రణ విధించే సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. దీంతో ఆ యూట్యూబర్ల నిర్వాకం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారు. సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చినందుకు కృతజ్ఞత తెలిపారు. చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సదరు యూట్యూబర్‌పై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రణీత్ హన్మంతుతో పాటు మిగతావారిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఎఫ్ఐఆర్ దాఖలు చేశామని.. నిందితులపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని డీజీపీ రవిగుప్తా 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. రాష్ట్ర ప్రజల భద్రతకు.. మరీ ముఖ్యంగా చిన్నారుల భద్రతకు తాము అమిత ప్రాధాన్యం ఇస్తామని.. హాస్యం పేరిట సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారుల భద్రత, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించడంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని కూడా ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ఏపీ పోలీసులతోనూ సమన్వయం చేసుకుంటున్నామని మహిళా భద్రత విభాగం అధికారులు తెలిపారు. ఇక.. హాస్యం కోసం సోషల్ మీడియాను దుర్వినియోగం చేసేవారిపై చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఈ తరహా పోస్టులు పెట్టేవారిని పోలీసులు నిరంతరం గమనిస్తూనే ఉంటారని ఆమె తెలిపారు. చిన్నారుల భద్రత, సరైన పద్ధతిలో సోషల్ మీడియా వినియోగంపై పోలీసుల ద్వారా అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టామని 'ఎక్స్' వేదికగా తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ కూడా దీనిపై స్పందించారు. "తండ్రీకూతుళ్ల విషయంలో ఆ యూట్యూబర్లు ఇలా ప్రవర్తించడం, కామెంట్స్ చేయడం నిజంగా నీచమైన విషయం. మరింత జుగుప్సాకరమైన విషయం ఏమిటంటే.. ఇదంతా వారు ఏమాత్రం సిగ్గు, భయం లేకుండా సోషల్ మీడియా వేదికగా చేయడం. దీనిపై స్పందించిన మంచు మనోజ్‌ను అభినందిస్తున్నాను. ఈ వ్యవహారంపై కఠినచర్యలు తీసుకోవాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణను కోరుతున్నాను" అని ఆమె ట్వీట్ చేశారు.

తప్పు చేశాను..

తన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. ఈ వివాదానికి మూలమైన ప్రణీత్‌హన్మంతు బేషరతు క్షమాపణలు చెప్పాడు. తాను కావాలని అలా మాట్లాడలేదని.. హాస్యం చేద్దామనుకుంటే అది గీత దాటి తప్పుగా వెళ్లిందని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు. తన కుటుంబానికి దీనితో ఎలాంటి సంబంధం లేదని, దయచేసి వారిని దీనిలోకి లాగొద్దని వేడుకున్నాడు. కాగా.. తన సినిమా ప్రమోషన్‌లో భాగంగా గతంలో ప్రణీత్ హన్మంతుకు ఇంటర్వ్యూ ఇచ్చిన హీరో కార్తికేయ, 'ఎక్స్' వేదికగా క్షమాపణలు చెప్పారు. 'సినిమా ప్రచారంలో భాగంగానే అతడికి ఇంటర్వ్యూ ఇచ్చాను. అందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నాను' అని కార్తికేయ పేర్కొన్నారు. అలాగే.. ఇటువంటి నీచమైన స్వభావం కలిగిన ప్రణీత్ హన్మంతుకు తన 'హరోం హర' సినిమాలో భాగం చేసుకున్నందుకు అసహ్యం వేస్తోంది అంటూ హీరో సుధీర్ క్షమాపణలు చెప్పారు. "అలాంటి నీచుల గురించి సోషల్ మీడియాలో మాట్లాడాలన్నా ధైర్యం చాలట్లేదు. నోటికి వచ్చినట్టు మాట్లాడ్డం భావప్రకటన స్వేచ్ఛ అనిపించుకోదు" అని సుధీర్‌బాబు పేర్కొన్నారు. మరో హీరో విశ్వక్‌సేన్ కూడా దీనిపై స్పందించారు. ఇలాంటి క్రూరులతో కలిసి సమాజంలో బతుకుతున్నందుకు బాధగా ఉందని ట్వీట్ చేశారు.

జగన్ అక్రమాస్తుల కేసులో.. నిమ్మగడ్డ ప్రసాద్‌కు చుక్కెదురు

» క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగన్ అక్రమాస్తులకు సంబంధించిన వాన్‌పిక్ కేసులో నిందితుడిగా ఉన్న నిమ్మగడ్డ ప్రసాద్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టేయాలని పేర్కొంటూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు సోమవారం కొట్టేసింది. ప్రకాశం-గుంటూరు జిల్లాల మధ్య 'వాడరేవు నిజాంపట్నం పోర్ట్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ (వాన్‌పిక్) ఏర్పాటుకు రాస్-అల్-ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా)ను ముందుపెట్టి 2008లో ర్యాక్, ఉమ్మడి ఏపీ మధ్య ఎంవోయూ జరిగేలా నిమ్మగడ్డ ప్రసాద్ చేశారని.. ఈ ప్రాజెక్టు అమలుకు వాన్‌పిక్ పోర్ట్స్‌ను స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)గా ఏర్పాటు చేసి అప్పటి కేబినెట్‌ను తప్పుదోవ పట్టించడం ద్వారా 28 వేల ఎకరాలు దక్కించుకునేలా రాయితీ ఒప్పందం రూపొందించారని సీబీఐ కేసు నమోదు చేసింది. జగన్ అందించిన సహాయ సహకారాలకు లంచంగా నిమ్మగడ్డ ఆయన కంపెనీలకు రూ.850 కోట్లు మళ్లించారని.. వాటిని పెట్టుబడులుగా చిత్రీకరించారని.. ఇదంతా క్విడ్ ప్రో కోలో భాగమని చార్జిషీట్‌లో పేర్కొంది. సీబీఐ కేసును కొట్టేయాలని నిమ్మగడ్డ 2021లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. 'జగన్ కంపెనీల్లో పిటిషనర్ అయిన నిమ్మగడ్డ ప్రసాద్ పెట్టిన పెట్టుబడులు క్విడ్ ప్రో కోలో భాగమా.. కాదా? దానిని లంచంగా భావించాలా అనే అంశాలు విచారణలోనే తేలాల్సి ఉంటుంది. వైఎస్ జగన్‌కు సంబంధించిన పలు కంపెనీల్లో నిమ్మగడ్డ ప్రసాద్ లంచాలను పెట్టుబడుల రూపంలో పెట్టారని చార్జిషీట్ వెల్లడిస్తోంది. దురుద్దేశంతో క్రిమినల్ కేసు పెట్టారన్న పిటిషనర్ ఆరోపణలను మేం ఆమోదించడం లేదు. ప్రస్తుత కేసులో నిమ్మగడ్డ పాత్రపై చాలా స్పష్టమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీ తప్పులకు తాను బాధ్యుడిని కాదని పిటిషనర్ తప్పించుకోలేరు. నిమ్మగడ్డ పిటిషన్‌ను కొట్టేస్తున్నాం' అని తన తీర్పులో పేర్కొంది.

ఆల్మట్టికి 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు.. కృష్ణా ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద..

» ఇటు మేడిగడ్డకు 23,260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» ఆదిలాబాద్ జిల్లా బేలలో 10.6 సెం.మీ. వర్షపాతం



ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిలో లోలెవల్ వంతెనపై వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టు ఆల్మట్టికి వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా సోమవారం 60,603 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో నీటి నిల్వ 66.54 టీఎంసీలకు చేరింది. తుంగభద్రకు కూడా భారీగా వరద పెరుగుతోంది. తుంగభద్ర జలాశయం పూర్తి సామర్థ్యం 105.79 టీఎంసీలు కాగా ప్రస్తుతం 30,338 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో నిల్వ 20.85 టీఎంసీలకు చేరుకుంది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటం, కృష్ణానదికి వరదలు మొదలవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరదలు ఇలాగే కొనసాగితే అల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర నిండి మరో ఐదు రోజుల్లో రాష్ట్రంలోకి కృష్ణమ్మ అడుగుపెట్టే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. జూరాలకు 2,501 క్యూసెక్కులు, శ్రీశైలానికి 443, నాగార్జునసాగర్‌కు 947 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద..

కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7 ఎగువన నిర్మించిన తాత్కాలిక కాఫర్‌డ్యాం తొలగింపు పనులు చివరిదశకు చేరుకున్నాయి. ఇక బ్యారేజీలోకి వరద కొనసాగుతోంది. సోమవారం 23,260 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా 85 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 3,414 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.

ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లలో భారీ వర్షాలు

ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు, నిజామాబాద్ జిల్లాలో మోస్తరు వానలు కురిశాయి. పలుచోట్ల వాగులు పొంగిపొర్లాయి. ఇళ్లలోకి వరద చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా బేలలో 10.6 సెం.మీ, జైనథ్‌లో 7.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కుంటాల, పొచ్చెర జలపాతాలు పరవళ్లు పెడుతున్నాయి. కెరమెరి మండలంలోని కెలి(బి), సాంగ్వి‌ల మధ్య ఉన్న లోలెవల్ వంతెన పైనుంచి వరద నీరు ఉప్పొంగి రాకపోకలకు నిలిచిపోయాయి.

ధన్వంతరి ఫౌండేషన్ మోసం..

» 25 దేశాల్లో బాధితులు!.. 4000 మంది మోసపోయారు

» బాధితులకు న్యాయం చేస్తాం: సీసీఎస్ డీసీపీ శ్వేత

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ట్రస్టులో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధిత ప్రజలకు న్యాయం చేస్తామని సీసీఎస్ డీసీపీ శ్వేత పేర్కొన్నారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో సుమారు 200 మంది బాధితులతో డీసీపీ సోమవారం సమావేశం నిర్వహించారు. ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ (డీఎఫ్ఐ) ట్రస్టు డైరెక్టర్ కమాలకర్ శర్మ, మరి కొంతమంది సభ్యులతో కలిసి బ్రాహ్మణ సంఘం పేరుతో వందలాది మందిని మోసం చేశారు. ట్రస్టులో పెట్టుబడులు పెడితే అనతి కాలంలోనే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. సుమారు రూ.514 కోట్లు దండుకున్నారు. సుస్రాల నర్సింహమూర్తి ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు. ధన్వంతరి ఫౌండేషన్‌లో పెట్టుబడి పెట్టిన వారిలో 25 దేశాలకు చెందిన వారున్నారని డీసీపీ శ్వేత తెలిపారు. దాదాపు 4000 మంది మోసపోయారని, వారికి న్యాయం చేసే దిశగా విచారణ ముమ్మరం చేశామని చెప్పారు. డీఎఫ్ఐ పేరుతో ఉన్న ఆస్తుల వివరాలను బాధితులకు ఆమె తెలియజేశారు. అంబర్‌పేటలో డీఎఫ్ఐ ఆస్పత్రి, విశాఖపట్నం (అంకపల్లి), విజయవాడ (గన్నవరం), సిద్దిపేట, మిడ్జిల్‌లో సుమారు 450 ఎకరాల భూమి, 3000 చదరపు గజాల వాణిజ్య సముదాయ స్థలం ఉన్నట్లు గుర్తించామని వివరించారు. త్వరలోనే న్యాయస్థానం అనుమతితో వాటిని వేలం వేసి, వచ్చిన సొమ్మును బాధితులకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

విద్యార్థుల బదిలీకి జేఎన్‌టీయూ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అఫిలియేటెడ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వర్సిటీ శుభవార్త చెప్పింది. విద్యార్థులు... ప్రస్తుతం తాము చదువుతున్న కాలేజీ నుంచి తమ నివాసానికి సమీపంలో ఉండే కాలేజీకి బదిలీ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అవసరమైన విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని జేఎన్‌టీయూ పరిధిలోని అన్ని ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఒక కాలేజీ నుంచి వేరొక కాలేజీకి బదిలీ కోరుకునే విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రాసెసింగ్ రుసుంగా రూ.2,000 చెల్లించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ఏదేని కాలేజీలో మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులు 2,3,4 సంవత్సరాల్లో బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ప్రస్తుతం చదువుతున్న కాలేజీ, చేరబోయే కాలేజీ ప్రిన్సిపాళ్ల నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) తెచ్చుకోవాలి.

దివ్యాంగ విద్యార్థులకు తప్పిన 'జోసా' ముప్పు

» ఐఐటీల్లో వారు సీట్లు కోల్పోకుండా మంత్రి ఉత్తమ్ చొరవ

కోదాడ, జూలై 8: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో తెలంగాణ దివ్యాంగ విద్యార్థులకు జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) కొత్త నిబంధన వల్ల కలిగే నష్టం నుంచి ఊరట లభించింది. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో వారు సీట్లు కోల్పోయే పరిస్థితి తప్పింది. ఈ ఏడాది జోసా పెట్టిన కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులకు ఇంటర్ రెండో ఏడాదిలో కనీసం అయిదు సబ్జెక్టులు ఉండాలి. దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో తెలుగు లేదా ఇంగ్లీషుల్లో ఒక సబ్జెక్టు మినహాయింపు ఉండడంతో వారికి మొత్తం 5 సబ్జెక్టులే ఉంటాయి. జోసా గణితం ఏ, బీ పేపర్లను ఒకే సబ్జెక్టుగా పరిగణించడంతో దివ్యాంగ విద్యార్థులకు సమస్య తలెత్తింది. ఫలితంగా తెలంగాణవ్యాప్తంగా 28 మంది దివ్యాంగ విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో సీట్లు కోల్పోయే పరిస్థితి ఎదురైంది. దాంతో సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కొల్లా లిఖిత్ నరసింహారెడ్డి సహా మరి కొంతమంది దివ్యాంగ విద్యార్థులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి తమ సమస్యను వివరించారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ ప్రభుత్వంతోపాటు, ఇంటర్ బోర్డుతో మాట్లాడి, దివ్యాంగ విద్యార్థుల మినహాయింపు సబ్జెక్టులను పరిగణనలోకి తీసుకుని, వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటర్ బోర్డు ఐదు సబ్జెక్టులతో కూడిన మెమోలను దివ్యాంగ విద్యార్థులకు జారీ చేసింది. తమకు అండగా ఉన్న మంత్రికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సీబీఐ పేరుతో మాజీ ఎమ్మెల్యేకు టోకరా

(మొదటి పేజీ తరువాయి)


చేస్తే మీ నంబరు కూడా అందులో ఉందని.. కాబట్టి మిమ్మల్ని కూడా అరెస్టు చేసే అవకాశముందని బెదిరించింది. మనీలాండరింగ్‌తో తనకెలాంటి సంబంధాల్లేవని జయదేవ్ చెప్పగా... తనపై ఆఫీసరుతో మాట్లాడుకోవాలని మరో వ్యక్తికి ఫోన్ కనెక్ట్ చేసింది. వెంటనే లైన్లోకి వచ్చిన మరో వ్యక్తి.. తాము ఫోన్ చేసిన విషయం ఎవరికైనా చెబితే వెంటనే అరెస్టు చేస్తామని బెదిరించారు. సీబీఐ అకౌంటు నంబరు పంపిస్తామని, ఆ అకౌంటుకు మీ ఖాతాల్లోని డబ్బు పంపిస్తే తనిఖీ చేసుకున్నాక మూడో రోజు తిరిగి మీ ఖాతాలకు వేసేస్తామని చెప్పారు. దీంతో జయదేవ నాయుడు శనివారమే బ్యాంకుకు వెళ్లి ఆరు అకౌంట్ల నుంచి ఆర్టీజీఎస్ ద్వారా రూ.50 లక్షలు వారు చెప్పిన అకౌంటు నంబరుకు పంపించారు. అమెరికాలో ఉండే కుమారుడు ఆదివారం ఫోన్ చేస్తే జరిగిందంతా వివరించారు. మోసపోయినట్టు గ్రహించిన కుమారుడు.. వెంటనే ఎస్పీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆదివారం తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజును కలసిన జయదేవ నాయుడు జరిగిన విషయం వివరించారు. ఆయన సూచన మేరకు జయదేవ నాయుడు సోమవారం సాయంత్రం పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మావోయిస్టు మాజీ నేత హుస్సేన్ అరెస్టు

» తెల్లవారు జామున జమ్మికుంటలో అదుపులోకి

» అరెస్టు చూపకపోవడంతో రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద ప్రజా సంఘాల ఆందోళన

» చివరకు సాయంత్రం అరెస్టుపై ప్రకటన



మహ్మద్ హుస్సేన్ (ఫైల్)

జమ్మికుంట/మంచిర్యాల/రామకృష్ణాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) వ్యవస్థాపకుల్లో ఒకరైన మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్ అలియాస్ రమాకాంత్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజా సంఘాల నేతల ఆందోళనల మధ్య చివరకు సాయంత్రం ఆయన అరెస్టు విషయాన్ని ప్రకటించారు. మహ్మద్ హుస్సేన్.. మందమర్రి ఏరియాలో సింగరేణి కార్మికునిగా పనిచేసే సమయంలో మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పడ్డాయి. సింగరేణిలో ఒకరోజు సమ్మెకు 8 రోజుల వేతనాన్ని కోత విధించే చట్టాన్ని వ్యతిరేకిస్తూ హుస్సేన్ నాయకత్వంలో 1981 ఏప్రిల్ 18న స్థానిక కేకే-2 గనిలో ఉద్యమం ప్రారంభమైంది. అది దశల వారీగా 56 రోజుల సమ్మెకు దారి తీసింది. తర్వాత కాలంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఝార్ఖండ్‌లో 2009లో అరెస్టయి 2013 వరకు జైలు జీవితం గడిపి బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలిశారు. అప్పట్నుంచి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా...


హుస్సేన్ అరెస్టు విషయం తెలిసి కుటుంబీకులు, ప్రజా సంఘాల నేతలు రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తామని చెప్పిన పోలీసులు.. సాయంత్రం వరకు అరెస్టును ప్రకటించలేదని మండిపడ్డారు. హుస్సేన్‌పై తప్పుడు కేసులు బనాయించారని, ఆయన్ను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. పౌరహక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శీపతి రాజగోపాల్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు ఆందోళనలో పాల్గొన్నారు.

సికాస పునర్నిర్మాణం కోసం యత్నిస్తున్నారనే..

సాయంత్రం ఏసీపీ రవికుమార్, సీఐ శశిధర్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. సికాస పునర్నిర్మాణంలో భాగంగా రామకృష్ణాపూర్ ఏరియాలో హుస్సేన్ తిరుగుతున్నారనే సమాచారం అందిందని.. ఈ క్రమంలోనే ఆర్‌కే1 ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఆయన తారస పడటంతో ఆపడానికి ప్రయత్నించగా పారిపోతుండగా పట్టుకున్నామని చెప్పారు. బ్యాగును తనిఖీ చేయగా మావోయిస్టు డాక్యుమెంట్లు, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు లభించాయని వెల్లడించారు. అతడిని విచారించగా 2020లో క్యాతనపల్లికి చెందిన గురజాల రవీందర్ ఇంట్లో సీసీ మెంటర్లు వారణాసి సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మిలు కొందరితో భేటీ అయినట్లు చెప్పారని.. ఆ సమావేశంలో తీర్మానాలకు అనుగుణంగానే హుస్సేన్ కోల్‌బెల్ట్ ఏరియాలో సికాస పునర్నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాడన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

క్లాట్ నోటిఫికేషన్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.4,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ అభ్యర్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 9 జూలై 2024
diksuchi@andhrajyothy.com

శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీలో
బీఎస్సీ ఆనర్స్ ఎన్ఆర్ఐ కోటా

సిద్దిపేట్ జిల్లా-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్‌లో బైపీసీ స్ట్రీమ్ కింద ఆరు సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. టీజీ ఈఏపీసెట్ 2024/ఏ ఇతర ఎంట్రెన్స్ ఎగ్జామ్ స్కోర్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్‌లో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.5000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** బర్త్ సర్టిఫికెట్; ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సుకు సంబంధించిన మార్కుల పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు; ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం, ఆర్నెల్ల బ్యాంక్ స్టేట్‌మెంట్.
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ(ఎస్‌వీవీయూ)- 'డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 990 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా యూనివర్సిటీ అనుబంధ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల్లో చదివినవారికి నిర్దేశించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి మూడు సెమిస్టర్లు కోర్సు వర్క్‌లు; చివరి సెమిస్టర్‌లో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ప్రోగ్రామ్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బాల బాలికలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ కోర్సు పూర్తిచేసినవారు 'బీవీఎస్సీ& ఏహెచ్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అనర్హులు. బీఎస్సీ(బయాలజీ స్ట్రీమ్) ప్రోగ్రామ్‌లు, బీ ఒకేషనల్(అగ్రికల్చర్/హార్టికల్చర్) ప్రోగ్రామ్‌లు, (బీఏ/బీకాం)(మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులు కాకుండా) ప్రోగ్రామ్‌లలో చేరవచ్చు.

శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో డిప్లొమా

సీట్లు

- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పది ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 300 సీట్లు ఉన్నాయి.
- రాష్ట్రంలోని 12 ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో ఒక్కోదానిలో 50 సీట్లు చొప్పున మొత్తం 600 సీట్లు ఉన్నాయి.
- ప్రతి పాలిటెక్నిక్ కళాశాలలో అదనంగా పది శాతం సీట్లను ఈడబ్ల్యూఎస్ వర్గానికి నిర్దేశించారు.

ప్రభుత్వ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్ కళాశాలలు: గరివిడి, మడకశిర, వెంకటరామన్నగూడెం, ఆర్‌సీ పురం, పలమనేరు, రాపూర్, బనవాసి, కొమ్మెమర్రి, సొదుం, వెన్నెలవలస



అనుబంధ పాలిటెక్నిక్‌లు


- మలినేని లక్ష్మయ్య యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్- సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా
- ఎస్ఎస్&ఎన్ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్- నర్సరావుపేట, గుంటూరు జిల్లా
- డా. అంజలీ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-నాగాయలంక, కృష్ణా జిల్లా
- శ్రీ వేంకటేశ్వర యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా
- చైతన్య భారతి యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-ప్రొద్దటూరు, కడప జిల్లా
- గోకుల్ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-బొబ్బిలి, విజయనగరం జిల్లా
- ఆదరణ యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-హంపాపురం, అనంతపురం జిల్లా
- సైద యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
- భూమా శోభానాగిరెడ్డి మెమోరియల్ ఏహెచ్‌పీ-ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
- అర్చన యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-ఈ అబ్బవరం, కడప జిల్లా
- శ్రీ వేంకటేశ్వర యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-టక్కోలు, కడప
- శ్రీనివాస యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్-జమ్మలమడుగు, కడప జిల్లా.

అర్హత: అభ్యర్థులు ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఐసీఎస్ఈ అభ్యర్థులు సైన్స్ మార్కుల కింద ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను; సోషల్ మార్కుల కింద హిస్టరీ, సివిక్స్, జాగ్రఫీ సబ్జెక్టుల్లో వచ్చిన యావరేజ్ మార్కులను ఎంటర్ చేయాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.880; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.440
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 22
- **వెబ్‌సైట్:** www.svvu.edu.in

జాతీయ అత్యవసర పరిస్థితి (1975)
ఒక సమగ్ర అవగాహన



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఎమర్జెన్సీ విధించిన రోజు రాత్రి వార్తాపత్రికల ముద్రణాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉద్యమకారులు, నాయకుల అరెస్ట్‌ల సమాచారం వ్యాప్తిచెందకుండా సమాచార సాధనాలపై పలు ఆంక్షలు విధించారు. పత్రికలు తీవ్రంగా సెన్సార్‌షిప్‌నకు గురయ్యాయి. రేడియోలో ప్రభుత్వం ఇచ్చిన వార్తా సమాచారం మాత్రమే ఎప్పటికప్పుడు ప్రసారం అవుతుండేది.

జనాభాను నియంత్రించేందుకు వివాహం కాని పురుషులకు కూడా బలవంతంగా కుటుంబ నియంత్రణ(వ్యాసెక్టమీ) ఆపరేషన్లు నిర్వహించారు. ముఖ్యంగా ప్రతిపక్ష యువ నాయకులను లక్ష్యంగా చేసుకున్నారని ఒక ఆరోపణ. ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ ఈ కార్యక్రమం అమలుకు పూనుకోవడంతోపాటు పెద్ద ఎత్తున ఇతర అధికార దుర్వినియోగాలకు పాల్పడ్డాడని ఆరోపణలు వచ్చాయి. ప్రజల ప్రాథమిక హక్కులపై సైతం ఆంక్షలు విధించారు.

'ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసు(1976)'లో అత్యవసర పరిస్థితి కాలంలో జీవించే హక్కు సహా అన్ని ప్రాథమిక హక్కులపై ప్రభుత్వం దేశ భద్రత దృష్ట్యా పరిమితులు విధించవచ్చని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీనితో ఎమర్జెన్సీ కారణంగా ప్రకరణ 359 ప్రకారం ప్రజలు జీవించే హక్కు సహా ఇతర హక్కులను కోల్పోయినట్లయింది.

అత్యవసర పరిస్థితి కాలంలో తమ చర్యల సానుకూలత కోసం, అధికారాన్ని నిలుపుకోవడానికి ఇందిర ప్రభుత్వం ప్రధానంగా మూడు రాజ్యాంగ సవరణలు చేసింది. అవి 1975లో 38వ, 39వ; 1976లో చేసిన 42వ రాజ్యాంగ సవరణ.

38వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రపతి విధించిన అత్యవసర పరిస్థితిని, రాష్ట్రపతి-గవర్నర్లు-లెఫ్ట్‌నెంట్ గవర్నర్లు జారీ చేసే ఆర్డినెన్స్‌లను కోర్టుల న్యాయ సమీక్షాధికార పరిధి నుంచి తప్పించారు. 39వ రాజ్యాంగ సవరణను ఇందిరాగాంధీ తన ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించేందుకు చేసిన సవరణగా చెబుతుంటారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలేవీ న్యాయ సమీక్ష పరిధిలోకి రాకుండా ఉండేలా ఈ సవరణను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రధాని అధికారాలను మరింతగా పెంచేలా 42వ రాజ్యాంగ సవరణ రూపొందింది. రాష్ట్ర చట్టాలను అధిగమించేందుకు, దేశంలోని ఏ ప్రాంతంలోనైనా కేంద్ర దళాలు మోహరించేందుకు, జాతి విద్రోహ కార్యక్రమాల సందర్భంలో ప్రాథమిక హక్కులను ఆసాంతం నిరాకరించే చట్టాలు అమలు చేసేందుకు, కేంద్ర, రాష్ట్ర శాసన సభల కాలపరిమితిని సైతం పెంచేందుకు ఈ సవరణ వీలు కల్పించింది. ఈ విధంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రకరణ 352 నుంచి 360 వరకు గల అత్యవసర అధికారాలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. దేశవ్యాప్తంగా చట్టాలు చేసే అధికారం కేంద్రానికే లభించి అధికార కేంద్రీకరణకు కారణమైంది.

> **ఎమర్జెన్సీ ఎత్తివేత**
>
> 1977 జనవరి 18న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మార్చి 16 నుంచి 20 వరకు ఎన్నికలు జరిగిన అనంతరం 1977 మార్చి 21న ఎమర్జెన్సీని ఎత్తివేశారు.

ఎమర్జెన్సీ అత్యవసర పరిస్థితులు

- 1977 సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.
- అత్యవసర పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ప్రాథమిక హక్కుల పరంగా భారీ సవరణలు చేసిన రాజ్యాంగాన్ని తిరిగి సంస్కరించేందుకు జనతా ప్రభుత్వం పూనుకుంది. మరో భారీ సవరణ చేసింది. అదే 1978లో రూపొందించిన 44వ రాజ్యాంగ సవరణ. దీని ప్రకారం అత్యవసర పరిస్థితి విధించిన సందర్భాల్లోనూ రాజ్యాంగ ప్రకరణ 21 ద్వారా వస్తున్న ప్రాథమిక హక్కు అయిన 'జీవించే హక్కు'ను రద్దు పరచరాదు. అదేవిధంగా 'బాహ్య కారణాల వల్ల' అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు మాత్రమే ప్రకరణ 19లోని స్వేచ్ఛలు పరిమితమవుతాయి. 'సాయుధ తిరుగుబాటు' కారణంగా అత్యవసర పరిస్థితి ప్రకటించినపుడు వీటిపై ప్రభావం ఉండదు. అత్యవసర పరిస్థితికి సంబంధించిన చట్టాలు మినహా ఇతర చట్టాల ద్వారా రాజ్యాంగ స్వేచ్ఛలపై పరిమితులు విధించేందుకు వీలు లేదు. హక్కుల రద్దు అంశాలకు సంబంధించిన ప్రకరణలైన 358, 359లను 44వ రాజ్యాంగ సవరణ పరిమితం చేసింది. అంతేకాకుండా రాష్ట్రపతి జారీ చేసిన అత్యవసర పరిస్థితి ప్రకటనను తిరిగి న్యాయ సమీక్షాధికార పరిధిలోకి తీసుకొచ్చారు.
- 'క్యాబినెట్', 'లిఖిత పూర్వక' అనే పదాలను ప్రకరణ 352(3)లో చేర్చి ప్రధాని అధ్యక్షతన గల 'క్యాబినెట్ స్థాయి మంత్రుల 'లిఖిత పూర్వక' సలహా మేరకు మాత్రమే రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తారని సూచిస్తూ జాతీయ అత్యవసర పరిస్థితి విధింపు విధానాన్ని కొంత క్లిష్టం చేశారు.
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన తేదీ నుంచి నెల రోజుల లోపు అత్యవసర పరిస్థితి ప్రకటనను ప్రత్యేక మెజారిటీతో పార్లమెంట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఒకవేళ అత్యవసర పరిస్థితి ప్రకటించే సమయానికి లోక్‌సభ రద్దయి ఉంటే తిరిగి కొత్త లోక్‌సభ ఏర్పడిన రోజు నుంచి 30 రోజులలోగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈలోగా రాజ్యసభ అత్యవసర పరిస్థితి ప్రకటనను ఆమోదించాలి. లేనిచో 30 రోజుల తరవాత అత్యవసర పరిస్థితి తనంతతానుగా రద్దయిపోతుంది.
- ఒకసారి పార్లమెంట్ ఆమోదం పొందితే అత్యవసర పరిస్థితి ఆరు నెలల వరకు అమలులో ఉంటుంది. ఈవిధంగా ఆర్నెల్లకోసారి పార్లమెంట్ ప్రత్యేక మెజారిటీతో ఆమోదించి అత్యవసర పరిస్థితిని ఎన్ని పర్యాయాలైనా పొడిగించవచ్చని సవరణ చేశారు.
- 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 352లోని 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'సాయుధ తిరుగుబాటు'అనే పదాన్ని చేర్చారు. కనుక జాతీయ అత్యవసర పరిస్థితిని(ప్రకరణ 352) విధించాలంటే విదేశీ దాడి, యుద్ధం వంటి బాహ్య కారణాలు; సాయుధ తిరుగుబాటు వంటి అంతర్గత కారణాల రీత్యా మాత్రమే వీలవుతుంది. అదేవిధంగా 44వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ అత్యవసర పరిస్థితి రద్దుకు సంబంధించిన తీర్మానాన్ని కేవలం సాధారణ మెజారిటీతో ఆమోదించినా సరిపోతుంది అని అత్యవసర పరిస్థితి రద్దును సరళతరం చేశారు. లోక్‌సభ సమావేశంలో లేకుంటే లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 1/10వ వంతు మంది సభ్యులు లోక్‌సభ ప్రత్యేక సమావేశం కోసం స్పీకర్ లేదా రాష్ట్రపతికి నోటీసు పంపినపుడు 14 రోజుల్లోపు రాష్ట్రపతి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని 44వ రాజ్యాంగ సవరణ నిర్ధారించింది.
- 1975 నుంచి 77 మధ్య కాలంలో కొనసాగిన జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో సంభవించిన అధికార దుర్వినియోగం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన వంటి అనేక ఆరోపణలపై నిజ నిర్ధారణకు జనతా ప్రభుత్వం 1977లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జయంతి లాల్ ఛోటా లాల్‌షా నేతృత్వంలో 'షా కమిషన్'ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 1978లో సమర్పించిన నివేదికలో పేర్కొన్న సంఘటనలపై విచారణ జరిపేందుకు జనతా ప్రభుత్వం ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేసింది. జనతా ప్రభుత్వం 1979లో కూలిపోయింది. 1980లో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 'షా కమిషన్' నివేదికను ఉపసంహరించింది. సుప్రీంకోర్టు కూడా ప్రత్యేక కోర్టులు చెల్లవని తీర్పు చెప్పడంతో ఈ అంకానికి తెర పడింది.
- ఎమర్జెన్సీ కాలం నాటి పరిస్థితులు, ఇందిరాగాంధీ అవలంబించిన నిరంకుశ ధోరణి మాత్రం భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పటికీ ఒక మాయని మచ్చగానే మిగిలిపోయింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్




నిజాయితీ

ఒక ఊరిలో రామయ్య, రాజయ్యఅనే ఇద్దరు వర్తకులు ఉండేవారు వారిద్దరికీ వ్యాపారంలో చాలా పోటీ ఉండేది. ఒకరోజు రాజయ్య దగ్గరికి తేజఅనే యువకుడు వచ్చిఏదైనా ఉద్యోగం ఇప్పించమని అడిగాడు. అందుకు రాజయ్య ఆ యువకుడిని అలా అడిగాడ 'ఏం బాబూ? నువ్వు ఇంతకు ముందు ఆ రామయ్య దగ్గర పని చేశావు కదూ, అక్కడ పని ఎందుకు మానేశావు? అని అడిగాడు. దానికి తేజ అక్కడ జీతం సరిపోవట్లేదు అని మానేశాను అండి అని చెప్పాడు. మరి కొన్ని రోజులు



పోయాక ఇక్కడ కూడా జీతం తక్కువ అని పని మానేస్తే ఎలా? అన్నాడు రాజయ్య ' జీతం నీకు కావలసినంత ఇస్తాను కానీ,ఆ రామయ్య వ్యాపారం గురించి నీకు తెలిసిన రహస్యాలు నాకు చెప్పాలి' అన్నాడు రాజయ్య. ఆ మాటలు విన్న తేజ 'అది మీరే మెచ్చరు అండీ. నేనలా చెబితే, రేపు మరలా నా వ్యాపార రహస్యాలు మరో చోట చెప్పవని నమ్మకం ఏమిటి?' అని మీరే అనుమానిస్తారు' అన్నాడు తేజ. ఆ మాటలకు రాజయ్య నవ్వి 'నీకు నిజాయితీఉందని చెబుతున్నావు. అదేకాక మంచి తెలివి తేటలు కూడా ఉన్నాయి' ఈ రోజునుండే పనిలో చేరుదువుగాని అంటూ తేజ కు ఉద్యోగం ఇచ్చాడు రాజయ్య.


7 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 353

6		8		2				7
	4	2					5	
	9				8			1
4			9				3	
			7		2			
	6				3			9
3			5				7	
	7					5	1	
5				1		9		4

సుడోకు - 352 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.